జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఎదుట

ప్రిన్సిపల్ బెంచ్

న్యూఢిల్లీ

మూల ఫిర్యాదు సంఖ్య 171 / 2015

(ఎంఏ నం. 510/2015, 1148/2015 & 1108/2016)

మరియు

అపీలు సం. 148/2015 &

(ఎంఏ సం.లు 1325/2015 & 1326/2015)

మరియు

అప్పీలు సం. 05/2016

(ఎంఏ సం.లు 56/2016&64/2016)

మరియు

అప్పీల్ సం. 24 ఆఫ్ 2016

(ఎంఏ సం.399/2016)

వ్యాజ్య వ్యవహారం:

1. పండాలనేని శ్రీమన్నారాయణ

శ్రీ పి. అంజయ్య గారి కుమారుడు,

ఇంటి నెంబర్. 169, ఎల్ఐజి

వూడా కాలనీ, కంద్రిక విజయవాడ, ఏపీ -520001

2. అంతటి కమలాకర్

శ్రీ ఎ. రమణయ్య గారి కుమారుడు

HYDERABAD TRANSLATION BUREAU
Siri Sai Orchids, Flat: 401, (Upper Floor),
Image Hospital Lane,
Beside Venkateshwara College,
Madhapur, Hyderabad- 500 081.
Tel: 23112244, 23114654, Mob: 9912345151/9949344849

8.12.17.



The above matter is translated from English to Telugu language, and the translation is true & correct as per our knowledge. In case of any dispute the original document is considered as final & Decisive
Translated by: Mr. T. Raghuram
Mr R.V. Ramarao

ఇంటి నెంబర్. 16/3/487

వి.కే. స్ట్రీట్, నెల్లూరు, ఏపీ -524001

.........దరఖాస్తుదారులు/అప్పీలుదారులు

వర్సెస్

1.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏపీ సెక్రటేరియట్,

హైదరాబాద్ 500001, ద్వారా

2. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, కమీషనర్,

విజయవాడ, ఏపీ-520001, ద్వారా

3.పర్యావరణ, అటవీ, వాతావరణమార్పుల మంత్రిత్వశాఖ, కార్యదర్శి,

ఇందిరా పర్యావరణ్ భవన్,

జోర్ బాగ్ రోడ్,

న్యూఢిల్లీ-110003, ద్వారా

4. పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, కార్యదర్శి,

నిర్మాణ్ భవన్, న్యూఢిల్లీ-110001, ద్వారా

5. జలవనరుల శాఖ, నదీ అభివృద్ధి, గంగా పునరుజ్జీవన మంత్రిత్వశాఖ,

కార్యదర్శి, శ్రమశక్తిభవన్,

రఫీమార్గ్, న్యూఢిల్లీ-110001, ద్వారా

........ప్రతివాదు(లు)

మరియు

ఈఏఎస్ శర్మ,

14-40-4/1, గోఖలే రోడ్,

మహారాణి పేట,

విశాఖపట్నం-530002

......అప్పీలుదారు

వర్సెస్

1. యూనియన్ ఆఫ్ ఇండియా

పర్యావరణ, అటవీ, వాతావరణమార్పుల మంత్రిత్వశాఖ, కార్యదర్శి,

ఇందిరా పర్యావరణ్ భవన్,

జోర్ బాగ్, అలీ గూంజ్

న్యూఢిల్లీ-110003, ద్వారా

2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా ప్రాధికార సంస్థ, భారత ప్రభుత్వం, పర్యావరణ, అటవీ, మంత్రిత్వశాఖ, సభ్యకార్యదర్శి,

ఏ-3 ఇండస్ట్రియల్ ఎస్టేట్,

సనత్ నగర్, హైదరాబాద్-500018, ద్వారా

3. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ,

లెనిన్ సెంటర్, గవర్నర్ పేట,

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ – 520002

4. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు, సభ్యకార్యదర్శి,

ఏ-3 ఇండస్ట్రియల్ ఎస్టేట్,

సనత్ నగర్, హైదరాబాద్-500018, ద్వారా

.......ప్రతివాదు(లు)

మరియు

1. సత్యనారాయణ బోలిసెట్టి

7 బి, గిర్ధార్ అపార్టుమెంట్లు

ఫిరోజ్ షా రోడ్ న్యూఢిల్లీ -110001

2. పండాలనేని శ్రీమన్నారాయణ

శ్రీ పి. అంజయ్య గారి కుమారుడు,

ఇంటి నంబర్. 169, ఎల్ఐజి

వూడా కాలనీ, కంద్రిక విజయవాడ, ఏపీ -520001

.......అప్పీలుదారు(లు)

వర్సెస్

1. రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ అంచనా ప్రాధికార సంస్థ (ఎస్ఈఐఏఏ),

సభ్యకార్యదర్శి, ఏ-3 ఇండస్ట్రియల్ ఎస్టేట్,

సనత్ నగర్, హైదరాబాద్-500018, ద్వారా

2. యూనియన్ ఆఫ్ ఇండియా

పర్యావరణ, అటవీ, వాతావరణమార్పుల మంత్రిత్వశాఖ, కార్యదర్శి,

ఇందిరా పర్యావరణ్ భవన్,

జోర్ బాగ్, అలీగంజ్,

న్యూఢిల్లీ-110033, ద్వారా,

3.ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, లెనిన్ సెంటర్,

గవర్నర్ పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001 ద్వారా

4. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ ప్రభావ అంచనా ప్రాధికార సంస్థ (ఎస్ఈఐఏఏ),

సభ్యకార్యదర్శి, ఏ-3 ఇండస్ట్రియల్ ఎస్టేట్,

సనత్ నగర్, హైదరాబాద్-500018, ద్వారా

........ప్రతివాదు(లు)

మరియు

ఈఏఎస్ శర్మ,

14-40-4/1, గోఖలే రోడ్,

మహారాణి పేట,

విశాఖపట్నం-530002

.......అప్పీలుదారు

వర్సెస్

1 యూనియన్ ఆఫ్ ఇండియా, పర్యావరణ, అటవీ, వాతావరణమార్పుల

మంత్రిత్వశాఖ, కార్యదర్శి,

ఇందిరా పర్యావరణ్ భవన్,

జోర్ బాగ్,  అలీగంజ్,

న్యూఢిల్లీ-110033, ద్వారా,

2. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ ప్రభావ అంచనా ప్రాధికార సంస్థ (ఎస్ఈఐఏఏ),

సభ్యకార్యదర్శి, ఏ-3 ఇండస్ట్రియల్ ఎస్టేట్,

సనత్ నగర్, హైదరాబాద్-500018, ద్వారా

3. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ,

లెనిన్ సెంటర్, గవర్నర్ పేట,

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ – 520002

4. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు, సభ్యకార్యదర్శి,
ఏ-3 ఇండస్ట్రియల్ ఎస్టేట్,
సనత్ నగర్, హైదరాబాద్-500018, ద్వారా

.........ప్రతివాదులు

ఫిర్యాదుదారు/అప్పీలుదారు తరఫు న్యాయవాదులు

మూల దరఖాస్తు సం. 171 ఆఫ్ 2015

శ్రీ. సంజయ్ పారిఖ్, శ్రీమతి పరుల్ గుప్తా, శ్రీ. శ్రావణ్ కుమార్, శ్రీ. నిన్ని సుసాన్ థామస్, అడ్వకేట్లు

అప్పీలు సం. 148/2015

రాహుల్ చౌదరి, శ్రీమతి.మీరాగోపాల్ మరియు శ్రీ. ఉత్కర్ష జైన్, అడ్వకేట్లు.
సౌరభ్ శర్మ, అడ్వకేట్

అప్పీలు సం. 05/2016

శ్రీ. సంజయ్ పారిఖ్, శ్రీమతి పరుల్ గుప్తా, శ్రీ. శ్రావణ్ కుమార్, శ్రీ నిన్ని సుసాన్ థామస్, అడ్వకేట్లు

అప్పీలు సం. 24/2016

శ్రీ. రాహుల్ చౌదరి, శ్రీమతి.మీరాగోపాల్ మరియు శ్రీ. ఉత్కర్ష జైన్, అడ్వకేట్లు

ప్రతివాదుల తరఫు న్యాయవాదులు:

మూల దరఖాస్తు సం. 171 ఆఫ్ 2015

శ్రీ. ఏ.కే . గంగులి, సీనియర్ అడ్వకేట్. శ్రీ.డి.శ్రీనివాస, ఏ.జి., శ్రీ. గుంటూరు ప్రభాకర్ మరియు శ్రీ. గుంటూరు ప్రమోద్ కుమార్, అడ్వకేట్లు.

ప్రతివాది సం. 1 & 2

శ్రీ. ఏ.కే. ప్రసాద్ మరియు శ్రీ. జయదీప్ పాటి, అడ్వకేట్లు. శ్రీ కుమార్ శశాంక్ అడ్వకేట్.

ఇంటర్వినర్ అమరావతి రాజధాని మరియు సహకార రైతు సమాఖ్య

అడ్వకేట్లు, మిస్టర్ నిఖిల్ నాయర్ మరియు శ్రీమతి స్మృతి షా, అడ్.

ఎపిపిసిబి కోసం

శ్రీ.తరుణ్ ఎ.ప్రసాదు, శ్రీ.రాహుల్ ప్రతాప్, అడ్వకేట్లు ఎంవోఈఎఫ్ కొరకు

శ్రీ.విశ్వేంద్రవర్మ, శ్రీ.యోగేష్ రాటి మరియు శ్రీ.శికా పొద్దార్, అడ్వకేట్లు ఎంవోఈఎఫ్ కొరకు

<u>అపీల్ సం. 148/2015</u>

శ్రీ రాహుల్ ప్రతాప్, అడ్వకేట్. ఎంవోఈఎఫ్ కొరకు ప్రతివాది సం. 1

శ్రీమతి. ప్రేరణ సింగ్, అడ్వకేట్. ఎస్ఇఐఎఎ కొరకు ప్రతివాది నం. 2

శ్రీ. ఏ.కే . గంగులి, సీనియర్ అడ్వకేట్, శ్రీ.డి.. శ్రీనివాస, ఏ.జి., శ్రీ . గుంటూరు ప్రభాకర్ మరియు శ్రీ. గుంటూరు ప్రమోద్ కుమార్, అడ్వకేట్లు. ప్రతివాది సం. 3 కొరకు

శ్రీ.నిఖిల్ నాయర్ మరియు శ్రీమతి. స్మృతి షా, అడ్వకేట్లు. ఎపిపిసిబి కోసం

శ్రీ.విశ్వేంద్రవర్మ, శ్రీ.యోగేష్ రాటి మరియు శ్రీ.శికా పొద్దార్, అడ్వకేట్లు ఎంవోఈఎఫ్ కొరకు

<u>అప్పీలు సం. 05/2016</u>

శ్రీ. ఏ.కే . గంగులి, సీనియర్ అడ్వకేట్. శ్రీ.డి. శ్రీనివాస, ఏ.జి., శ్రీ . గుంటూరు ప్రభాకర్ మరియు శ్రీ. గుంటూరు ప్రమోద్ కుమార్ అడ్వకేట్లు. ప్రతివాది సం. 3 కొరకు

శ్రీ.నిఖిల్ నాయర్ మరియు శ్రీమతి. స్మృతి షా, అడ్వకేట్లు. ఏపీపీసీబీ కొరకు

<u>అప్పీలు సం. 24 ఆఫ్ 2016</u>

శ్రీ. ఏ.కే . గంగులి, సీనియర్. అడ్వకేట్. శ్రీ.డి.. శ్రీనివాస, ఏ.జి., శ్రీ . గుంటూరు ప్రభాకర్ మరియు శ్రీ. గుంటూరు ప్రమోద్ కుమార్, అడ్వకేట్లు. ప్రతివాది సం. 3 కొరకు

శ్రీ రాహుల్ ప్రతాప్, అడ్వకేట్. ఎంవోఈఎఫ్ కొరకు

శ్రీమతి. ప్రేరణ సింగ్, అడ్వకేట్. ఎస్ఇఐఎఎ కొరకు

శ్రీ.నిఖిల్ నాయర్ మరియు శ్రీమతి. స్మృతి షా, అడ్వకేట్లు. ఏపీపీసీబీ కొరకు

## తీర్పు

హాజరు:

గౌరవ న్యాయమూర్తి స్వతంత్ర కుమార్ (ఛైర్ పర్సన్)

గౌరవ న్యాయమూర్తి రఘువేంద్ర ఎస్. రాథోడ్ (జ్యుడీషియల్ సభ్యుడు)

గౌరవనీయులు బిక్రంసింగ్ సాజ్వాన్ (నిపుణ సభ్యుడు)

---

రిజర్వు చేసిన తేదీ : 20 ఏప్రిల్ 2017

వెలువరించిన తేదీ: 17 నవంబర్ 2017

---

1. తీర్పును నెట్ లో ప్రచురించేందుకు అనుమతించవచ్చా?
2. తీర్పును ఎన్జీటీ రిపోర్ట్ లో ప్రచురించవచ్చా?

రఘువేంద్ర ఎస్. రాథోడ్ (జ్యుడీషియల్ సభ్యుడు)

1. ఫిర్యాదిదారు/అపీలుదారులు ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని ఏర్పాటుకు సంబంధించిన ఉమ్మడి ప్రశ్నను లేవనెత్తారు. ఇవన్నీ కూడా ఒకే ప్రశ్నకు

సంబంధించినవి కనుక అన్నిటినీ కలిపి విచారించడమైనది. అందువలన ఈ కేసులన్నిటిపై ఒకే ఆర్డరు జారీచేయడమే సరైనదని భావించడమైంది.

2. ఫిర్యాదిదారు/అపీలుదారులు రిట్ పిటిషన్ (సివిల్) సం. 99 ఆఫ్ 2015 ద్వారా కొత్త రాజధాని నిర్మాణం వల్ల ప్రజలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతుందని అంటూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. 20.03.2015 రోజున సదరు పిటిషన్ పై విచారణ జరిగింది మరియు పిటిషన్ ను ఉపసంహరించుకున్నట్టుగా భావించి మూసేయడమైంది. పిటిషనర్లు కావాలనుకుంటే తమ ఇష్టం మేరకు సరైన వేదికపై తగిన రీతిలో అభ్యర్థన చేసుకోవచ్చని కోర్టు అనుమతించింది.

3. ఫిర్యాదుదారు/అపీలుదారులు ప్రస్తుతం జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం 2010 సెక్షన్ 14(1) కింద ఈ ట్రిబ్యూనల్ విచారణ పరిధిని ఉటంకిస్తూ, అమరావతి పేరిట నిర్మిస్తున్న హరిత క్షేత్ర నూతన రాజధాని వల్ల పర్యావరణంపై, ప్రజలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతుందని, దీనిని పరిశీలించాలని ట్రిబ్యూనల్ దృష్టికి తెచ్చారు. నది వరద ప్రాంతంలో, తడినేలల్లో, నది క్యాచ్‌మెంట్ ఏరియాలోని సారవంతమైన భూముల్లో పట్టణీకరణ లేదా మౌలిక రంగ విస్తరణతో సహా ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వాన్ని మరియు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీని ఆదేశించాలని కోరారు. నది పర్యావరణం, నీటి ప్రవాహ పరిస్థితిపై పేరెన్నికగన్న సంస్థలకు చెందిన స్వతంత్ర నిపుణుల కమిటీ వేసి ఈ ప్రాంతంలో భారీస్థాయి పట్టణీకరణ, దాంతోపాటే మౌలికరంగ విస్తరణ వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా అంచనా, అలాగే సదరు కార్యకలాపాల వల్ల రైతులు,

జాలర్లతోపాటు మొత్తంగా ప్రజలపై పడే సామాజిక, జీవనాధార ప్రభావంపై పడే ప్రభావాన్ని అంచనా వేయించాల్సిందిగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖను ఆదేశించమని కూడా వేడుకున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టేముందు కృష్ణానది రెండు ఒడ్డులపై వందేళ్ల వరద మట్టాలపై పరిశీలన జరపాల్సిందిగా అందరు ప్రతివాదులను ఆదేశించాలని కూడా కోరడమైనది.

4. అప్పీలుదారులు ప్రాజెక్టుకు ఇచ్చిన పర్యావరణ అనుమతిని రద్దు చేయాలని అప్పీలు సం. 148/2015 ద్వారా కోరారు. అప్పెలెంట్స్ గుంటూరు జిల్లా తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని 217.23 ఎకరాల ప్రాంతంలో హరిత క్షేత్ర రాజధాని నగరం అమరావతి ప్రాజెక్టు నిర్మాణానికి ఎస్‌సీఐఏ ఏపీసీఆర్‌డీఏకు 9 అక్టోబర్ 2015 రోజున మంజూరు చేసిన పర్యావరణ అనుమతులు రద్దు చేయాలని కోరడమైంది. అపెలెంట్ సం. 24 ఆఫ్ 2016 కూడా ప్రాజెక్టుకు ఇచ్చిన పర్యావరణ అనుమతిని రద్దు చేయమని కోరడమైంది.

5. ప్రతివాది సం. 1 అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 కింద పునర్వ్యవస్థీకరించబడింది. 2014కు చెందిన ఈ చట్టం 01.03.2014 రోజున ప్రచురితమైంది. ఈ చట్టం కింద కొత్తరాష్ట్రమైన తెలంగాణ 02.06.2014న ఏర్పడింది. హైదరాబాద్ నగరం రెండు రాష్ట్రాలకు 10 సంవత్సరాలపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని ఈ చట్టం చెప్తున్నది. ఆ గడువు తీరిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఏర్పాటు విషయమై కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని 2014 చట్టం లోని సెక్షన్ 6 సూచిస్తున్నది.

6. చట్టంలోని నిబంధనల మేరకు భారత ప్రభుత్వ హోంమంత్రిత్వ శాఖ కొత్త రాజధానికి సంబంధించిన వివిధ అంశాల పరిశీలనకు 28.03.2014 తేదీన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. పరిశీలనాంశాల ప్రకారం, ప్రస్తుత వ్యవసాయ వ్యవస్థ కనీసస్థాయిలో స్థానభ్రంశం చెందేలా చూడడం, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ అనుకూల సుస్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం, నిర్మాణం మరియు భూసేకరణ వ్యయం తగ్గించడం, మొదలైన అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకోవాలని కమిటీకి సూచించడమైంది. సదరు కమిటీ 28.08.2014 తేదీన తన నివేదికను సమర్పించింది. సంబంధింత వర్గాలతో సమావేశాలు, ప్రజా సంప్రదింపులు, అనువైన ప్రదేశం మరియు పరిపాలనా విధులపై విశ్లేషణ అనంతరం నివేదికను రూపొందించడమైంది. కమిటీ వివిధ ప్రాంతాలను విశ్లేషిస్తూ గుంటూర, విజయవాడ మధ్య రాజధాని నిర్మాణానికి గల సాధ్యతను చర్చించింది.

7. విజయవాడ, గుంటూరు మధ్యన కృష్ణా నది ఒడ్డున రాజధాని నగర నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం 30.12.2014 తేదీన ఆర్డరు జారీచేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం 7068 చదరపు కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంగానూ, 122 చదరపు కిలోమీటర్లు రాజధానిగానూ నోటిఫై చేసింది. రాజధాని ప్రాంతం గుర్తింపు జరుగగానే అక్కడ భారీస్థాయి పట్టణీకరణను రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది

. అందుకు అనుగుణంగా 01.01.2015 తేదీన ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర భూసేకరణ పథకం (ఏర్పాటు మరియు అమలు) రూల్స్, 2015, ను నోటిఫై చేసింది. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార

సంస్థ భూయజమానులతో, రైతులతో  ఒప్పందాలు చేసుకుని కనీస ధరలకు భూమిని సేకరించాల్సి ఉంటుంది.

8. ఫిర్యాదుదారు/అపెలెంట్ వాదన ప్రకారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వంటి ప్రాంతాల్లో సుక్షేత్రమైన వ్యవసాయభూమిని స్వాధీనపర్చుకోవడం జరుగుతున్నది మరియు వ్యవసాయం నిలిచిపోతుందనే కారణంతో  భూసేకరణకు రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది.

08.12.2014న కుదిరిన ఒప్పందం మేరకు సింగపూర్ భాగస్వామిగా ఉంటుందని తెలియజేశారు. సుర్బానా ఇంటర్నేషనల్ కన్సల్టెంట్స్ మరియు జురుంగ్ కన్సల్టెంట్స్ మాస్టర్ ప్లానర్లుగా ఉంటారు. ముందస్తు మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధాని నగరం కృష్ణానదికి ఇరువైపులా 7325 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. ఈ ప్లాన్ ప్రకారం వరద ప్రాంతాలు, తడినేలలు, వ్యవసాయ భూముల్లో ప్రభుత్వం పట్టణీకరణ చేపడుతున్నదని వివరించారు.

ఫిర్యాదీ, దరఖాస్తుదారుల వాదన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 1 లక్ష ఎకరాల భూమిని కృష్ణానది ఒడ్డుల వెంబడి, క్యాచ్ మెంట్ ఏరియాలో ఈఐఏ లేకుండానే సేకరిస్తున్నది మరియు ఇది కృష్ణానది క్యాచ్ మెంట్ ఏరియాలో పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదం కలిగిస్తుంది. ప్రబుత్వం గుర్తించిన ప్రాంతాల్లో గతంలో అనేకసార్లు భారీ వరదలు వచ్చాయని కూడా అంటున్నారు.

9. రాజధాని నగరంలో తుళ్లూరు, తాడేపల్లి మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో భూమి సారవంతమైంది. వ్యవసాయం, తోటల పెంపకం, చెట్లపెంపకానికి మరియు 110 రకాల కూరగాయల సాగుకు అది అనువైంది.

అందువల్ల ఈ ప్రాంతాన్ని చెట్లు లేకుండా చదును చేయడం వల్ల వ్యవసాయం ఆగిపోతుంది మరియు ఆహార భద్రతపై ప్రభావం పడుతుంది. కృష్ణా గుంటూరు జిల్లాల్లో పెద్దఎత్తున నల్లరేగడి భూములున్నాయి ఇవి భవన నిర్మాణ ప్రాజెక్టులకు అనువైనవి కావు, ఖర్చు కూడా అధికంగా ఉంటుంది. అయినప్పటికీ అలాంటి భూముల్లో నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో ఉత్పాతాలు జరుగకుండా తగినస్థాయి అంచనాలు వేయాల్సి ఉంటుంది. కృష్ణా నదిపై నిర్మించిన అనేక డ్యాంలు, బ్యారేజీలు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరదల ఉధృతిని పెంచాయి. 2009లో ఈ ప్రాజెక్టుల వల్లే వరదల ఉధృతి పెరిగింది. ఈ ప్రాంతంలోని ప్రస్తుత మరియు రాబోయే ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని భారీవర్షాలు కురిస్తే ఏమి జరుగుతుందనేది జాగ్రత్తగా అంచనా వేయాల్సిందేనని కూడా నివేదించారు.

10. భూసేకరణ పథకం కింద భూమి సేకరించే ముందుగా 1986 పర్యావరణ పరిరక్షణ చట్టం నిబంధన కింద సవివర ఈఐఏ అధ్యయనం జరుపాల్సి ఉంటుంది. కొత్త రాజధాని ఏర్పాటు అంటే అనేక విభాగాల ఏర్పాటుతో సహా వివిధ అభివృద్ధి పనులు కూడా ఉంటాయని నివేదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన జనాభా అంచనాల ప్రకారం రాజధాని నగరం సామర్థ్యం 2050 నాటికి 2 కోట్ల మంది. ఇంకా, వేలకొలది ఎకరాల్లో వ్యవసాయం మాన్పించడం వల్ల అనేకమంది జీవనోపాధి కోల్పోతారు. ఫిర్యాదుదారు ప్రకారం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన రాజధాని రూపకల్పన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది కనుక సమగ్ర పర్యావరణ ప్రభావ అంచనా చేపట్టేందుకు ఇంకా ఎంతో సమయముంది. ఈ ప్రాంతంలో భారీస్థాయి పట్టణీకరణ చేపట్టాలంటే విస్తృతస్థాయి కార్యకలాపాలు ఉంటాయి మరియు వీటన్నిటికీ పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986, సెక్షన్ 5 కింద ఈఐఏ

జరుపాల్సి ఉంటుంది. దీని ప్రధాన లక్ష్యం ఏ ప్రాజెక్టు చేపట్టినా దానివల్ల పర్యావరణంపై పడే ప్రబావాన్ని అంచనా వేయడం. ముందస్తుగనే నివారణ చర్యలు చేపడితే పర్యావరణ ఉత్పాతాన్ని నివారించడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుంది.

11. వరద ప్రాంతాలు రక్షిత ప్రాంతాలుగా పరిగణింపబడతాయి మరియు వీటిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టడానికి వీలులేదు. పైగా, నదిని లేదా నీటి నాణ్యతను దెబ్బతీసే ప్రత్యక్ష, పరోక్ష మానవ కార్యకలాపాలన్నింటిని నిషేధించాలి లేదా క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. నది తిన్నెలు, వరద ప్రాంతాలు నదియొక్క తడినేలల వ్యవస్థలో సమగ్రభాగంగా ఉంటాయి. భూజలవృద్ధితో సహా నీటి ఆవర్తాల్లో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. నది డ్రైనేజీ బేసిన్ లేదా వరద ప్రాంతంలో భారీగా పట్టణీకరణ చేపడితే వరదల ఉధృతి మరింత పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ప్రాంతంలో అనేక తడినేలలు ఉన్నాయి. వివిధ అవసరాలలో వీటి ప్రాముఖ్యం దృష్ట్యా వీటిని పరిరక్షించాల్సి ఉంది. వరద ప్రాంతాలను దెబ్బతీయడం వల్ల భారీ పర్యావరణ, ఆర్థికనష్టాలు వాటిల్లుతాయని అనేక శాస్త్రీయ అధ్యయనాలు రుజువు చేశాయి. జల, భూ పర్యావరణాల మధ్య అనుసంధానంలో వరద ప్రాంతాలు వారధులుగా పనిచేస్తాయని నివేదించారు. నదీప్రవాహానికి, వరద ప్రాంతానికి మధ్య ఉండే జలఅనుబంధంతో కార్బన్, పోషకాల మార్పిడి జరుగుతుంది. ఇది నదియొక్క యావత్తు ఉత్పాదకతపై ప్రబావం చూపుతుంది. అందువల్ల వరద ప్రాంతాల పరిరక్షణ చాలా కీలకం.

12. ప్రస్తుత సందర్భంలో అది మరింత ప్రాముఖ్యం సంతరించుకుంది. ఎందుకంటే నిపుణుల కమిటీ దీనిని రైస్‌బౌల్‌గా (అన్నపాత్ర) పేర్కొన్నది.

13. నదులలో వరదల ఉధృతికి ఒకరకమైన కాలావధి ఉంటుంది. ఈ వరద రేఖలను ప్లానర్లు వరదలు సంభవించే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ఉపయోగించుకుంటారు. అంతర్జాతీయంగా వందేళ్ల వరద రేఖలను నదుల పర్యావరణ వ్యవస్థలో సమగ్ర భాగంగా చూస్తారు. భూజల వృద్ధి, స్వయం-శుద్ధి ఆతిథ్యం, వివిధ జంతు, వృక్షజాతులతోసహా దాని పర్యావరణ విధులు వీటి పరిధిలో జరుగుతాయి. నది మరియు ప్రతిపాదిత అభివృద్ధి రెండింటి క్షేమం కొరకు ఈ వరద ప్రాంతాన్ని అభివృద్ధి ప్లానింగ్‌కు దూరంగా ఉంచుతారు. వంతెనల నిర్మాణం, సీజనల్ వ్యవసాయం వంటివి దీనికి ప్రత్యేక మినహాయింపుగా ఉంటాయి.

14. ప్రతివాది సం.1 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రతివాది సం.2 ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ఉమ్మడిగా మూల ఫిర్యాదుకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014, ప్రకారం హైదరాబాద్ నగరం రెండు రాష్ట్రాలకు పదేళ్లకు మించకుండా ఉమ్మడి రాజధానిగా ఉంటుందని అందులో నివేదించారు. హైదరాబాద్ నుంచి ప్రభావయుతంగా పరిపాలనా వ్యవహారాలు నిర్వహించడం చాలా కష్టసాధ్యమవుతున్నది. అందువల్ల ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థలను కొత్తరాజధానికి వీలైనంత త్వరగా తరలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నది. 2014 చట్టం కింద ఏర్పాటు చేసిన కమిటీ వివిధ ప్రాంతాల సానుకూల ప్రతికూల అంశాలను మాత్రమే విశ్లేషించింది తప్ప ఏ ఒక్క ప్రాంతాన్ని ఎంపిక చేయలేదని కూడా నివేదించారు. నివేదికల పరిశీలన, వివిధ వర్గాలతో సంప్రదింపుల మీదట ప్రస్తుత ప్రాంతం నూతన రాజధాని నిర్మాణానికి అత్యంత అనువైనదనే నిర్ధారణకు వచ్చింది.

15. ప్రతివాది వాదన ప్రకారం కొత్త రాజధానిని నిర్మించాలంటే అది కేవలం ఆధునికంగా, అభివృద్ధితో కూడి మాత్రమే కాకుండా పర్యావరణపరంగా సుస్థిరత కలిగి ఉండాలనేది ముఖ్యం. ప్రతిపాదిత అభివృద్ధి ప్రాజెక్టును అన్ని సంబంధింత చట్టాలకు అనుగుణంగా, తగిన అనుమతులు పొందిన తర్వాత నిర్మించడం జరుగుతుందని తెలిపారు. సింగపూర్ ప్రభుత్వంతో భాగస్వామ్యం కలిగి ఉండాలని ప్రతివాది నిర్ణయించారు. మాస్టర్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను సుర్బానా ఇంటర్నేషనల్ కన్సల్టెంట్స్ సంస్థకు అప్పగించడమైంది. ఈ సంస్థ మౌలికంగా అత్యున్నత అంతర్జాతీయ పర్యావరణ ప్రమాణాల ప్రకారం హరిత, సుస్థిర పట్టణీకరణ సేవలు అందించడంలో పేరెన్నికగన్నది. ఈ రంగంలో సంస్థకు 50 సంవత్సరాల అనుభవం ఉన్నది. ఇంకా గమనించాల్సిన అంశమేమంటే రాజధాని ప్రాంత ఎంపిక అనేది విధానపరమైన నిర్ణయం మరియు అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది. అలాంటి విధానపరమైన నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేయడానికి వీల్లేదు. చట్టపరమైన ఉల్లంఘనలు జరిగినట్టు స్పష్టమైన, ఆధారపడదగిన, ప్రత్యేకమైన ఆధారాలు ఉన్న సందర్భంలో మాత్రమే అందుకు వీలుంటుంది.

16. ఇంకా, ప్రతివాదుల ప్రకారం అన్ని ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యకలాపాలు, విస్తరణలు మొదలైనవాటికి ఈసీ పొందేందుకు పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ 14.09.2006లో జారీచేసిన నోటిఫికేషన్ ఎస్ఓ 1533 ద్వారా విధివిధానాలను తెలియజేసింది. ఈసీ అనేది కేవలం ప్రదేశం ఆధారంగానే ఉండదు. సంబంధింత ప్రాజెక్టు వివరాలు అన్నీ ఖరారైన తర్వాత మాత్రమే అది వస్తుంది. భూమి ప్రాసెసింగ్ ఇంకా కొనసాగుతున్నది. కనుక ప్రస్తుతానికి అంతిమ ప్రణాళిక అంటూ ఏదీ లేదని, అంటే ముందస్తు ఈసీ

అనేది ఉండదని, స్పష్టంగానే తెలుస్తుంది. అందువల్ల ఈసీ పొందే దశ ఇంకా రాలేదని నివేదించారు.

17. సమర్పించిన కౌంటర్ అఫిడవిట్ ప్రకారం, 2014 చట్టం సెక్షన్ 6 మేరకు కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించాల్సి ఉండింది. రాష్ట్ర రాజధాని స్థలం ఎంపిక రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తించిన పార్లమెంటు నిపుణుల కమిటీ పాత్రను సలహా సంప్రదింపులకే పరిమితం చేసింది. అంతిమ నిర్ణయం మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేసింది. గుర్తించిన ప్రాంతానికి అన్ని ప్రాంతాలకు రాకపోకలు జరిపేందుకు రహదారి సౌకర్యముంది. ఒక రైల్వే జంక్షన్, రెండు జాతీయ రహదారులు, ఒక విమానాశ్రయం, మరియు రోడ్ కనెక్టివిటీ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అది కలుపబడి ఉన్నది.  ఈ ప్రాంతానికి అపారమైన నీటి వనరులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ అంశాలన్ని కూడా ఏ నగరం అభివృద్ధికైనా కీలకమే. ఈ సౌకర్యాలన్నీ కూడా సిద్ధంగా ఉండడంతో అదనపు ఆర్థికభారం ఉండదు మరియు తాజాగా వీటిని ఏర్పాటు చేయాల్సి వస్తే కలిగే పర్యావరణ ప్రభావం కూడా ఉండదు.

18. ప్రతివాదుల ప్రకారం, పర్యావరణ సుస్థిరతకు అత్యధిక ప్రాధన్యం ఇవ్వడం జరిగింది. జల, హరితావరణాన్ని కాపాడేందుకు వివిధ చర్యలు చేపట్టడం జరుగుతున్నది. ఘనవ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణకు, వాయుకాలుష్య నియంత్రణకు, వాక్‌వేలు, సైకిల్ ట్రాక్‌ల ద్వారా వాహనాల కాలుష్యం తగ్గించేందుకు ప్రపంచస్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతున్నది. భూమి యజమానుల భాగస్వామ్యం ఉండేలా భూసేకరణ పథకాన్ని రూపొందించడం జరిగింది. అభివృద్ధి క్రమంలో భాగస్వామ్యం

ద్వారా అనవసర వ్యాజ్యాలు, జాప్యాలు తగ్గడం వల్ల రాజధాని నిర్మాణవ్యయం కూడా తగ్గుతుంది.

19. ప్రతివాది వాదన ప్రకారం, రాజధాని నగర ప్రాంతం ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉండడంతో కృష్ణానది కుడి వరద ఒడ్డు రక్షణ సమకూరుతుంది. ఇంకా, నదికి స్పష్టమైన ప్రవాహ మార్గం ఉందని, +22.45 మీటర్ల సహజమైన, మానవ నిర్మిత కరకట్టలు ఉండడం వల్ల వరదల వరదనరు సులభంగానే వెళ్లిపోతుంది. డెల్టా ప్రాంతం ఇందుకు మినహాయింపు అయినప్పటికీ రాజధాని ప్రాంతం డెల్టాలో భాగంగా లేదు.  కనుక రాజధాని ప్రాంతం ప్రమాద పరిధిలో లేదు. భారీవర్షాలు కురిసినప్పుడు మాత్రమే సమస్య తలెత్తవచ్చు. కొండవీటి వాగు కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీరు విస్తరించవచ్చు. ఇది చిన్న సీజనల్ వాగు. దీనిపై కూడా హైడ్రలాజికల్ సర్వే జరిపి నీటిని నియంత్రించి రాజధాని ప్రాంత అవసరాలకు ఆ నీటిని ఉపయోగించుకునేందుకు సవివర ప్రణాళిక రూపొందిచడం జరుగుతున్నది. గుర్తించిన రాజధాని ప్రాంతం ఇటు వరద ప్రాంతంలో లేదు, కృష్ణానది వల్ల అది వరదలకు గురయ్యే అవకాశమూ లేదు. ఫిర్యాది ఈ విషయంలో చేసిన వాదనలు పూర్తిగా అసంబద్ధమైనవి మరియు నిరాధారమైనవని ప్రతివాదులు తెలిపారు. రాజధాని కొరకు గుర్తించిన ప్రదేశం,  ప్రాంతంలో భూకంప ప్రమాదం కూడా కనీసంస్థాయలోనే ఉంది. నిజానికి ఆధునిక భవన నిర్మాణ సాంకేతికత వల్ల రిస్క్ చాలా తక్కువ స్థాయిలోనే ఉంటుందని చెప్పవచ్చని ప్రతివాదుల వాదన.

20. రాజధాని ప్రాంతం సమీపంలోని బంగాళాఖాతం తీరానికి 60.30 కిలోమీటర్ల దూరంలో ఉన్నది కనుక తుఫాను ముప్పునకు కూడా చాలా దూరంలోనే ఉన్నదనేది ప్రతివాదుల వాదన. సర్వే, మొదలైనవి జరిపిన

తర్వాతనే, ప్రస్తుత ప్రాంతాన్ని ఎంపిక చేశామని తెలిపారు. భౌగోళిక అధ్యయనం జరిపి ఈ ప్రాంతం ఎలాంటి ప్రకృతి ఉత్పాతాలకు గురయ్యే అవకాశం లేదని నిర్ధారించుకున్న తర్వాతనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

21. ఇంకా, రాజధాని ప్రాంతానికి ఎంపిక చేసిన భూమి 1908 నుంచి పొడినేలగానే ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తున్నదని పేర్కొన్నారు. గుర్తించిన రాజధాని ప్రాంతంలో వ్యవసాయ శాఖ వివరాల ప్రకారం 2014 ఖరీఫ్‌లో మొత్తం భూమిలో 11,242 హెక్టారులు మాత్రమే విత్తారు. అందులో 1266 హెక్టార్లు మాత్రమే వరి వేశారు. యావత్తు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న మొత్తం 41,01,000 హెక్టార్ల వ్యవసాయ భూమిలో వరి విస్తారం 16,35,000 హెక్టార్లు. గుర్తించిన ప్రాంతంలో వరినాట్లు వేసింది 0.077 శాతం మాత్రమే. అంటే రాష్ట్ర ఆహార భద్రతపై ఎలాంటి ప్రభావం ఉండదనేది ప్రతివాది వాదన.

22. పేరా 3లో ఫిర్యాది ఏ ఒక్క అంశాన్ని కూడా సరిచూసుకోకుండా అస్పష్టమైన ఆరోపణలు చేశారని పేరాల వారీగా ఇచ్చిన సమాధానంలో ప్రతివాదులు తెలిపారు. పైగా కర్నాటక పరిశ్రమల బోర్డు వర్సెస్ సీ కెంచప్ప (2006) 6 ఎస్‌సీసీ కేసులో భూసేకరణకు ముందే ఎస్ఐఏ ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్టు ఫిర్యాది తప్పుడుగా ఉటంకించారని ప్రతివాది పేర్కొన్నారు.

23. గౌరవనీయ సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ఫిర్యాది రిట్ పిటిషన్‌ను, వారి తరఫు న్యాయవాది వాదనలు కోర్టు కూలంకషంగా విన్నదని పేరా 4కు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. గౌరవనీయ కోర్టు ఆ పిటిషన్ విచారణకు తిరస్కరించింది. రాజధాని ఎక్కడ ఉండాలో నిర్ణయించే

అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని అభిప్రాయ పడింది. గౌరవ కోర్టు పిటిషన్ ను కొట్టివేసే దశలో ఫిర్యాది తరఫు న్యాయవాది దాని ఉపసంహరణకు, అలాగే తగిన ఫోరం ముందు తాజాఫిర్యాదు దాఖలు చేసేందుకు అనుమతి కోరారు. దాంతో కోర్టు ఆ మేరకు కేసును ముగించింది.

24. పేరా 1 కి ఇచ్చిన సమాధానంలో, ఫిర్యాదు అపరిపక్వంగా, అక్రమరీతిలో, దురుద్దేశాలతో రూపొందించినదిగా ఉందని ప్రతివాది పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు దాఖలు చేస్తున్న సమయంలో కనీసం మాస్టర్ ప్లాన్ కూడా తయారు కాలేదని, అంతా ప్రణాళికా దశలోనే ఉందని, ఇప్పటికీ అంతేనని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ గురించి ఆందోళన చెందుతున్నట్టుగా చెప్పుకొంటూ, ఏదో జరిగిపోయిందన్న వాదన ముసుగులో సొంత ఎజెండాతో ఫిర్యాదుదారు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

25. ఫిర్యాదులో నివేదికలోని తమకు అనుకూలమైన బాగాలను ఉటంకిస్తూ, మిగతా భాగాలను వదిలేస్తూ తమ లక్ష్యానికి అనుగుణంగా ఫిర్యాదుదారు వెళ్లారని 4,5 మరియు 6 పేరాలకు ఇచ్చిన సమాధానంలో ప్రతివాదులు పేర్కొన్నారు. సంబంధిత రిపోర్టును మొత్తంగా చదవాల్సి ఉంటుంది. కమిటీ నిర్ధారణలపై విశ్లేషణ జరిపితే ప్రతిపాదిత రాజధాని ప్రాంతం అనువైనది మరియు అన్నిరకాల షరతులను పూర్తిచేసేదిగా ఉందని అవగతమవుతుంది.

26. ఇదివరకటిలా కేవలం మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లింపుతో సరిపెట్టకుండా మూల యజమానులను అభివృద్ధి పథకంలో భాగస్వాములను చేయడం జరిగిందని పేరా 7కు ఇచ్చిన సమాధానంలో

ప్రతివాదులు తెలిపారు. సదరు పథకం అటు భూయజమానికి ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రయోజనకారిగా ఉంటుంది.

27. పేరా 9 మరియు 12కు సంబంధించి, రాజధాని ప్రాంతం వరద ప్రాంతంలోగానీ, తడినేలల్లో గానీ లేదని ప్రతివాదులు తెలిపారు. ఈ గుర్తించిన ప్రాంతం సహజమైన, మరియు మానవనిర్మితమైన కరకట్టలతో సురక్షితమై ఉంది మరియు కృష్ణానది ద్వారా వరదలకు గురయ్యే అవకాశం లేదని తెలిపారు. ప్రభుత్వం 1 లక్ష ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకోబోతున్నట్టుగా ఫిర్యాది తప్పుడుగా సూచించారు. వాస్తవం ఏమిటంటే స్వాధీన ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.

28. ప్రతివాదులు 1 మరియు 2 సమర్పించిన సమాధానంపై ఫిర్యాదుదార్లు రిజాయిండర్ సమర్పించారు. ప్రత్యేకించి తిరస్కరించనందున దేనినీ ఫిర్యాదుదారు ఆమోదించినట్టుగా భావించరాదు అని అందులో తెలిపారు. మాస్టర్ ప్లాన్ ఇంకా పరిశీలనలోనే ఉందని, అదింకా ఖరారు కాలేదని ఫిర్యాదుదారు అంగీకరించారు. అంటే మాస్టర్ ప్లాన్ ఇంకా తయారు కానూలేదని, మరియు గుర్తించిన ప్రాంతంపై ప్రత్యామ్నాయ అంచనా అధ్యయనం మరియు సాధ్యాసాధ్యాల అధ్యయనం జరుగలేదని తద్వారా స్పష్టంగా తెలుస్తున్నది.

29. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య కృష్ణానది ఒడ్డున రాజధాని, రాజధాని నగరం నిర్మాణాన్ని 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద ఏర్పాటైన నిపుణుల కమిటీ తిరస్కరించినందున తన సొంత పట్టణాభివృద్ధి నిపుణుడిని సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ఫిర్యాదుదారు నివేదించారు. కొత్త రాజధాని నగారనికి సంబంధించి తగిన సిఫారసులు చేసే అధికారం చట్టపరంగా కేంద్రప్రభుత్వానికి ఉందని, రాష్ట్ర

ప్రభుత్వం ఆ సిఫారసులను తోసిరాజనడానికి వీల్లేదని, ఎందుకంటే అవి చట్టపరమైన నిబంధనల నుంచి వచ్చాయని కూడా ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

30. సదరు చట్టం కింద రష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సలహా సంఘంలో చైర్మన్ ఇద్దరు సభ్యులు, సభ్య-కన్వీనర్ తప్ప మిగిలిన మొత్తం ఐదుగురు సభ్యులూ వ్యాపార వర్గాలకు చెందినవారేనని, ప్రభుత్వం తనకు దఖలు పడిన చట్టపరంగా, రాజ్యాంగపరంగా దఖలుపడిన బాధ్యతను వ్యాపార సంస్థలకు కట్టబెట్టిందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

31. వరద ప్రాంతం, నదితిన్నెలు, తడినేలలకు సంబంధించి అఫిడవిట్ లో సమర్పించిన అంశాలపై కొన్ని వివరణలు ఫిర్యాదుదారు నివేదించారు. వరద ప్రాంత మండలీకరణ చట్టమేదీ ఆంధ్రప్రదేశ్‌లో లేదని తెలిపారు. ప్రతివాదులు రాజధాని ప్రాంతం వరద ప్రాంతంలోగానీ, తడినేలల్లోగానీ, లేదని, కృష్ణానది వరదల పరిధిలో అది లేదని తప్పుడు ప్రకటన ఇచ్చారని పేర్కొన్నారు. రాజధాని నగర ప్రాంతాన్ని చూస్తే అది నది, దాని ఉపనదులు కాలువలకే కాకుండా యావత్తు పర్యావరణ వ్యవస్థకు ఉత్పాతంలా పరిణమిస్తుందని తెలుస్తుందని పేర్కొన్నారు. నదుల కరకట్టలు, వరద ప్రాంతాలను కాపాడాల్సిన అవసరముందని అనేక తీర్పులు గతంలో వెలువడ్డాయని తెలిపారు. అవి పర్యావరణంలో భాగం కనుక అక్కడ ఎలాంటి నిర్మాణాన్ని అనుమతించరాదని వేడుకున్నారు.

32. ఫిర్యాదుదారులు చేతితో గీసిన రాజధాని ప్రాంత మ్యాపును సమర్పించారు. ఆ మ్యాపును బట్టి చూస్తే రాజధాని ప్రాంతం ప్రకాశం బ్యారేజీకి ఎగువన మరియు దిగువన ఉన్నట్టు అర్థమవుతుందని తెలిపారు. ఆ ప్రకారం పులిచింతల మరియు ప్రకాశం బ్యారేజీ మధ్యన గల యావత్తు

ప్రాంతంలో ఆనకట్టల పరంపర ఉన్నది. చేతితో గీసిన ఆ మ్యాపులో ఎడమవైపు గుంటూరు జిల్లా, కుడివైపు కృష్ణా జిల్లా ఉన్నాయి.

33. ప్రస్తుత ఫిర్యాదు ద్వారా తలెత్తే మరో ప్రశ్న దేశంలోనే అత్యంత సారవంతమైన వ్యవసాయ భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయనేది. ప్రతివాదులు పేరా 26కు అఫిడవిట్ లో ఇచ్చిన సమాధానంలో వాస్తవ పరిస్థితిని అంగీకరించేందుకు బదులుగా తెలివిగా రెవెన్యూ రికార్డులను ప్రస్తావించి రాజధాని ప్రాంత భూములు పొడిసేలలని ఆ రికార్డులలో ఉన్నట్టు తెలిపారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఈ సమాధానం తప్పుడుది మరియు తప్పుదారి పట్టించేదిగా ఉందని కూడా తెలిపారు. భూసేకరణ ముసుగులో అధికారులు రైతులను వ్యవసాయం వదిలిపెట్టేయమని వత్తిడి చేస్తున్నారని, అందుకు వారిని అనుమతించడం లేదని, దీనివల్ల వారికి తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని ఫిర్యాదుదారులు అంటున్నారు.

**34.** ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అభివృద్ధి కోసం సమగ్రమైన పర్యావరణ ప్రభావ అంచనా (ఇ.ఐ.ఎ.) వేయవలసిన అవసరం ఉందని కూడా ఈ దరఖాస్తులో కోరారు. ప్రతిపాదిత అభివృద్ధి కార్యక్రమాల, ఖర్చు-ప్రయోజనంపై విశ్లేషణ, ప్రజలపై సామాజిక ప్రభావంపై అంచనా, వారి జీవనోపాధిపై సమగ్ర అధ్యయనం జరగకపోతే ప్రభుత్వం భూ సేకరణ కూడా జరపడం సాధ్యం కాదు. వ్యవసాయ భూములకు, వరద ప్రాంతాలకు కలిగే నష్టం, మాగాణి భూములు మొదలైన వాటి మీద ప్రభావం ఉంటుంది కనక ప్రజాధనం వృధా కాకుండా ముందు జాగ్రత్త సూత్రాన్ని అమలు చేయాలని కూడా ఈ దరఖాస్తులో అభ్యర్థించారు.

**35.** బృహద్ ప్రణాళిక ఇంకా సిద్ధం కాలేదని ప్రతివాదే తెలియజేశారని కూడా దరఖాస్తుదారు పేర్కొన్నారు. బృహద్ ప్రణాళిక సిద్ధం కాకపోయినా

ప్రభుత్వం, దాని అధీనంలోని సంస్థలు ఇప్పటికే భూసేకరణ ప్రారంభించడం ఆశ్చర్యకరం. బృహద్ ప్రణాళిక ఖరారు కానిదే ప్రభుత్వం గాని, దాని అధీనంలోని సంస్థలు గాని భూసేకరణ ప్రారంభించడానికి వీలు లేదు. కొత్త రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏకపక్షమైనవి. సమాజంలోని వివిధ వర్గాల హక్కులను గుర్తించడంలో, పర్యావరణంపై ఉండే ప్రభావాన్ని గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైంది. బృహద్ ప్రణాళిక ఇంకా సిద్ధం అవుతున్న దశలోనే ఉంది కనక ముందుగానే ఇ.సి. తీసుకునే అవసరం లేదని ప్రతివాదులు ఇచ్చిన సమాధానంలో తెలియజేశారని కూడా దరఖాస్తుదారు చెప్పారు. బృహద్ ప్రణాళిక ఇంకా సిద్ధం కావాల్సిన దశలోనే ఉంది కనక ఇ.ఐ.ఎ. అనుమతి తర్వాత మాత్రమే ఉత్పన్నమవుతుందని ప్రతివాదులు ఒక వేపు వాదిస్తూనే మరో వేపున చెట్లు నరికేస్తున్నారని, నేల చదును చేస్తున్నారని కూడా దరఖాస్తుదారు తెలియజేశారు.

అందువల్ల ప్రత్యుత్తరంలో పేర్కొన్న అంశాల ఆధారంగా ట్రిబ్యునల్ మొదట దాఖలు చేసిన దరఖాస్తులో అభ్యర్థించిన అంశాలను అంగీకరించాలని దరఖాస్తుదారు కోరారు.

**36.** నాలగవ ప్రతివాది అయిన పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దరఖాస్తుదారు ఒకటవ పేరాలో చేసిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమైనవి, నిరాధారమైనవని పేర్కొన్నారు. ఎందుకంటే బంగాళా ఖాతం ప్రతిపాదిత కొత్త రాజధానికి **100** కి.మీ. కన్నా ఎక్కువ దూరంలో ఉంది. పర్యావరణ దృష్టితో, జీవావరణ దృష్టితో సున్నితమైన వరద ప్రాంతాలు, నదుల కరకట్టలు మొదలైన వాటిని అభివృద్ధి మండలంలో భాగంగా పరిగణించి బృహద్ ప్రణాళికలో వీటి గురించి జాగ్రత్త తీసుకుంటారు.

**37.** దరఖాస్తులోని **5**వ పేరాను ప్రస్తావిస్తూ నిపుణుల కమిటీ నివేదికను చేరుస్తామని చెప్పారు. కొత్త రాజధాని నిర్మాణానికి ఉన్న మూడు అవకాశాల గురించి చెప్తూ వి.జి.టి.ఎం. పట్టణ ప్రాంతాన్ని విస్తరించడం బాగా ఉపయుక్తమైన మార్గమని నిపుణుల కమిటీ సూచించిందని తెలియజేశారు.

**38.** దరఖాస్తులోని **7**వ పేరాలో అంశాలు తప్పని, నిరాధారమైనవని తోసిపుచ్చారు. భూ సేకరణకన్నా భూ సమీకరణ రెండు పక్షాలకు ప్రయోజనకరమైందని, స్వచ్ఛందమైందని, భూ సేకరణ అయితే నిర్బంధమైందని ప్రతివాదులు తెలియజేశారు. **15, 16, 17** పేరాలకు సంబంధించి వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ పరిపాలనా విభాగం వరద ప్రాంతాలను, నది సరసన ఉన్న జలాశయాలను అసలు నిర్మాణాలే చేపట్టకూడని ప్రాంతాలుగా, పరిమితంగా నిర్మాణాలు చేపట్టదగిన మండలాలుగా ప్రకటించిందని ప్రతివాదులు వివరించారు. అందువల్ల ప్రతివాదులు సమాధానం చెప్పవలసిన అగత్యం లేదు.

**39.** దరఖాస్తుదారు అభ్యర్ధనను ప్రస్తావిస్తూ ప్రతివాది చూపవలసిన పరిష్కారం గురించి దరఖాస్తులో పేర్కొన లేదని ప్రతివాదులు తెలియజేశారు. అందువల్ల న్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రతివాదులు ఇచ్చిన సమాధానాలను దృష్టిలో ఉంచుకుని ట్రిబ్యునల్ తగిన ఉత్తర్వులు జారీ చేయవచ్చు. ఈ కేసులో నాల్గవ ప్రతివాది ఇక మీదట విచారణకు హాజరు కావడం నుంచి మినహాయింపు ఇవ్వడమైంది.

**40.** ప్రతిపాదిత రాజధాని నగరం కృష్ణా నది, దాని ఉపనదుల వరద ప్రాంతాలలో ఉందనీ అందువల్ల పర్యావరణంపై, మానవ జీవితంపై, ఆస్తులపై వరద ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నది దరఖాస్తుదారు చేసిన ప్రధానమైన వాదన. తమవాదనకు మద్దతుగా దరఖాస్తుదారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

అభివృద్ధి ప్రణాళిక సొసైటీ రూపొందించిన కృష్ణా నది వరద ముంపు పటాన్ని దాఖలు చేశారు. గుంటూరు వేపు తుళ్లూరు, తాడేపల్లి, అమరావతి, కృష్ణా నది వేపు కంచికచర్ల, విజయవాడ గ్రామీణ ప్రాంతం, ఇబ్రహీంపట్నం వరద ముంపునకు గురవుతాయని ప్రణాళిక సొసైటీ పటంలో సూచించారు. అదీగాక ప్రతి సంవత్సరం ఋతుపవనాల సమయంలో రాజధాని నగర ప్రణాళిక ప్రాంతంలో **10,600** ఎకరాలు రెండు మూడు సార్లు ముంపునకు గురవుతుందని కూడా తెలియజేశారు.

కృష్ణా నదిపై ఆనకట్టలు, బారేజీల వల్ల గుంటూరు, కృష్ణా జిల్లాలలో వరదల తీవ్రత ఎక్కువైందని కూడా దరఖాస్తుదారు వాదించారు. నది డ్రైనేజీ, భూతలం, వరద ప్రాంతం కనక భారీగా పట్టణీకరణకు గురైతే వరద ముప్పు మరింత పెరుగుతుంది. వరద ప్రాంతాలకు పర్యావరణ రీత్యా ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజెప్పే ప్రచురణలను కూడా దరఖాస్తుదారు పేర్కొన్నారు.

**41.**వ్యవసాయానికి, మత్స్య పరిశ్రమను, వరద నియంత్రణకు, కాలుష్య నివారణకు, సుసంపన్నమైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి నీరందించడం కోసం మాగాణి నేలలను పరిరక్షించవలసిన అవసరం ఉందని కూడా దరఖాస్తుదార్లు వాదించారు. "భారత్ లో మాగాణి నేలల స్థితి: విస్తీర్ణం, జీవావరణ వ్యవస్థ ప్రయోజనాలు, ప్రమాదాలు, నిర్వహణ వ్యూహాలు", ఢిల్లీ విశ్వవిద్యాలయం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ రెసోర్సెస్ అనాలిసిస్ అండ్ పాలసీ జర్నల్, హైడ్రాలజి: రీజినల్ స్టడీస్ **(2014)** నుంచి ప్ర్యావరణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి దరఖాస్తుదార్లు విస్తృతంగా ఉటంకించారు.

మాగాణి నేల అంటే ఏమిటో చెప్పడానికి దరఖాస్తుదార్లు రాంసర్ కన్వెన్షన్స్ లోని నిర్వచనాలను ఉటంకించారు. ఈ నిర్వచనం ప్రకారం మాగాణి నేల అంటే "చిత్తడి, పర్రలు, ఎండి గట్టిపడిన భూములు, మొదలైనవి. మాగాణి లేదా తడి నేలలు". ఇవి సహజమైనవి, కృత్రిమమైనవి కావచ్చు. శాశ్వతమైనవి, తాత్కాలికమైనవి, నీరు నిలవ ఉండేవి, స్థిరంగా ఉండేవి, పారేవి, చవిటి, ఉప్పు నేలలు, సముద్ర జలాలతో కూడినవి, సముద్రపు పోటు లేనప్పుడు నీటి లోతు **6** మీటర్ల కన్నా ఎక్కువ లేనివి కూడా కావచ్చు. నది భూతలాలు, నది వరద ప్రాంతాలు కావచ్చు. ఇవి అన్నీ నదుల పరిసరాల్లో ఉండే నేలలు.

**42.** రాజధాని నగర ప్రాంతంలో అనేక వాగులు ఉన్నాయని కూడా దరఖాస్తుదార్లు తెలియజేశారు. మొత్తం **13500** ఎకరాలలో **10500** ఎకరాలు రాజధాని నగర ప్రాంతంలో ఉంది. మొత్తం పరీవాహక ప్రాంతం **453.05** చ.కి.మీ. కొండవీటి వాగు కొండవీడు పర్వత ప్రాంతం నుంచి వచ్చి ఎగువన కృష్ణా నదిలో ప్రస్తుతం ఉన్న ప్రకాశం బారేజీలో కలుస్తుంది. ఇది వంకర్లు తిరిగే ఉపనది. అది నదిని తిన్నగా చేయలేదు. లేదా విస్తరించలేదు. అందువల్ల శాశ్వత నష్టం కలుగుతుంది. అదీ గాక పల్లపు ప్రాంతమైన **1050** ఎకరాలను ప్రతివాదులు రాజధాని అభివృద్ధి కోసం వినియోగించుకుంటారు. తద్వారా సారవంతమైన ఈ ప్రాంతానికి తిరుగులేని విధంగా నష్టం కలుగుతుంది. కొండవీటి వాగు వరదవల్ల ఒండుమట్టి పేరుకు పోతుంది.

**43.** రాజధాని నగర ప్రాంతంలో తుళ్లూరు, తాడేపల్లి మండలాలు ఉన్నాయని దరఖాస్తుదార్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఉద్యాన వనాలు, **110** రకాల పూలు-కూరగాయాల పెంపకం కొనసాగుతోంది. అందువల్ల ఈ ప్రాంతం ఖాళీ

అయిపోతే వ్యవసాయ రంగం దెబ్బ తింటుంది. అందువల్ల ఆహార భద్రతకు నష్టం కలుగుతుంది. కృష్ణ, గుంటూరు జిల్లాల్లో నల్ల రేగడి నేలలు ఉన్నాయి. ఇవి భవన నిర్మాణాలకు అనుకూలమైనవి, ఆర్థికంగా గిట్టుబాటు అయ్యేవి కావు. అందువల్ల ఈ ప్రాంతంలో భవన నిర్మాణాలు, అభివృద్ధి కార్యకలాపాలు చేపడ్తే ముందు ముందు వినాశం కలగకుండా ముప్పు ఎంతో అంచనా వేయాలి. ముప్పు ఉన్న నేలలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నిపుణుల కమిటీ కూడా ఇదే సూచన చేసిందని దరఖాస్తుదార్లు గుర్తు చేశారు. రాజధాని నిర్మాణ పథకం కింద భూసమీకరణ జరగడానికి ముందు **1986** నాటి పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం సవివరమైన ఇ.ఐ.ఎ. అధ్యయనం జరగాలని కూడా దరఖాస్తుదార్లు అభ్యర్థించారు. రాజధాని నగర నిర్మాణంలో వివిధ ప్రభుత్వ విభాగాలు ఏర్పాటు చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుంది. నూతన రాజధాని నగరంలో **2050** నాటికి రెండు కోట్ల జనాభా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలియజేసింది. దీని వల్ల వేలాది ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములు తొలగించవలసి వస్తుంది. దానితో ప్రజల జీవనోపాధికి నష్టం కలుగుతుంది. నూతన రాజధాని నిర్మాణం ఆరంభ దశలో ఉంది కనక, తగినంత సమయం ఉంది కనక సమగ్ర పర్యావరణ ప్రభావ అధ్యయనం నిర్వహించాలి.

భూసమీకరణ **1986** నాటి పర్యావరణ పరిరక్షణ చట్టానికి పూర్తిగా విరుద్ధమైంది. ఈ చట్టానికి సంబంధించి సుప్రీం కోర్టు, ఈ ట్రిబ్యునల్ అనేక ఉత్తర్వులు జారీ చేశాయి. భూసేకరణ ద్వారా రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాంతంలోని దేశంలోని సారవంతమైన భూములను సేకరిస్తోంది. సేద్య భూములను భారీ ఎత్తున పట్టణీకరణకు ఉపయోగిస్తే కలిగే ముప్పు ఏమిటో తెలుసుకోవడానికి

ఏ అధ్యయనమూ జరగ లేదు. ఏ ఆధారమూ లేకుండా ప్రభుత్వం చెల్లించే పరిహారం తప్ప రైతులకు ఏ ఆదరువూ ఉండదు.

**44.** భూ సమీకరణ పథకం పేర అధికారులు రైతులను తమ భూమి వదులుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, వారిని సేద్యం చేసుకోనివ్వనందువల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని, వారి జీవనోపాధికి భంగం కలుగుతుందని దరఖాస్తుదారు తరఫు విజ్ఞులైన న్యాయవాది తెలియజేశారు. చాలా ప్రాంతం నది, కుంటలు, ఇతర జలాశయాలతో కూడి ఉంది. అది వ్యవసాయ ప్రాంతం. పంటపొలాల విస్తీర్ణం **543** చ.కి.మీ. ఉంటుంది. కృష్ణా జిల్లాలో కొండలు, అడవులు, సారవంతమైన వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో బీడు భూమి **6.68** శాతం. భవనాలు ఉన్న ప్రాంతం దాదాపు **5.18** శాతం ఉంది. కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని నేలలు చాలా వరకు నల్ల రేగడి నేలలు కనక నిర్మాణాలకు తగినవి కావు. ఆర్థికంగా కూడా గిట్టుబాటు కావు. ఒక వేళ ఈ నేలల్లో నిర్మాణ కార్యక్రమాలు ఏమైనా చేపడితే ముందుముందు వినాశనానికి దారి తీయకుండా ముప్పు ఎంతో తెలుసుకోవడానికి తగిన అంచనా ఉండాలి. నేల అనువైందో కాదో తెలుసుకోవాలని నిపుణుల కమిటీ కూడా సూచించింది.

**45.** నిపుణుల కమిటీ నిర్దిష్టమైన అంశాలు లేవనెత్తినా రాష్ట్ర ప్రభుత్వం **30-12-2014**న జారీ చేసిన జి.ఓ. సం. **253** ప్రకారం విజయవాడ-గుంటూరు జిల్లాల మధ్య కృష్ణా నది ఒడ్డున రాజధాని నగరం నిర్మించనున్నట్టు తెలియజేసింది. ఇలా ఎందుకు చేశారో రాష్ట్ర ప్రభుత్వానికే తెలియాలి. రాజధాని ప్రాంతానికి **7068** చ.కి.మీ. ప్రాంతాన్ని, ఆంధ్రప్రదేశ్ రాజధానికి **122** చ.కి.మీ. ప్రాంతాన్ని నిర్దేశించింది. రాజధాని నగర నిర్మాణానికి ప్రాంతాన్ని ఎంపిక చేయడానికి ముందు ఇ.ఐ.ఎ. అధ్యయనం జరగాలని

నిపుణుల సంఘం సూచించింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉన్న పర్యావరణ పరిస్థితిని, ప్రతికూల ప్రభావాన్ని గమనించకుండానే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించేసింది. రాజధాని నగరం కోసం భారీ ఎత్తున పట్టణీకరణ జరుగుతుంది కనక అనేక కార్యకలాపాలు చేపట్టవలసి వస్తుంది. ఈ ప్రాంతాలపై **1986** నాటి పర్యావరణ పరిరక్షణ చట్టం లోని **5**వ సెక్షన్ ప్రకారం ఇ.ఐ.ఎ. అధ్యయనం జరగాలి. ఈ పథకం వల్ల పర్యావరణంపై ప్రభావం ఎలా ఉంటుందో అధ్యయనం జరగాలి. దాని వల్ల విపత్తులు నివారించడానికి వీలుంటుంది. పథకాన్ని చేపట్టక ముందే ఈ అధ్యయనం జరగాలి. రాజధాని నగర ప్రాంతానికి బృహద్ ప్రణాళిక సిద్ధం కానే లేదని ప్రతివాదులే అంగీకరించారు. అంటే సాధ్యాసాధ్యాల అంచనా కాని, ప్రత్యమ్నాయంపై అంచనాగాని జరగనే లేదు. ఎంపిక చేసిన ప్రాంతం సముచితమైందో కాదో కూడా అధ్యయనం చేయలేదు.

**46.** ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణంపై సమగ్ర పర్యావరణ ప్రభావ అధ్యయనం జరగాలని కూడా దరఖాస్తుదార్లు వాదిస్తున్నారు. ప్రతిపాదిత అభివృద్ధి పథకాలన్నింటిపైన ఖర్చు-ప్రయోజనం గురించిన అంచనా, సమాజంపై పడే ప్రభావంపై అంచనా, ప్రజలపై, వారి జీవనోపాధిపై పడే ప్రభావం అంచనా లేకుండా రాష్ట్రం భూసేకరణ కూడా చేపట్టడానికి అవకాశం లేదు. డబ్బు, వ్యవసాయ భూములకు, వరద ప్రాంతాలు, మాగాణి భూములకు కలిగే నష్టం గురించి ముందు జాగ్రత్త సూత్రాన్ని వర్తింప చేయాలని దరఖాస్తుదార్లు పేర్కొన్నారు. బృహద్ ప్రణాళిక సిద్ధం కాకపోయినా ప్రభుత్వం, దాని అధీనంలోని సంస్థలు భూ సేకరణ కార్యక్రమం మొదలు పెట్టింది. బృహద్ ప్రణాళిక సిద్ధం కాకుండా ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకోవడానికి అవకాశం లేదు. రాజధాని నగరం ఏర్పాటు

చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏకపక్షంగా ఉన్నాయి. సమాజం హక్కుల మీద ఎలాంటి ప్రభావం పడుతుంది, పర్యావరణంపై అభివృద్ధి కార్యకలాపాలపై ప్రభావం ఉంటుంది. బృహద్ ప్రణాళిక ఇంకా పరిశీలనలోనే ఉంది కనక ఇ.ఐ.ఎ. అవసరం లేదని ప్రతివాదుల్లోని ఒకరు అంటున్నారు. పైగా చెట్లు నరికి వేస్తున్నారు. నేల చదును చేస్తున్నారు.

**47.** కొత్త రాజధాని నగరాన్ని ఎక్కడ ఉండాలో స్థలాన్ని ఎంపిక చేసినప్పుడు **2014** నాటి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని **6**వ సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందాలని కూడా దరఖాస్తుదార్లు వాదించారు. ఒకటవ ప్రతివాది ఈ అనుమతి పొందడంలో విఫలమయ్యారని ఈ పిటిషన్ లో పేర్కొన్నారు. వి.జి.టి.ఎం. ప్రాంతంలో అమరావతిలో రాజధాని నిర్మించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పం నిపుణుల కమిటీ సిఫార్సులకు విరుద్ధమైంది అని కూడా తెలియజేశారు. ఆ కమిటీ ఆమోదం లేకపోతే ఈ ప్రతిపాదన చెల్లదని పేర్కొన్నారు. కొత్త రాజధాని కోసం కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన సిఫార్సులు చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాటిని తోసిపుచ్చ లేదని కూడా తెలియజేశారు. ఒకటవ ప్రతివాది, రెండవ ప్రతివాది కేంద్రం నుంచి అనుమతి తీసుకోక పోగా నిపుణుల కమిటీ నివేదిక అందిన తర్వాత **30-12-2014**న రాజధాని నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం గురించి ఉత్తర్వు జారీ చేసింది. అలాగే **1-01-2015**న కొత్త రాజధానికి భూమి సేకరించడం కోసం భూసమీకరణకు శ్రీకారం చుట్టింది.

**48.** దరఖాస్తుదార్ల తరఫున రాజధాని నిర్మాణానికి వి.జి.టి.ఎం. ప్రాంతంలో స్థలం ఎంపిక చేయడాన్ని నిపుణుల కమిటీ **2015** నాటి నివేదికలో తప్పుబట్టిన పేరాలను ఉటంకించారు. సారవంతమైన వ్యవసాయ భూములకు నష్టం కలుగుతుందని, వ్యవసాయ కార్మికులు

నిర్వాసితులవుతారని కమిటీ ఈ నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల మట్టం ఎక్కువ అయినందువల్ల ఇబ్బందులు వస్తాయని కూడా తెలియజేశారు. ఈ ప్రాంతాలకు భంగం కలగడం, అభివృద్ధి లో మార్పులు రావడం, నిర్మాణ కార్యక్రమాల వల్ల జీవనోపాధి పెరగడం, అసమతులమైన అభివృద్ధి, మౌలిక సదుపాయాల మీద భారం పడడం, నీరు, డ్రైనేజీ, రోడ్ల మీద భారం పెరగడం జరుగుతుందని తెలియజేశారు. వి.జి.టి.ఎం. ప్రాంతాన్ని రాజధానిగా మార్చాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని నిపుణుల కమిటీ సూచించింది. భారీ స్థాయిలో పట్టణీకరణ జరిగేటప్పుడు పర్యావరణం మీద ప్రభావం పడుతుందని కూడా నిపుణుల కమిటీ తెలియజేసింది.

**49.** అమరావతి ప్రాంతాన్ని రాజధాని నగరంగా ఎంపిక చేయడం సముచితమైంది కాదని, దానితో పాటు వ్యవసాయ భూమి వినియోగాన్ని మార్చవలసి వస్తుందని, శివ రామకృష్ణన్ కమిటీ వి.జి.టి.ఎం. ప్రాంతాన్ని రాజధాని కోసం సిఫార్సు చేయలేదని దరఖాస్తుదారు మొదట దాఖలు చేసిన దరఖాస్తు (**2015** నాటి ఒ.ఎ. సం. **176**) లో తెలియజేశారు. అలాగే పునర్విచారణ కోరిన వారు (**2016** నాటి అప్పీలు సం. **148,** అప్పీలు సంఖ్య **5**) తెలియజేశారు. "నేషనల్ ఎన్.బి.ఎన్. వాయు స్థితిలో ధోరణులు, **2012"** నాటి సి.పి.సి.బి. నివేదిక మీద ఆధారపడి ఈ పథకం చేపట్టబోయే ప్రాంతం అత్యంత కాలుష్య భరితమైందని వాదించారు. పైగా పర్యావరణ అనుమతి ఇవ్వడానికి ఆ వ్యవస్థకు అధికారం లేదని, ఎందుకంటే ప్రధానంగా ఈ పథకంలో విమానాశ్రయం, జాతీయ రహదార్లు, పారిశ్రామిక మండలాలు, వైద్యపరమైన వ్యర్థాలు, వ్యర్థాల విసర్జన మొదలైనవి ఉంటాయి గనక అవి ఎ కాటగరీ పథకాల కిందికి వస్తాయని అప్పీలు చేసినవారు పేర్కొన్నారు.

అలాగే టి.ఒ.ఆర్. కు కట్టుబడలేదు. కీలకమైన అంశాలలో వ్యవసాయం, సామాజిక-ఆర్థిక అంశాలపై పర్యావరణ ప్రభావ అంచనా కూడా వేయలేదని గుర్తు చేశారు.

**50.** మరోవైపున ప్రతివాది తరఫు న్యాయవాదులు రాజధాని నగర ప్రాంతం వరద ప్రాంతంలో లేదని, కృష్ణా నదికి వరదలు వచ్చే ప్రాంతంలో లేదని ప్రతివాదుల తరఫు న్యాయవాది చెప్పారు. అదీగాక తక్కువ వరదలు, ఎక్కువ వరదలు ఉంటాయి. అదే విధంగా జలసంబంధ వరద ప్రాంతాలకు, భూస్వరూపాత్మక వరదలకు తేడా ఉంటుందని ప్రతివాదుల తరఫు న్యాయవాది అన్నారు. దరఖాస్తుదార్లు చూపుతున్న పటం కేవలం భూమి పొరల గురించి మాత్రమే చెప్పిందని తెలియజేశారు. ఇ.ఐ.ఎ. నివేదికలో భూస్వరూపాత్మక వ్యవహారంగానే ప్రస్తావించారు కాని భారీ వరదలు వచ్చే ప్రాంతంగా పేర్కొన లేదు. రాజధాని నగర నిర్మాణం తక్కువ వరదలొచ్చే ప్రాంతంలో ఉంది. కృష్ణా నది వరదలకు దూరంగా ఉంది. ప్రధానంగా రెండు గట్ల మధ్య ఉంది. అందువల్ల ఎలాంటి నిర్మాణ కార్యక్రమమైనా ప్రతికూల ప్రభావం ఉండదు.

**51.** అదీగాక దరఖాస్తుదారు చూపిన పటాలు స్పష్టంగా లేవని, మునకకు గురయ్యే ప్రాంతంలో లేవని, నది కరకట్టలు **20** మీటర్లకన్నా తక్కువ ఎత్తులో ఉన్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థ వరదలను ఎదుర్కోవడానికి విడుదల చేసిన మార్గదర్శకాలను **2008** జనవరిలో ప్రచురించింది. అందులో ఎ. **0.3** మీటర్ల నుంచి **0.5** మీటర్ల వరకు సమోన్నత రేఖలు చూపించారు.

**52.** రాజధాని నగర ప్రాంతం ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉందని కృష్ణ కుడి కరకట్టతో పూర్తి సురక్షితంగా ఉందని తెలియజేశారు. కట్టలు వరదలను

నిలవరించగలవు. రాజధాని నగర ప్రాంతం ఆ పరిధిలో లేదు. అందువల్ల రాజధాని నగర ప్రాంతానికి ముప్పులేదు. అదీగాక 100 ఏళ్ల వరద పరిస్థితిని చూస్తారన్న అంతర్జాతీయ ప్రమాణాన్ని దరఖాస్తుదారే అంగీకరించారు. అందువల్ల 2009 ని వరదలు వచ్చే ప్రాంతంగా పరిగణించవచ్చు. 1901-2012 మధ్య ఉన్న వరద సమాచారాన్ని పరిశీలిస్తే 104 సంవత్సరాలకు ఒక సారి వరదలు వస్తున్నాయని, 1965-2012 సమాచారాన్ని పరిగణిస్తే 124 ఏళ్లకు ఒక సారి వరదలు వస్తాయి. అందువల్ల గట్లకు/కరకట్టలకు అవతల ఉన్న ప్రాంతం వరద ప్రాంతాలలోకి రాదు.

53. రాజధాని నగరానికి నిర్దేశించిన ప్రాంతం వరద ప్రాంతమూ కాదు, మాగాణి భూములున్న ప్రాంతమూ కాదు. ప్రభుత్వం లక్ష ఎకరాల భూమి స్వాధీనం చేసుకుంటుందని దరఖాస్తుదారు ఇస్తున్న సమాచారం పొరపాటు అని, ఇంతవరకు భూసేకరణ ప్రారంభించలేదని కూడా తెలియజేశారు. ఆసుపత్రులు, వాణిజ్య కేంద్రాలు 100 ఏళ్లకు ఒక సారి వచ్చే వరద ప్రాంతాలకన్నా ఎక్కువ ఎత్తులో ఉండాలని, అందువల్ల భూవినియోగ లక్ష్యాలు మారతాయని ప్రతివాది తెలియజేశారు. అదీ గాక నిర్మించే భవనాలు 50 ఏళ్ల వర్షపాతం వల్ల మునిగే ప్రాంతానికన్నా ఎత్తులో ఉండాలి. అలాగే 25 ఏళ్ల వరదల సగటుకు, 10 ఏళ్ల వర్షపాతానికి ఇబ్బంది ఉండకూడదు. ఈ ప్రాంతంలో నిర్మించే భవనాలన్నింటినీ కాంక్రీటు స్తంభాల మీదే నిర్మించాలి. ఆటస్థలాలు, పార్కులు తరచుగా వరదలొచ్చే ప్రాంతంలో ఉండవచ్చు. వరద ప్రాంతాలలో అనుమతించిన అభివృద్ధి కార్యక్రమాలు జరగ వచ్చునని దరఖాస్తుదారు కూడా అంగీకరించారు.

**54.** కొండవీటి వాగు వర్షాకాలంలో మాత్రమే పారుతుందని ఏడాదిలో మిగతా సమయంలో నీరుండదని ప్రతివాదులు తెలియజేశారు. తాత్కాలికంగా వరదలు రావడం సహజమైన వ్యవహారం కాదు. ఇలా **30** ఏళ్లకన్నా ముందు జరగలేదు. కిందటి సారి **2014**లో వరద వచ్చింది. ఆక్రమణలు, ఇసక మేటవేయడం వల్ల వాగు ప్రవాహగతి మారింది. అందువల్ల ఇప్పుడు అందుబాటులో ఉన్న ప్రాంతం **336** ఎకరాలు, **627** ఎకరాలు. ఇందులోనే పచ్చదనం ఉండే ప్రాంతం కూడా ఉంది. మునక తాత్కాలిక వ్యవహారం కాదని, అయినా అనేక నివారణ చర్యలు తీసుకుంటున్నారని, నీరు నిలవ చేసే కుంటలు/జలాశయాలు నీరు నిలవ చేయడానికి, ఆ నీటిని ప్రతిపాదిత రాజధాని నగర అవసరాల కోసం వాడుకుంటారు. ఇ.ఐ.ఎ. నివేదికలో ఈ వాగు గురించి వివరంగా ప్రస్తావించారు. రాష్ట్ర నిపుణుల అంచనా కమిటీ, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా కమిటీ ఇ.ఐ.ఎ. నివేదికలో ప్రస్తావించారు. ఇ.ఐ.ఎ. నివేదికకు తప్పుడు వ్యాఖ్యానాలు చేసి రాజధాని నగరం మునిగిపోతుందని చెప్తున్నారు. తీవ్రమైన వరదలు, ఎగువన ఆనకట్ట తెగడం లాంటి అనూహ్యమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కీలకమైన వ్యవస్థలను **25** మీటర్ల ఎత్తున నిర్మించాలని ఇ.ఐ.ఎ. నివేదికలో తెలియజేశారు.

**55.** అభివృద్ధి ప్రక్రియలో భూ యజమానుల భాగస్వామ్యం ఉండేలా చేయడం భూ సమీకరణలో భాగం. రాజధాని నగర నిర్మాణ వ్యయం తగ్గించగలం. అనవసరమైన వాదవివాదాలకు చోటు లేకుండా ఉండాలి. రాజధాని నిర్మించాలనుకున్న ప్రాంతంలో పంటలు విత్తిన ప్రాంతం కేవలం **0.077** శాతం మాత్రమే. అందువల్ల రాజధాని నిర్మాణం వల్ల ఆహార భద్రతకు ఎలాంటి ముప్పూ ఉండదు.

ప్రభుత్వానికి భూమి అప్పగించిన వారు అభివృద్ధిలో భాగస్వాములు కావడానికే భూసమీకరణ చేపట్టారు. భూ సేకరణ పద్ధతిలో ఇలా ఉండదు. అప్పుడు మార్కెట్ విలువ ఆధారంగానే పరిహారం చెల్లిస్తారు. భూసమీకరణ పథకం వల్ల ప్రభుత్వం, భూమి యజమానులు-రెండు పక్షాలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

అదీ గాక రాజధాని నగర ప్రాంతంలో ఉన్నది నల్ల రేగడి నేలలు. అక్కడ పత్తి, తోటలు, మొక్క జొన్న పంటలు ఉంటాయి. వరి పండించే ప్రాంతం నామమాత్రమైంది. ఆ ప్రాంతంలో వ్యవసాయ కార్యకలాపాలు, ఉత్పాదకత గురించి అధ్యయనం చేసి ఎస్.ఇ.ఎ.సి., ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. కు నివేదికలు అందజేశారు. ఇది ఇ.ఐ.ఎ. నివేదికలో భాగం. అదీగాక రాజధాని నగరం **217.23** చ.కి.మీ. పరిధిలో ఉంటుంది. రైతులు దాదాపు **34000** ఎకరాల భూమి స్వచ్ఛందంగా రాజధాని కోసం అప్పగించారు. ఈ పథకం కింద భూమి యజమానులకు ఇళ్ల స్థలాలు, వాణిజ్య స్థలాలు కాకుండా ఇతర ప్రయోజనాలు కూడా అందజేస్తారు. కేంద్రప్రభుత్వం భూ సమీకరణ కింద భూములు స్వాధీనం చేసే వారికి పన్ను రాయితీ ఇచ్చింది.

**56.** పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ **14-09-2006**లో జారీ చేసిన ఉత్తర్వులో అన్ని పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు, విస్తరణకు ఇ.సి.తీసుకోవాలని నిర్దేశించింది. ప్రతిపాదిత పథకానికి సంబంధించిన వివరాలు అన్నీ అందితే ఇ.సి. తీసుకోవచ్చు. భూమి సమీకరించే పని ఇంకా కొనసాగుతోంది. కేవలం ప్రతిపాదిత బృహద్ ప్రణాళిక మాత్రమే ఉంది. దానికి ఇ.సి. అక్కర్లేదు.

**57.** పర్యావరణం సుస్థిరంగా ఉండడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని; నీటిని పరిరక్షించడం, పచ్చదనాన్ని కాపాడడానికి చర్యలు

తీసుకుంటున్నామని చెప్పారు. ఘన రూప వ్యర్థాలను నిర్వహించడానికి, మురుగును శుద్ధి చేయడానికి అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరిస్తున్నారు. నడక దారులు, సైకిళ్లు నడపడానికి ప్రత్యేక దారులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల నుంచి విడుదలయ్యే కాలుష్యాన్ని నియత్రించాలని సంకల్పించారు.

**58.** ఎస్.ఇ.ఎ.సి. సిఫార్సు మేరకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా వ్యవస్థ **09-05-2015** నాటి ఉత్తర్వు ప్రకారం అమరావతి రాజధాని నగర నిర్మాణానికి అనుమతించింది. ఎ.పి.సి.ఆర్.డి.ఎ. ప్రకారం **19-03-2016**న పర్యావరణ నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది ఇ.సి.లోని షరతుల మేరకు జరిగింది. భావన ప్రణాళిక ఆధారంగా ముసాయిదా బృహద్ ప్రణాళిక తయారు చేశారు. అన్ని చట్టాలను, ఆశయాలను, ప్రజల కోర్కెలను దృష్టిలో ఉంచుకుని ఈ పని చేశారు. ముసాయిదా బృహద్ ప్రణాళికను **26-12-2015**న వార్తా పత్రికలలో, గజెట్ లో ప్రచురించారు. **2014** నాటి ఎ.పి.సి.ఆర్.డి.ఎ. లోని **39**వ సెక్షన్ ప్రకారం ఇలా చేశారు. **14-09-2016** నాటి ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం వివిధ పథకాలను ఎ కాటగరీ పథకాలు, బి కాటగరీ పథకాలుగా వర్గీకరించారు. ఎ కాటగరీ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి, బి కాటగరీ పథకాలకు ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది అని ప్రతివాదులు తెలియజేశారు. అమరావతి పథకం బి కాటగరీ కిందకు వస్తుంది. ఎస్.ఇ.ఐ.ఎ.ఏ **2015** అక్టోబర్ **9**న నిర్వహించిన సమావేశంలో ఎస్.ఇ.ఎ.సి. సిఫార్సులను ఆమోదించి ఇ.సి. జారీ చేసింది. సుస్థిరమైన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ అనుమతి మంజూరు చేశారు.

**59.** నగర ప్రణాళికలో విమానాశ్రయ నిర్మాణం ఏదీ లేదు. పైగా ఈ పథకాన్ని ప్రతిపాదించిన వారికి జాతీయ రహదార్లు నిర్మించే అధికారం లేదు. ప్రతిపాదిత నగరంలో మూడు పారిశ్రామిక మండలాలు వేర్వేరు చోట్ల ఉన్నాయి. అందులో ఏదీ **500** హెక్టార్ల కన్నా ఎక్కువ లేదు. ఇ.ఐ.ఎ. ఉత్తర్వు లోని షెడ్యూలు ప్రకారం అన్ని పథకాలు వైద్యజీవ వ్యర్థాల శుద్ధి కిందకే వస్తాయి. వాటిని బి కాటగరీ పథకాలుగా భావిస్తారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ, గ్రాంట్ల ప్రకారం రాజధాని నగర నిర్మాణానికి ఓ ప్రాంతాన్ని ఎంపిక చేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. నిపుణుల కమిటీ సిఫార్సులు మాత్రమే చేస్తుంది. రాజధాని ఎక్కడి నుంచి పని చేయాలో నిర్ణయించడం కోసం ప్రాంతాన్ని ఎంపిక చేయడం ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. వి.జి.టి.ఎం ప్రాంతంలో రాజధాని నగరం ఉండకూడదని నిపుణుల కమిటీ చెప్పిందని దరఖాస్తుదారు చేసిన వాదనను ప్రతివాదులు తిరస్కరించారు. మునుపటి ఆంధ్రప్రదేశ్ ను దృష్టిలో ఉంచుకుని నిపుణుల కమిటీ వి.జి.టి.ఎం. ను ప్రస్తావించిందని తెలియజేశారు. అప్పటికి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ లేదు. అలాగే నిపుణుల కమిటీ వి.జి.టి.ఎం. లోని **7600** చ. కి.మీ. పరిధిని కూడా పరిగణనలోకి తీసుకుంది. కాని రాజధాని నగరం **217.23** చ.కి.మీ.కే పరిమితం.

**60.** ప్రతివాదుల వాదన ప్రకారం నిపుణుల సంఘం విజయవాడ-గుంటూరు, గ్రేటర్ విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి- కాళహస్తి అనే నాలుగు ప్రాంతాలను పరిశీలించింది. వీటిలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని 'డిస్ట్రిక్ట్ సస్టెయినబులిటీ ఇండెక్స్'ని రూపొందించి దాని ప్రకారం సదరు జిల్లాలలో ఉన్న విపత్కర పరిస్థితులు (ప్రకృతి విపత్తుల సహా),

రహదారి సౌలభ్యం, నీటి లభ్యత, భూ లభ్యత (బంజరు భూములు, పంట భూములు) ఇంకా స్థానిక అభివృద్ధి ఆధారంగా ర్యాంకులను కేటాయించింది. విజయవాడ, కృష్ణాజిల్లాలోని పట్టణ ప్రాంతాలు, గుంటూరు నగరం; గుంటూరు జిల్లాలు రహదారి సౌలభ్యం విషయంలో తొలి రెండు స్థానాలలో నిలిచాయి. అలాగే స్థానిక అభివృద్ధి విషయంలో మొదటి, మూడవ స్థానాలను... నీటి లభ్యత విషయంలో రెండు, మూడు స్థానాలను పొందాయి. ఈ కారణంగా రాజధాని నగరం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఉపయుక్తం అని ప్రతివాదుల సంతృప్తి చెందారు.

కోర్టు పరిశీలన:

**61:** పైన పేర్కొన్న వివరాలు, రెండు పక్షాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను మేము పరిగణనలోకి తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణం కోసం **2014** చట్టంలో పార్లమెంటు చేసిన సూచనల ఆధారంగా ఈ వివరాలను పరిశీలించవలసి ఉంటుంది.

పార్లమెంటు **2014** ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని **(20146 లో)** ప్రవేశపెట్టింది. **2014** మార్చి **1,** న ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదాన్ని పొందింది. జూన్ **2, 2014**న ఈ చట్టం అమలులోకి రావడంతో పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజించారు. నూతన రాష్ట్రమయిన తెలంగాణలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, వరంగల్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మంతో పాటుగా బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు, సీతారామనగరం, కొండ్రేక రెవెన్యూ గ్రామాలను కలిగి ఉంటుంది. ఆయా ప్రాంతాలు ఇకమీదట ఆంధ్రప్రదేశ్ నుంచి వేరు అయినట్టుగా భావించాల్సి ఉంటుంది. చట్టంలోని

సెక్షను 3 ప్రకారం పైన పేర్కొన్న ప్రాంతాలు కాకుండా ఇతర ప్రాంతాలు నూతన ఆంధ్రప్రదేశ్లో ఉంటాయి.

చట్టంలోని సెక్షను 5 ప్రకారం, రాబోయే పదేళ్ల వరకూ హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. ఈ గడువు ముగిసిన తర్వాత హైదరాబాదు, తెలంగాణ రాష్ట్రానికే రాజధానిగా ఉంటుంది కాబట్టి ఈలోగా నూతన ఆంధ్రప్రదేశ్కు ఒక రాజధానిని ఏర్పాటుచేసుకోవలసి ఉంటుంది.

62. హైదరాబాదు అభివృద్ధిలో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి అందిన నిధులు, వనరులు, శ్రమల భాగస్వామం కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అధికభాగం పరిశ్రమలు, సంస్థలు... హైదరాబాదు, పరిసర ప్రాంతాలలోనే కేంద్రీకృతం అయి ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ 58 శాతం అప్పులను తన వంతుగా పొందగా, తెలంగాణ 42 శాతం అప్పులను తన వంతుగా పొందింది (2014 చట్టంలోని సెక్షను 54). ఇందులో ఎక్కువభాగం హైదరాబాదుని అభివృద్ధి చేసేందుకు చేసిన వ్యయమే! పదేళ్లకు మించకుండా హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా ఉండబోతోంది కాబట్టి, వీలైనంత త్వరగా నూతన రాజధాని నిర్మాణాన్ని చేపట్టాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ మీద ఉన్నది. హైదరాబాదు ఉమ్మడి రాజధానే కానీ కేంద్రపాలిత ప్రాంతం కాదు. ఆ కారణంగా హైదరాబాదు మీద పాలనాపరమైన, చట్టపరమైన అధికారాలు తెలంగాణ రాష్ట్రానికే ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాదు మీద ఎటువంటి అధికారం కానీ, అక్కడ ఉత్పత్తి అయ్యే ఆదాయం మీద హక్కు కానీ ఉండవు. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే గుజరాత్ తర్వాత మిగులు ఆదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ అవతరించగా, ఆంధ్రప్రదేశ్ భారీ అప్పులతో ఉండిపోయింది.

ఫలితంగా హైదరాబాదు నుంచి విడివడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోజువారీ పాలనలో అనేక సమస్యలను, ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. పైగా ప్రభుత్వ యంత్రాంగం యావత్తు హైదరాబాదులోనే స్థిరపడి ఉండటం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోవలసి వస్తోంది. నిజానికి అక్కడ పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కోవడం వల్ల, వారి పనితీరు కూడా ప్రభావితం అవుతోంది.

**63. 2014** చట్టంలోని సెక్షను **6** ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఒక నిపుణుల సంఘాన్ని నియమించాల్సి ఉంటుంది. ఈ సంఘం ఆంధ్రప్రదేశ్లో నూతన రాజధానికి సంబంధించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించి తగిన సలహా సూచనలతో... పునర్విభజన చట్టం అమలులోకి వచ్చిన ఆరునెలల లోపు ఒక నివేదికను రూపొందించవలసి ఉంటుంది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం **28** మార్చి **2014**న శ్రీ. కె.సి. శివరామకృష్ణన్ నేతృత్వంలో నూతన రాజధానికి సంబంధించిన సలహా సూచనలను అందించేందుకు ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. సదరు కమిటీ **31** ఆగస్టు, **2014**లోగా అంటే అయిదు నెలలలోగా తన నివేదికను సమర్పించాల్సి ఉంది. అయితే **2014** ఏప్రిల్ **7- 30** మధ్య జాతీయ, రాష్ట్రస్థాయి ఎన్నికలు ఉన్నందున ఆ కమిటీ ఆంధ్రప్రదేశ్లోని అన్ని ప్రదేశాలనూ పర్యటించలేకపోయింది. ప్రభుత్వ యంత్రాంతం ఎన్నికలతోనూ, జూన్ **8, 2014**న వెలువడిన ఎన్నికల ఫలితాల తర్వాత ఏర్పాటు కాబోయే నూతన ప్రభుత్వం హడావుడిలో ఉండటం వల్ల... కమిటీ కొన్ని ప్రదేశాలను మాత్రమే పరిశీలించగలిగింది.

**64.** పైన పేర్కొన్న కమిటీ రాజధాని నిర్మాణంలో దేశీయంగానూ, అంతర్జాతీయంగా ఉన్న పూర్వానుభవాలను బట్టి.... అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయడానికి కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది. ప్రాముఖ్యతల ఆధారంగా ఆయా ప్రమాణాలను దిగువ సూచిస్తున్నాము

(ఇ) నీటి లభ్యత

(ఈ) ఇతర ప్రాంతాలకు రాకపోకలకు అవకాశం

(ఈఇ) శీతోష్ణస్థితి అనుకూలత

(ఇవ్) సమీపంలో పట్టణప్రదేశం కలిగి ఉండటం, భూలభ్యత, స్థిరాభివృద్ధి, నిర్మాణాలు తేలికగానూ చవకగానూ చేయగలగడం.

(వ్) నిర్మాణాలను ప్రభావంతంగా చేపట్టేందుకు అయ్యే ఖర్చు

(వి) స్థలాకృతి

(వీ) మధ్యలో ఉండడం

(వీఇ) రక్షణ, భద్రతాపరమైన అంశాలు

(ఇక్ష్) చారిత్రక ప్రాధాన్యత

**(నిపుణుల సంఘం నివేదికలోని 118-119 పుటల ఆధారంగా)**

**65.** ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో **13** జిల్లాలు ఉన్నాయి. వీటిలో **9** కోస్తా జిల్లాలు కాగా, మరో నాలుగు జిల్లాలు కరువుపీడిత ప్రాంతాలు. వీటిలో అనంతపూరు జిల్లా దేశంలోని ధార్ ఎడారిలోని జైసల్మేర్ జిల్లా తర్వాత అత్యంత పొడిబారిన ప్రాంతం. పైగా కోస్తా జిల్లాల గుండా పశ్చిమ కనుమల ప్రయాణం సాగుతుంది. ఇక ఈశాన్య జిల్లాలలోని విస్తారమైన అటవీ ప్రాంతాలలో గిరిజన తెగలవారు నివసిస్తున్నారు. ఆయా ప్రదేశాలు నక్సల్ ప్రభావిత ప్రాంతాలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని ప్రాంతాలనీ, అమరావతి రాజధానిగా రూపొందుతున్న నవ్యాంధ్రప్రదేశ్లోని ప్రాంతాలనూ ఆర్/**3**,

ఆర్/4 అనుబంధాలలో గమనించవచ్చు. ఈ కోస్తా ప్రాంతాలు తరచూ తుపానుబారిన పడుతూ ఉంటాయి. ఈమధ్యకాలంలోనే 2014 అక్టోబరులో హుద్హుద్ తుపాను, డిసెంబరు 2016లో వరద తుఫానులు ఈ ప్రాంతాలను తాకాయి. వీటిలో హుద్హుద్ తుపాను తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. ముఖ్యంగా విశాఖపట్నం నగరాన్ని ప్రభావితం చేసిన ఈ తుపాను 22 వేల కోట్ల రూపాయల మేర నష్టాన్ని కలిగించింది.

66. నూతన రాజధాని నిర్మాణం కోసం విశాఖపట్నం, పరిసర ప్రాంతాలతో కూడిన గ్రేటర్ విశాఖపట్నాన్ని కూడా కమిటీ పరిశీలించింది. విశాఖపట్నం తూర్పుకనుమల చెంతన ఉండటమే కాకుండా, బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్నది. ఈ జిల్లాలో 40 శాతం అటవీ భూములు ఉండటమే కాకుండా, పెద్ద ఎత్తున గిరిజన జనాభా కూడా ఉంది. ఇది తూర్పు నావికా దళానికి కేంద్ర స్థావరంగా ఉన్నది. ఇక నెల్లూరు నగరం రాష్ట్రంలోని ఆగ్నేయమూలగా ఉండి, తమిళనాడుకి సరిహద్దుగా ఉంది. నెల్లూరులోని తీరప్రాంతం చాలా ఎక్కువ. పైగా ఈ తీర ప్రాంతం తరచూ తుపానులకి గురవుతూ ఉంటుంది. దేశంలో రెండో పెద్ద ఉప్పునీటి సరస్సయిన పులికాట్ సరస్సు, పక్షుల అభయారణ్యం కూడా నెల్లూరులో ఉన్నాయి. ఇస్రో తన అంతరిక్ష ప్రయోగాల కోసం ఉపయోగించే శ్రీహరికోట కూడా ఇక్కడే ఉండటం వల్ల, ఈ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి పరచడం సాధ్యం కాకపోవచ్చు. తిరుపతి- కాళహస్తి ప్రాంతాన్ని కూడా కమిటీ పరిశీలించింది. అయితే ఈ ప్రదేశం రాష్ట్రానికి దక్షిణ కొసన ఉండటం వల్ల తగినన్ని సానుకూలాంశాలు కనిపించలేదు. రహదారి సౌలభ్యం, నీటి లభ్యత విషయాలలో అతి తక్కువ మార్కులతో ప్రస్తుతం ఉన్న 13 జిల్లాలలో 9వ స్థానాన్ని పొందింది. ఈ ప్రాంతంలో ఒక జాతీయవనం, వన్యజీవిల సంరక్షణా కేంద్రం కూడా ఉన్నాయి.

**67.** వివిధ జిల్లాలలో రాజధాని ఏర్పాటు ఎంత వరకు సాధ్యమో పరిగణించేందుకు సంఘం అయిదు ప్రమాణాలను నిర్దేశించింది. అవి నీటి లభ్యత, ఉపద్రవాలు, రహదారి సౌలభ్యం, భూమి లభ్యత, స్థానిక ప్రగతి. వీటన్నింటి ఆధారంగా రూపొందించిన సూచి ఆధారంగా నాలుగు ప్రాంతాలు రాజధాని నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు కమిటీ నిర్ధరించింది.

(ఇ) విజయవాడ పరిసర ప్రాంతం

(ఈ) గ్రేటర్ విశాఖపట్నం

(ఈఇ) నెల్లూరు

(వి) రాయలసీమలోని తిరుపతి- కాళహస్తి (రిపోర్టులోని **122** పుట ప్రకారం)

**68.** జులై **28, 2014**న కమిటీ తన నివేదికను అందించింది. ఆ నివేదిక ప్రకారం తుది నిర్ణయం తీసుకోగల సంపూర్ణ అధికారాలు మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే ఉన్నట్లు స్పష్టం చేసింది (రిపోర్టులోని **5** నెం. పుట ప్రకారం). ఈ కాస్త సమయంలోనే కమిటీ తనకి అందుబాటులో ఉన్న పరోక్ష నివేదికలు, అధ్యయనాలను పరిశీలించడమే కాకుండా ప్రజాభిప్రయాన్ని కూడా ఆహ్వానించింది. ఇందుకుగాను కమిటీకి **4728** స్పందనలు అందాయి. వీటిలో అధికభాగం విజయవాడ- గుంటూరు **(1156)** ప్రాంతం వైపే మొగ్గు చూపగా, ద్వితీయ స్థానంలో విజయవాడ **(663)**, తృతీయ స్థానంలో గుంటూరు **(372)** నిలిచాయి.

**69.** కమిటీ రూపొందించిన 'స్టేట్ సస్టేయనబులిటీ ఇండెక్స్' ప్రకారం విజయవాడ పట్టణప్రాంతం, గుంటూరు పట్టణప్రాంతం రహదారి సౌలభ్యం పరంగా మొదటి, రెండు స్థానాలలోనూ... స్థానిక అభివృద్ధి పరంగా మొదటి,

మూడు స్థానాలలోనూ... నీటి లభ్యతపరంగా రెండు, మూడు స్థానాలలోనూ నిలిచాయి.

**70.** రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి, ప్రజాసంస్థలకు చెందిన నిపుణులతో చర్చించిన మీదట ప్రజాసంక్షేమం, ఆర్థికం, పర్యావరణ తదితర అంశాలని పరిగణనలోకి తీసుకున్న తర్వాత రాజధాని నిర్మాణానికి అమరావతి అనుకూలమని గుర్తించింది. ఈ విషయాన్ని సదరు చట్టంలోని సెక్షను **3(3)** కింద పేర్కొనడం జరిగింది.

**30** డిసెంబరు, **2014**న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతా అభివృద్ధి వ్యవస్థ చట్టం **2014 (2014** నాటి చట్టం సం. **11)** ను ఈ కింది లక్ష్యాలతో అమలులోకి తీసుకువచ్చింది.

"నూతన రాజధాని నిర్మాణావశ్యకతని గుర్తిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు, రాజధాని ప్రాంతాన్ని గుర్తించి ఆ ప్రాంతాన్ని సమగ్రాభివృద్ధి చేసేందుకు... ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎ.పి.సి.ఆర్.డి.ఎ)ని చట్టబద్ధంగా ఏర్పాటు చేయడం జరిగింది.''

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎ.పి.సి.ఆర్.డి.ఎ.)ను రాజధాని నగరం పరిసర ప్రాంతాలలో అభివృద్ధి జరిగేందుకు అవసరమయ్యే ప్రణాళిక, సమన్వయం, అమలు, నియంత్రణ, ఆర్థిక సాయం, నిధులని అందించడం కోసం ఏర్పాటు చేయడం జరిగింది.

రాజధాని ప్రాంతం గుంటూరు, కృష్ణా సరిహద్దుల మధ్య **217.23** చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గుంటూరు జిల్లా తాడేపల్లి పురపాలక శాఖలోని తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాలలోని **24** రెవెన్యూ గ్రామాలలో విస్తరించి ఉంది. చాళుక్యులు **7**వ శతాబ్దిలో నిర్మించిన అమరేశ్వర ఆలయం

మీదుగా ఈ రాజధానికి అమరావతి అన్న పేరుని స్థిరపరిచారు. రెండువేల సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ప్రాంతం శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, శాలంకాయనులు తదితర రాజవంశాలకు రాజధానిగా నిలిచింది. ఈ ప్రాంతం శాశ్వత బౌద్ధకేంద్రంగా విలసిల్లుతూ మహాచైత్యాల పేరుతో అతి పెద్ద స్తూపాలను కలిగి ఉంది.

**71.** ప్రతిపాదిత రాజధాని నగరం నవ్యాంధ్రప్రదేశ్ కు నడిబొడ్డున ఉండటమే కాకుండా, ఇతర ప్రాంతాలకు కూడా చేరువలో ఉంది. పైగా నీటి లభ్యత, రహదారి సౌలభ్యం, స్థానిక అభివృద్ధిలో ముందంజలో ఉన్న విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు అతి చేరువలో ఉంది. అయితే సదరు పట్టణ ప్రాంతాలలో ఉండే ఇబ్బందులను అధిగమించేందుకు రాజధానిని పై రెండు పట్టణాలో నిర్మించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు ఇప్పటికే కిక్కిరిసి ఉన్న నేపథ్యంలో సదరు పట్టణాలను రాజధానికి వెలుపలే ఉంచాలని నిర్ణయించారు.

అన్నింటికీ మించి రాజధాని ప్రాంతం దేశంలోని వివిధ రాష్ట్రాలతో రైల్వే సంబంధం కలిగి ఉంది. రైల్వేలకు సంబంధించినంత వరకూ విజయవాడ రైల్వే స్టేషన్ దేశంలో రద్దీగా ఉండే జంక్షన్లలో ఒకటి. ఈ రైల్వే స్టేషనుని **1888**లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది దక్షిణమధ్య రైల్వేశాఖకు పాలనాకేంద్రంగా ఉంది. ఈ స్టేషను హౌరా- చెన్నై, న్యూ ఢిల్లీ- చెన్నై వంటి ముఖ్యమైన రైల్వేలైన్ల మధ్యలో ఉంది.

**72.** అదే విధంగా ప్రతిపాదిత రాజధాని నగరం రహదారులకు కూడా అతి సమీపంలో ఉంది. ఈ ప్రాంతం గుండా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. అవి ఇతర జాతీయ రహదారులనూ కలుపుకుంటూ

సాగుతున్నాయి. ఆ విధంగా దేశంలో ఏ ప్రాంతానికైనా సంబంధం కలిగి ఉంది. పుణె- మచిలీపట్నం (ఎన్.హెచ్-65) స్వర్ణ చతుర్భుజిలో భాగమైన కోల్కతా- చెన్నై (ఎన్.హెచ్.-16)ని ప్రముఖంగా పేర్కొనవచ్చు. ఈ ప్రాంతపు నైసర్గిక స్వరూపం కారణంగా రాష్ట్ర రహదారులు, ప్రముఖ రహదారులకు చేరువలో ఉండటం వల్ల... రాష్ట్రం యావత్తుతోనూ సంబంధం కలిగి ఉంది. ఇక ఆకాశ మార్గంలో రాజధానికి అతి సమీపంలో ఉన్న గన్నవరం విమానాశ్రయం వల్ల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలు తీరనున్నాయి. పెరగనున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

రాజధాని నుంచి కాకినాడ నౌకాశ్రయం **200** కిలోమీటర్లు ఉంది. ఇక ప్రతిపాదిత మచిలీపట్నం నౌకాశ్రయం సుమారు **70** కిలోమీటర్ల దూరంలో ఉంది. వీటి కారణంగా ప్రపంచంలోని వివిధ ప్రదేశాలతో సంబంధం కలిగిఉండే అవకాశం ఉంది. వీటి వల్ల వ్యాపారానికీ, నూతన నగర నిర్మాణానికి చాలా ఉపయోగంగా ఉంటుంది. ఇవే కాకుండా కాకినాడ నుంచి పుదుచ్చేరి నాలుగు అంతర్గత జలమార్గాలను కూడా ప్రతిపాదించారు. అటు వ్యవసాయానికీ, ఇటు ప్రయాణానికీ ఉండే కాలువలని ఈ జలమార్గాల కోసం వినియోగిస్తారు. వీటితో కాకినాడ, మచిలీపట్నం నౌకాశ్రయాలను చెన్నై, ఎగ్మోరు నౌకాశ్రయాలతో కలిపే అవకాశం ఉంది. వీటిలో అమరావతి నుంచి చెన్నైకి పైగా వెళ్లే బకింగ్హామ్ కాలువ కూడా ఒకటి. జలరవాణా కోసం బ్రిటిష్వారు ఈ కాలువని **18**వ శతాబ్దంలో నిర్మించారు.

పైన పేర్కొన్న సదుపాయాలన్నీ రాష్ట్ర రాజధాని అభివృద్ధి కోసం, పాలన కోసం చాలా అత్యవసరం. ఇలాంటి వసతులు అందుబాటులో ఉండటం వల్ల

తిరిగి వాటిని నిర్మించాల్సిన ఆర్థిక భారం నుంచి తప్పుకోవడమే కాకుండా, పర్యావరణం మీద దుష్ప్రభావం లేకుండా ఉపయోగపడుతుంది.

**73.** అమరావతి నగరం లక్షకు పైగా జనాభాతో **24** రెవెన్యూ గ్రామాలతో పాటుగా తాడేపల్లి పురపాలక శాఖలో కూడా భాగం కలిగి ఉంది. ఈ ప్రాంతంలో **27** వేల గృహాలు, **84** ప్రాథమిక పాఠశాలలు, **11** ప్రాథమిక వైద్య కేంద్రాలతో పాటు అనేక వాణిజ్య సంస్థలు ఉంటాయి. విస్తృతమైన రహదారులతో పాటు అనేక బస్స్టాపులు కూడా ఉన్నాయి. తాడేపల్లి స్టేషను గుండా రైల్వేలైను కూడా ఉంది.

**74.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన అధికార యంత్రాంగంలో ముఖ్యభాగం తన చేతిలో లేని హైదరాబాదులోనే ఉండటం వల్ల, నవ్యాంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నది. తనకు అధికారం లేని ప్రాంతం నుంచి రాష్ట్రాన్ని పాలించడం ఏమంత తేలిక కాదు. దీనివల్ల రాజధాని నగర నిర్మాణం, ఆదాయపు లోటుతో పాటు అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. ఈ కారణంగా అధికార యంత్రాంగాన్ని వీలైనంత త్వరగా హైదరాబాదు నుంచి తరలించాల్సి ఉంటుంది. ఇందుకోసం హైదరాబాదు నుంచి తరలి వచ్చే వారి కోసం కార్యాలయాలు, నివాసాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, హోటళ్లు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలన్నింటినీ ఏర్పాటు చేయవలసి ఉంది. నూతన రాజధాని విజయవాడ, తెనాలి, మంగళగిరి వంటి పట్టణాలను చేరువలో ఉండటం వల్ల రాజధానిలో ఏర్పడే రద్దీని కొంతకాలం తట్టుకోవడం సులభమవ్వడంతో పాటుగా... తగిన జాగ్రత్తలు, పర్యవేక్షణలతో రాజధానిని నిర్మించేందుకు తగినంత సమయం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది.

**75.** రాజధాని నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన ప్రణాళికను గమనిస్తే... అభివృద్ధి ప్రణాళికను మూడు దశలుగా విభజించవచ్చు. మొదటి దశ **2015- 2025** వరకు, రెండో దశ **2026- 2035** వరకు మూడో దశ **2036- 2050** వరకు ఉంటుంది. రాజధానిలో అభివృద్ధి క్రమంగానూ, సహజసిద్ధంగానూ ఉండేందకు ఈ విభజన ఉపయోగపడుతుంది.

వరద ముంపు ప్రాంతాలు:

**75.** రాజధానిగా రూపొందబోయే ప్రాంతం వరద ముంపునకి గురయ్యే ప్రమాదం ఉందని దరఖాస్తుదార్లు పేర్కొంటున్నారు. ఈ వాదనకు అనుకూలంగా **2015**నాటి ఎ-**9** మరియు ఎ-**13** అనుబందాలలోని ఒ.ఎ. సం.. **171** అనే నివేదికనూ; ప్రత్యుత్తరం (రీజాయిండర్)లో జోడించిన ఎ-**19** అనుబంధాన్నీ; అదనంగా జోడించిన వివరాలలో ఉన్న ఎ-**3** అనుబంధాన్నీ సమర్పిస్తున్నారు. అయితే సదరు పత్రాలలో పేర్కొన్న ప్రాంతాలేవీ నూతన రాజధాని పరిధిలో లేవన్నది ప్రతివాదుల మాట. ఈ పత్రాలలో గుంటూరులోని ఏ ఒక్క ప్రాంతాన్నీ కాకుండా మొత్తం జిల్లానే పేర్కొనడం వల్ల.... ఇలాంటి పత్రాల మీద ఆధారపడటం ఏమంత ఆమోదయోగ్యం కాదు. నిజానికి ప్రతివాదులు ఇందుకు విరుద్ధమైన విషయాలను నిరూపించేలా కొన్ని పత్రాలను అందచేశారు. వీటి ద్వారా ఈ ప్రాంతం **1853**లేదా **2009** నాటి వరదల సందర్భంగా ఇక్కడ ఎలాంటి ముంపూ జరగలేదని తెలుస్తోంది.

**77.** రాజధాని ప్రాంతంలో గట్లు ఉన్న కారణంగా కృష్ణా నది నుంచి ఎలాంటి వరద ప్రమాదం లేకపోవడం వల్ల... ఈ ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా పేర్కొనలేం. అభ్యర్థులు ప్రాథమిక దరఖాస్తులోని గ్రౌండ్ ఎల్ లో సూచించిన ప్రకారం 'తరచూ వరదలకు గురయ్యే ప్రాంతాలు ' వరద ముంపు

ప్రాంతాలుగా పేర్కొనవచ్చు. అయితే ప్రతిపాదిత రాజధానికి కృష్ణా నది నుంచి ఎలాంటి వరద ముప్పు లేకపోవడం చేత, ఈ ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా పరిగణించడానికి వీల్లేదు.

**78.** ఇ.ఐ.ఎ.నివేదికలోని **5.6** అధ్యాయంలో పర్యావరణ వివరం అనే శీర్షిక కింద జలశాస్త్రం, జలభూస్వరూప శాస్త్రాలను విశ్లేషించారు. రాజీవ్ గాంధి మంచినీటి సరఫరా పథకం కోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రం ఇతర శాఖలతో కలిసి భూగర్భజలాలకు సంబంధించిన నివేదికను **1:50000** స్కేలుతో పటాలను రూపొందించినట్లు సదరు అధ్యాయంలో పేర్కొన్నారు. భూస్వరూప శాస్త్రం ద్వారా భూమి ఉపరితలం ఏర్పడటం, అభివృద్ధి చెందడం, భిన్నమైన లక్షణాలను కలిగి ఉండటం వెనుక నీరు, గాలి ఎటువంటి భూమికని పోషించాయో అధ్యయనం చేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే కొన్ని లక్షల సంవత్సరాలుగా భూమి ఉపరితలం మీద ఎటువంటి మార్పులు వచ్చాయో ఈ శాస్త్రం అధ్యయనం చేస్తుంది.

ఈ శాస్త్రంలో జలభూస్వరూప శాస్త్రం మరో ఉపశాస్త్రం. ఇది ఉపరితలం మీదా, భూగర్భంలోని ఖనిజాల మీదా తాత్కాలికంగానూ, శాశ్వతంగానూ నీరు ఎలాంటి ప్రభావం చూపుతుందో అధ్యయనం చేస్తుంది. పైన పేర్కొన్న పటాలు ఒక ప్రాంతంలోని ఉపరితలం, భూగర్భాలు.... భిన్న చర్యలు, మూలకాల మధ్య ప్రతిచర్యల వల్ల ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయో మాత్రమే తెలియచేస్తాయి. జలశాస్త్రం, జలభూస్వరూప శాస్త్రాల ప్రకారం పదివేల సంవత్సరాల కాలం కూడా పెద్ద సమయమేమీ కాదు. ఇ.ఐ.ఎ. నివేదికలోని **5,7** పట్టికలలో పేర్కొన్న పటం... కొన్ని లక్షల సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా ఉపరితల, భూగర్భంలోని పరిస్థితులను సూచనప్రాయంగా సాంకేతిక

పరిభాషలో పేర్కొనే ప్రయత్నం మాత్రమే జరిగింది. దీనిని సదరు ప్రాంతాలని వరద ముంపు ప్రాంతాలుగా పేర్కొనడంగా భావించరాదు.

**79.** ఇ.ఐ.ఎ. నివేదిక ప్రకారం సదరు ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా భావించి నది దాని భూస్వరూపాన్ని సూచించేందుకే కానీ వందేళ్లకి ఓసారి వచ్చే వరదల ఆధారంగా కాదన్న విషయాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రానికి సంచాలకునిగా వ్యవహరించిన డా॥ దేశిక దుర్గాప్రసాదరావు వివరణ ఇచ్చారు. ఈయన నేతృత్వంలోనే రాజీవ్ గాంధి మంచినీటి సరఫరా పథకాన్ని దేశం యావత్తూ అమలుపరిచే ప్రయత్నం జరిగింది. డా॥ రావు ప్రతివాదుల ఈమెయిల్కు **19** జులై, **2016** మరియు **1** ఆగస్టు, **2016** తేదీలలో ఇచ్చిన జవాబులలో కేవలం సాంకేతిక పరిభాషలో ఈ ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా పేర్కొనడం జరిగిందే కానీ ఇది క్రియాశీలకంగా వరదముంపు ప్రాంతం కాదని స్పష్టం చేశారు. ఈ జవాబులని అనుబంధం ఆర్-**8**లోని నోట్ **2**లో జతచేయడం జరిగింది. ఈ వివరణ అరుదుగా జరిగే వరద ముంపుకి సంబంధించి ట్రిబ్యునల్ నియమించిన నిపుణుల సంఘం తేల్చిన విషయాలకు అనుగుణంగానే ఉంది.

అందుచేత ఈ ప్రాంతంలో సాగే నిర్మాణ కార్యకలాపాలు ఇక్కడి భూజలస్వరూపం మీద ఎలాంటి దుష్ప్రభావమూ చూపవని చెప్పవచ్చు. పైగా రాజధాని నిర్మాణం కోసం జారీ చేసిన పర్యావరణ అనుమతిలో... ఇక్కడ చేపట్టే నిర్మాణాలలో తగిన జాగ్రత్తలన్నీ తీసుకోవాలనీ, వాటిలో నీటిని పొదుపు చేసి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలు కూడా ఉండాలని నిర్దేశించడమయినది. (ప్రతివాదులు **04.08.2016**న దాఖలు చేసిన ప్రతి ప్రమాణ పత్రంలోని **1093-1099**లో పేరా **3-10** ప్రకారం) ఈ

కేసు అభ్యర్థులు సైతం 2015 నాటి ఒ.ఎ. సం.. 171 లోని 21-22 పేజీలలోని 18వ పేరాలో 'నూరేళ్లకోసారి వరద ' అనే అంశాన్ని సదరు నది జీవావరణలో భాగంగా పరిగణిస్తారని ఒప్పుకున్నారు. వరద ప్రమాదం ఉన్న ప్రాంతాలలో అందుకు అనుగుణమైన ప్రణాళికలను చేపట్టేందుకు ఈ సాంకేతిక పదాలను ఉపయోగించుకుంటారు.

80. ప్రతివాదుల ప్రకారం నీటిపారుదల శాఖ ఎప్పటికప్పుడు నదీ ప్రవాహపు తీరుని గమనిస్తూ ఉండటమే కాకుండా, నదిలో నీటి మట్టాన్ని నమోదు చేస్తూ ఉంటుంది. వరదకి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడమే కాకుండా, వరదనీటి మట్టాన్ని కూడా సూచిస్తుంది. 1903, 2009లో వరద నీరు చేరుకున్న మట్టాన్ని గుర్తించడం జరిగింది. దీనిని ఎప్పుడైనా సరి చూసుకోవచ్చు. అయితే ఈ కేసులోని దరఖాస్తుదార్లు సదరు గుర్తింపు విషయంలో సందేహాలు వ్యక్తం చేయడంతో.... ట్రిబ్యునల్ సలహా మేరకు ప్రతివాదులు డా॥ వి.వి. శ్రీనివాస్ (జలశాస్త్రం ప్రొఫెసరు, ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు), కె. రవి (నది పర్యవేక్షకుడు, కృష్ణా సెంట్రల్ డివిజన్), డి. కాశీ విశ్వేశ్వరరావు (ఛీఫ్ ఇంజనీర్, గ్రూప్ డైరక్టర్, (ఎ.పి.సి.ఆర్.డి.ఎ.) నేతృత్వంలో వరద ముంపు ప్రాంతాన్ని గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ జూన్ 2016లో అమరావతికి సమీపంలో కృష్ణా నది ముంపు ప్రాంతాలను గుర్తించి నివేదికను అందచేయడం జరిగింది. (పుట. 1041- 1082 లో 2015 నాటిఒ.ఎ. సం. 171 ప్రకారం)

2009 వరదలకి సంబంధించి గుర్తింపు చిహ్నాలను ఇప్పటికే ఏర్పరిచినట్లు కమిటీ నిర్ధరించింది. సి.డబ్ల్యు.సి. కేంద్రాల వద్ద వరద నీటికి సంబంధించిన వివరాల ఆధారంగా, సదరు కమిటీ కొన్ని అంచనాలను రూపొందించింది.

వీటి ఆధారంగా, **2009** వరదలు రాజధాని నగరంలో ఎలాంటి పరిమితినీ దాటలేదని తేల్చింది. రాజధాని నగరానికి పొడవునా **100-300** మీటర్ల దూరంలో వరద నీటిని ఆపి ఉంచే బండలు ఉన్నాయి. ఎగువ ప్రవాహాన్నీ, దిగువ ప్రవాహాన్నీ కూడా నియంత్రించేలా ప్రకాశం బ్యారేజీ పొడవునా ఈ గట్లు ఉన్నాయి. కొన్ని చోట్ల ఈ దూరం **500** మీటర్లకు మించి ఉన్నది. నీటి ప్రవాహానికీ గట్లకు మధ్య ఉన్న తటస్థ ప్రాంతంలో ప్రైవేటు స్థలాలు, ఇళ్లు, ప్రార్థనా స్థలాలు తదితరాలు ఉన్నాయి.

కమిటీ వరద వచ్చే సంభావ్యతని కూడా అంచనా వేసి ఈ నిర్ణయానికి వచ్చింది: 'కనుక, **2009** సంవత్సరంలో గుర్తించిన ప్రాంతం వరకే వరద ముంపు పొంచి ఉందనీ.... అలాంటి వరద ఒకవేళ ఏర్పడినా కనీసం (ఇ)**1901-2012**ల మధ్య గణాంకాల ఆధారంగా **104** ఏళ్లకి ఓసారి (ఈ) **1965- 2012**ల మధ్య గణాంకాల ఆధారంగా **124** ఏళ్లకి ఓసారి వచ్చే అవకాశం ఉందని చెప్పవచ్చు,' **(2015** నాటి ఒ.ఎ. లోని **171** పేజీ. **1065-1066).** ఈ కారణంగా అడ్డుకట్టలు, గట్లను దాటి ఉన్న ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా పరిగణించలేము.

**81.** దరఖాస్తుదార్ల న్యాయవాది పేర్కొన్నట్లుగా ప్రతిపాదిత రాజధాని నగరాన్ని వరద ముంపు ప్రాంతంగా పరిగణించాలంటే... కృష్ణా నది నుంచి తరచూ వరద ప్రమాదం ఉండాలి. అయితే నగరాన్ని వరద ముంపు నుంచి కాపాడేందుకు గట్లు, అడ్డుకట్టలు ఉన్నాయన్న విషయంలో ఎలాంటి వివాదమూ లేదు. రెండు వర్గాలూ అందజేసిన పత్రాల ఆధారంగా, రాజధాని నగర ప్రాంతం కృష్ణానది నుంచి వరద ముంపునూ ఎదుర్కొంటుందన్న అభిప్రాయానికి రాలేము. **1853, 2009**లో వచ్చిన అసాధారణ వరదల సందర్భంగా కూడా ప్రతిపాదిత రాజధాని ప్రాంతం వరదముంపునకి

గురికాలేదని తెలుస్తోంది. దరఖాస్తుదారు తన మూల అభ్యర్థనలో పేర్కొన్నట్లు, ఒక ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా పరిగణించాలంటే... అక్కడ తరచూ వరద ప్రమాదం ఉండాలి. ఆ ప్రాంతంలో అరుదుగా వచ్చే వరదల ఆధారంగా దానిని వరద ముంపు ప్రాంతంగా పరిగణించలేము. తరచూ అక్కడ నీటి ప్రవాహం ఏర్పడుతూ, వరద ముంపుని గుర్తించేలా ఉండాలి.

ఇ.ఐ.ఎ. నివేదిక ఆధారంగానూ, పైన సుదీర్ఘంగా పేర్కొన్న కారణాల ఆధారంగానూ... ప్రతిపాదిత రాజధాని నగరాన్ని వరద ముంపు ప్రాంతంగా పరిగణించలేం. పైగా భూ ఉపరితలం గురించి అధ్యయనం చేసే జలశాస్త్రం, జలభూస్వరూపం శాస్త్రాలలోని సాంకేతిక పదాల ఆధారంగా వరద ముంపు ప్రాంతాలని నిర్ధారించలేమని సదరు నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. పైగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రం రూపొందించిన పటాల ఆధారంగా సదరు నివేదికను రూపొందించారు. ఏళ్ల తరబడి ఒక ప్రాంతంలోని మూలకాల మధ్య ప్రతిచర్యల కారణంగా ఉపరితలం, భూగర్భాల స్వరూప స్వభావాలలో వచ్చే మార్పులను అంచనా వేసేదే భూస్వరూపశాస్త్రం. అంతేకానీ సదరు ప్రాంతాలు వరద ముంపు ప్రాంతాలని తెలియచేయడం దీని ఉద్దేశం కాదు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సంచాలకులు ఇదే విషయాన్ని **19.07.2016**నాటి మెయిల్లో ధృవీకరించారు. పటంలో పేర్కొన్న ప్రాంతాలు క్రియాశీలకమైన వరద ముంపు ప్రాంతాలు కాదనీ, కేవలం సాంకేతిక పరిభాషలో మాత్రమే వాటిని అలా పేర్కొనడం జరిగిందని వారు చెప్పారు. పైగా అభ్యర్థులు వరద ముంపు ప్రాంతాల గుర్తింపునకు సంబంధించి లేవనెత్తిన సందేహాలను నివారించేందుకు ట్రిబ్యునల్ డా॥ వి.వి. శ్రీనివాస్ నేతృత్వంలో ఒక కమిటీని

నియమించింది. సదరు కమిటీ అమరావతి సమీపంలోని కృష్ణా నది వరద నీటి హద్దులు, వరద ముంపు గ్రామాలకు సంబంధించి తన నివేదికను జూన్ **2016**లో అందించింది. ఆ కమిటీ **2009**లో వరద ముంపునకు సంబంధించిన ప్రాంతాన్ని గుర్తించి, **1901-2012**ల మధ్య సేకరించిన గణాంకాల ఆధారంగా... అలాంటి వరద మళ్లీ రావాలంటే **104** సంవత్సరాలు పడుతుందని తేల్చింది. ఈ కారణంగా కృష్ణా నదికి వచ్చే వరద రాజధాని గట్లను దాటి రాదని, ఆ గట్ల తర్వాత ప్రాంతాలను వరద ముంపు ప్రాంతాలుగా భావించలేమని చెప్పడంలో మాకు ఎలాంటి సందేహమూ లేదు. తదనుగుణంగా నూతన రాజధాని ప్రాంతం వరద ముంపు పరిధిలోకి వస్తుందంటూ దరఖాస్తుదార్లు లేవనెత్తిన అభ్యంతరాలను తిరస్కరిస్తున్నాము.

**వరద నీటి విడుదల:**

**82.** ప్రతిపాదిత రాజధాని నగరంలో చేరుకునే వరద నీరు చాలా ఎక్కువగా ఉందని అభ్యర్థుల తరపున గౌరవనీయులైన న్యాయవాది వాదిస్తున్నారు. అక్టోబరు **2009**లో వచ్చిన వరద నీరు గతంలో ఉన్న రికార్డులన్నింటినీ తుడిచిపెట్టేసిందని చెబుతున్నారు. అయితే ప్రతివాదుల తరపు కౌన్సిల్ ఈ వాదనలను  నిర్ ద్వందంగా తిరస్కరిస్తున్నారు.

**83.** ఈ ప్రాంతంలో అడ్డుకట్టల గురించి మొట్టమొదటి వివరణ మద్రాసు చీఫ్ ఇంజనీరుగా ఉద్యోగ విరమణ చేసిన జార్జ్ టి. వాల్ష్ (ఎం.ఐ.న్.ఎస్.టి.సిఇ) **1899**లో రాసిన "ఇంజనీరింగ్ వర్క్స్  ఆఫ్ క్రిష్ణా డెల్టా డిసిక్రిప్టివ్ అండ్ హిస్టారికల్ అకౌంట్" వాల్యూమ్-**1**, అనే పుస్తకంలో కనిపిస్తుంది. విజయవాడ (బెజవాడ) దిగువున, ఎగువున కూడా గట్లు ఉన్నట్లు సదరు

పుస్తకం తెలియచేస్తోంది. సదరు విషయాన్ని సూచించేలా ఆ పుస్తకంలోని అంశాలు ఇవీ:

“**5.** రెండు జిల్లాలలోనూ నది, కాలువల తీరాన ఉన్న గట్లన్నీ ధ్వంసం అయినాయి. డెల్టా మొత్తం కొన్ని అడుగుల నీటితో నిండిపోయింది. ఇక్కడి అసంఖ్యాకమైన గ్రామాలలోని ప్రజలు రోజుల తరబడి చెట్ల మీదా, ఇళ్ల పైకప్పుల మీదా తలదాచుకున్నారు. ప్రభుత్వ నిర్మాణాలకు అపారమైన నష్టం జరిగిందని నా భయం. ప్రజలు తమ ఆస్తిపాస్తులను ముఖ్యంగా పశువులను నష్టపోయారు.

ఈ విపత్తు సందర్భంగా ఆయా నిర్మాణాలు సక్రమంగా ఉపయోగపడ్డాయి. కానీ బెజవాడలోకి ఎలాంటి వరద నీరూ రాకుండా ఉండాలంటే, కాస్త ఎత్తులోనే గట్లని నిర్మిస్తే సరిపోతుందని కమిటీ పొరపాటు పడింది. నదికి కుడివైపున ఇబ్రహీంపట్నానికి **8** మైళ్ల దూరంలో ఒక మైలు చొప్పున తగినంత ఎత్తు, వెడల్పులతో గట్లని నిర్మించడం జరిగింది. బుడమేరు వాగు నుంచి వచ్చే వరద నీటిని ఆపి ఉంచేందుకు ఈ గట్లను నిర్మించారు. అయితే ఈ గట్లకి చిన్నపాటి పగుళ్లు ఏర్పడినా కూడా... ఏలూరు కాలువకూ, గుడివాడ తాలూకాలోని భూములు నిర్మాణాలకు విపరీతమైన నష్టం జరుగుతుంది.

ఈ గట్లని నిర్మించేందుకు తొలుత అయిన ఖర్చు ఎంతో తెలియదు. కానీ ఆగస్టు **1896** వరద తర్వాత రూ.**12, 200** మరియు **63,200** రూపాయల ఖర్చుని అంచనా వేసి... సదరు మొత్తాన్ని ఆ గట్లకి మరమ్మతు చేసేందుకు, మరింత దృఢంగా నిర్మించేందుకు ఉపయోగించడం జరిగింది. ఇందులో మొదటి మొత్తాన్ని కుడివైపు గట్లని నిర్మించేందుకు, తర్వాత

మొత్తాన్ని ఎడమవైపు గట్లను నిర్మించేందుకు ఉపయోగించడం జరిగింది. (చూడండి పి.ఎం.జి.సెంబర్. 1015 1, తేదీ 13 నవంబర్, 1897)."

1853లో వచ్చిన వరదలను చారిత్రాత్మకంగా భావిస్తూ ఉంటారు. ఆ వరదలు కూడా ప్రస్తుత రాజధాని ప్రాంతం మీద ఎలాంటి ప్రభావమూ చూపలేదు. పైన పేర్కొన్న పుస్తకంలోనే మరోచోట "నదికి కుడివైపున, ఒక మైలు పొడవున ఉండవల్లి కొండకి చేరువలో గట్లని నిర్మించిన మాట వాస్తవం, కానీ అది సరిపోతుంది...". పైన పేర్కొన్న విధంగానే ప్రతిపాదిత రాజధాని నగరం ప్రకాశం బ్యారేజీకి ఎగువప్రవాహంలో నదికి కుడివైపున ఉంది. రాజధాని నగరాన్ని నిర్మించ తలపెట్టిన ప్రదేశంలోనే ఉండవల్లి కొండలు ఉన్నాయి. అంచేత 1853నాటి ఉధృతమైన వరదల సందర్భంగా కూడా ఈ ప్రాంతం వరద ముంపునకు గురికాలేదు.

84. దరఖాస్తుదార్లు 2015నాటి ఒ.ఎ. సం. 171లో(ముఖ్యంగా ఎ-9 అనుబంధం (కోలీ), అనుబంధం ఎ-13లోని 67-74; 104-107 పేజిలు; ప్రత్యుత్తరం (రీజాయిండర్)లోని అనుబంధం ఎ-19లోని 176-185 పేజీలలో 1,2 పేజీలు; అదనంగా చేర్చిన సమాచారంలోని అనుబంధం ఎ-3లో 1016-1034పేజీల ప్రకారం... ప్రతిపాదిత రాజధాని నగరం కృష్ణా నగరపు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని దరఖాస్తుదార్లు పేర్కొంటున్నారు. అయితే ఇందులో పేర్కొన్న ప్రాంతాలు ప్రతిపాదిత రాజధాని నగరంలో లేకపోవడం చేత, అలాంటి పత్రాల మీద ఆధారపడటం భావ్యం కాదని చెప్పవచ్చు.

85. ప్రతివాదులు సమర్పించిన పత్రాలలో గత 106 సంవత్సరాలుగా ప్రతిపాదిత రాజధాని నగరంలోని ప్రాంతం ఎప్పుడూ కూడా ముంపునకు గురికాలేదని స్పష్టం చేస్తున్నారు. (2015నాటి ఒ.ఎ. సం. 171లోని పేజి

138 నుంచి 209లలో పేర్కొన్న "2012-2013 నాటి కృష్ణా నది గుంటూరు-కృష్ణా జిల్లాలకు వరదల నివారణకు తాత్కాలిక ప్రణాళిక ప్రకారం, నివేదికలోని పేజి 1041 నుంచి 1082 ప్రకారం)

86. 2008లోని జాతీయ విపత్తు నిర్వాహక సంస్థ వరద సన్నద్ధతకి సంబంధించి "జాతీయ నిర్వహణ మార్గదర్శక సూత్రాలు – వర్ద పరిస్థితి నిర్వహణ." పేరుతో కొన్ని మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది. వరద ముంపు ప్రాంతాలలో తగిన జాగ్రత్తలు పాటించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం,  ఇతర సంస్థలకు ఈ సూత్రాలు ఉపయోగపడతాయి. అందులోని 6వ అధ్యాయంలో "నియంత్రణ, అమలు" అనే శీర్షిక కింద ఈ దిగువ మార్గదర్శక సూత్రాలను పేర్కొన్నారు:

"6.1.3 వరద ముంపు ప్రాంతాలలో భూవినియోగ ఆంక్షలు

ఈ ఆంక్షలను విధించేందుకు కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంది. ఉదాహరణకు, ప్రతి పదేళ్లకి ఓసారి ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాలను కేవలం తోటలు, ఉద్యానవనాలు, ఆటస్థలాలు వంటి అవసరాలకే కేటాయించాలి. నివాస స్థలాలు, ప్రభుత్వ భవనాలు లేదా ఇతర వాణిజ్యపరమైన భవనాలు, పరిశ్రమలు, ప్రజోపయోగ నిర్మాణాలు ఈ ప్రాంతంలో నిర్మించడం నిషిద్ధం. ప్రతి 25 ఏళ్లకి ఓసారి వరద ప్రమాదం ఉన్న ప్రాంతాలలో నివాస స్థలాలను స్తంభాల నిర్మాణం, ప్లింత్ ఎత్తు, బేస్మెంట్ల నిర్మాణం మీద నిషేధం, ఎదురుగా ఉన్న రోడ్డు ఎత్తు వంటి కొన్ని నిబంధనలకు లోబడి అనుమతించవచ్చు. పట్టణ ప్రాంతాలలో రెండంతస్తుల మేడలను మాత్రమే అనుమతించాలి. కింది అంతస్తుని పాఠశాలలు ఇతరత్రా నివాసేతర అవసరాల కోసం వినియోగించవచ్చు.

6.1.4 వరద ముంపు ప్రదేశాలలో నిర్మాణాల విభజన, ప్రాధాన్యతలు

వరద ముంపు ప్రాంతాలలో భూవినియోగాన్ని నియంత్రించేందుకు... వేర్వేరు నిర్మాణాలను, అత్యవసర సేవలను వాటికి ఏర్పడే నష్టం ఆధారంగా మూడు ప్రాధాన్యతలుగా గుర్తించవచ్చు:

మొదటి ప్రాధాన్యం: రక్షణ స్థావరాలు, పరిశ్రమలు; ఆసుపత్రులు, విద్యుత్ స్థావరాలు, నీటి సరఫరా, టెలిఫోన్ ఎక్స్చేంజ్, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, వాణిజ్య సముదాయాలు వంటి ప్రజోపయోగ నిర్మాణాలు. ఈ భవనాలను వరద నీటి మట్టానికి అనుగుణంగా కానీ నూరేళ్ల కాలంలో వరదలకి సంబంధించిన గణాంకాల ప్రకారం కానీ దృష్టిలో ఉంచుకుని నిర్మించాలి. అంతేకాకుండా **50** ఏళ్ల వర్షపాతాన్నీ, మురుగునీటి తాకిడినీ దృష్టిలో ఉంచుకుని నిర్మించాలి.

ప్రాధాన్యం **2:** ప్రజా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, ప్రజా గ్రంథాలయాలు,  నివాస స్థలాలు. ఇవన్నీ కూడా **25** ఏళ్లకి ఓసారి వచ్చే వరదనూ, గత పది సంవత్సరాల నాటి వర్షపాతాన్నీ దృష్టిలో ఉంచుకుని నిర్మించాలి. సున్నిత ప్రదేశాలలో చేసే నిర్మాణాలన్నీ ఇంతకుముందు పేర్కొన్న విధంగా కాంక్రీటు స్తంభాల మీద నిర్మించాల్సి ఉంటుంది.

ప్రాధాన్యత **3:** ఉద్యానవనాలు, ఆటస్థలాలు – తరచూ వరద ముంపునకి గురయ్యే ప్రదేశాలలో ఆటస్థలాల వంటి నిర్మాణాలను చేపట్టవచ్చు. ప్రతి నగరానికీ కొన్ని బహిరంగ ప్రదేశాలు, తోటలు అవసరం కాబట్టి... అలాంటి నిర్మాణాలను సున్నితమైన ప్రదేశాలలో నిర్మిస్తే సరిపోతుంది. పర్యావరణానికీ, నగరాభివృద్ధికీ కూడా ఇలాంటి నిర్మాణాలు కీలకంగా మారతాయి.

(వ్రాతపూర్వకంగా సమర్పించిన ప్రతులలోని అనుబంధం ఆర్7లోని నోట్-2 ఆధారంగా)

పైన పేర్కొన్న మార్గదర్శక సూత్రాల ప్రకారం **25** నుంచి **100** ఏళ్లలోపు వరద ముంపు ప్రమాదం ఉన్న ప్రదేశాలలో కూడా నిర్మాణాలను చేపట్టవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం నూరేళ్లకి ఓసారి వచ్చే వరద ముంపు స్థానాన్ని కూడా గుర్తించడం జరిగింది. అలా **2009**లో వచ్చిన వరద నీరు అమరావతి నగరపు గట్లని దాటలేదు. ఇక ప్రతిపాదిత రాజధాని నగరంలోకి వరద నీరు రాలేదు.

**(4,** ఆగస్టు **2016**న ప్రతివాది దాఖలు చేసిన ప్రతి ప్రమాణ పత్రంలోని పేజీలు.**1099-1110**లో పేరా**11** ప్రకారం)

ఆనకట్టలు:

**87.** ప్రతిపాదిత నగరానికి చేరువలో కృష్ణానది మీద ఉన్న ప్రకాశం బ్యారేజిలోని ఎగువ ప్రవాహానికి అనుబంధంగా అనేక ఆనకట్టలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ఈ ఆనకట్టలకి గండి పడిన పక్షంలో తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది కాబట్టి, వీటికి దగ్గరగా రాజధానిని నిర్మించకూడదన్నది దరఖాస్తుదార్లు చేస్తున్న మరో వాదన. అయితే ఈ వాదన ఊహాజనితం మాత్రమే! ఎందుకంటే సదరు ఆనకట్టలని కేంద్ర నీటి సంఘం నిబంధనల ప్రకారం, తగిన చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మించడం జరిగింది. ఆనకట్టకి గండి పడకుండా చూడటం సదరు నిబంధనలలో ఒకటి. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వీటిని నిర్మించడం జరుగుతుంది. మార్గదర్శకాల ప్రకారం ఈ ఆనకట్టలని ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండటం జరుగుతుంది. రాజధాని నగరం సురక్షిత ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఎన్ని

జాగ్రత్తలు వహించినప్పటికీ అనుకోని విపత్తు ఏదన్నా ఏర్పడితే +25 మీటర్ల ఎత్తు వరకు ప్రభావం ఉంటుందని అంచనా. ఈ విషయాన్ని ఇ.ఐ.ఎ. నివేదికలో కూడా పేర్కొన్నారు. అయితే ఈ విషయాన్ని అభ్యర్థులు తప్పుగా అర్థం చేసుకున్నారు. ముఖ్య నిర్మాణాలలో అధికార, నియంత్రణా కేంద్రాలు, ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, రహదారి సహా ముఖ్యమైన ప్రభుత్వ ప్రభుత్వేతర భవనాలు. భవనాలను ఖాళీ చేయడానికీ, సురక్షితంగా ఉండటానికీ, అత్యవసర సేవలను అందించడానికీ సులువుగా ఉండేలా ఈ ఎత్తుని ప్రతిపాదించడం జరిగింది. ఒకవేళ ఈ ఎత్తుకంటే దిగువున నిర్మాణాలను చేపడితే, సదరు నిర్మాణాలని కాంక్రీటు స్తంభాల మీద నిర్మించాల్సి ఉంటుంది. అంతేకానీ రాజధాని ప్రాంతం యావత్తు ఎత్తునీ పెంచాలన్న దరఖాస్తుదార్ల  వాదన సరైనది కాదనీ, విషయాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడం వల్ల అలాంటి అభిప్రాయానికి వారు చేరుకున్నారనీ చెప్పవచ్చు.

బృహత్ప్రణాళిక లో కొన్ని అంశాలను చేర్చడం వల్ల సమగ్రాభివృద్ధి సూత్రాన్ని అమలు చేయవచ్చు. మురుగు నీటి వ్యవస్థనీ, కాలువలనీ కూడా ముంపు నీటిని దృష్టిలో ఉంచుకుని నిర్మించాల్సి ఉంటుంది. వరద నీటిని స్టేడియంలు, ఉద్యానవనాలు, ఇళ్ల వెలుపలకి పోయేలా ఆయా వ్యవస్థలని రూపొందించడం ద్వారా కీలక స్థావరాలు, నివాస స్థలాలు, వాణిజ్య ప్రదేశాలకు నష్టం కలగకుండా చూడవచ్చు.

కొండవీటి వాగు

88. కొండవీటి వాగు గురించి ఇప్పుడు ఒక దరఖాస్తుదారు అడిగిన ప్రశ్నను పరిశీలిద్దాం. కాని దరఖాస్తులో కొండవీటి వాగు గురించి ప్రస్తావించనే లేదు.

ప్రతివాది 10-08-2015న దాఖలు చేసిన ప్రమాణపత్రంలో మాత్రం కొండవీటి వాగు అంశం ప్రస్తావనకు వచ్చింది.

కొండవీటి వాగులో వర్షా కాలంలోనే నీళ్లు ఉంటాయి. ఏడాదిలో ఎక్కువ కాలం ఎండిపోయే ఉంటుంది. ఏడాదిలో కొద్ది రోజులు మాత్రమే వరద వస్తుంది. కాని ఇది సహజమైంది కాదు. గత 30 ఏళ్లలో ఇలా ఎప్పుడూ జరగలేదు. 2014 తర్వాత కొండవీటి వాగు వల్ల వరద ముంచెత్తలేదు. ప్రతివాది 18-03-2015న (అనుబంధం 17 పేజీ 174) దాఖలు చేసిన ప్రత్యుత్తరంలో కూడా ఒక వార్తా పత్రికలోని అంశాన్ని ప్రస్తావించారు. ఈ సమస్య 25 నుంచి 30 ఏళ్ల నుంచే ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నట్టుంది. స్థలాకృతి, జల సంబంధ సర్వేలన్నీ పూర్తి అయినాయని ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీని సంప్రదించి ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని, ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని 18-08-2015న దాఖలు చేసిన ప్రతి ప్రమాణపత్రంలో తెలియజేశారు. తాత్కాలికంగా వచ్చే వరద సమస్యను పరిష్కరించడానికి మాత్రమే కాక అదనపు జలాలను నిలవ చేసే అంశాలను కూడా పరిశీలించి రాజధాని నగర అవసరాలకు వాడుకుంటామని (పేరా 22 పేజీ 123-124) తెలియజేశారు. ఇలా వరద రావడానికి కారణం మానవ ప్రవర్తనే అంటున్నారు. అవి ఇలా ఉన్నాయి:

i. విస్తారమైన ఆక్రమణలు, ఇసుక పేరుకుపోవడం, వాగు ప్రవాహ తీరు.i
ii. వాగు కట్టలు పాడైపోవడం.
iii. మట్టి కొట్టుకు పోవడం వల్ల మలుపుల్లో నీరు అధికంగా చేరడం, ఆక్రమణలు.
iv. 1950లలో ప్రకాశం బ్యారేజీ నిర్మించడం.
v. ప్రకాశం బ్యారేజీ ఎత్తు పెంచడం, కనీస నీటి నిలవ ఉండేట్టు చూడడం.
vi. గుంటూరు కాలువ.

89. కొండవీటి వాగు పుట్టిన దగ్గరి నుంచి కృష్ణా నదిలో కలిసే వరకు వంకరటింకరగా ప్రవహిస్తుంది. వర్షా కాలంలో మాత్రమే పారే ఈ వాగు పొడవునా

ఆక్రమణలున్నాయి. వాగు భూతలాన్ని కూడా ఆక్రమించారు. దాని ఎత్తును దిగజార్చి పక్కన ఉండే పొలాల ఎత్తుకు తీసుకొచ్చారు. ఆ వాగులో వ్యవసాయ కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయి. దీనికి తోడు అందులో కలుపు మొక్కలు పెరిగిపోయాయి. ఇసుక మేట వేసింది. దీనివల్ల కొండవీటి వాగు సహజ ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. ఈ ఆక్రమణలు, సహజమైన ప్రవాహ మార్గం మారిపోవడం వల్ల కొన్ని చోట్ల 90 డిగ్రీల మలుపులు కూడా ఏర్పడ్డాయి. అందువల్ల నీరు నిలవ ఉండిపోయి అదనపు సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను సరిదిద్దడానికి నీటిపారుదల శాఖ అనేక ప్రయత్నాలు చేసింది. కాని భూ యజమానుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనందువల్ల పనులు పూర్తిగా చేపట్టలేక పోయింది. కాని ఇప్పుడు ఆ భూములు ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి కనక వాగు సహజ ప్రవాహ స్థితిని పునరుద్ధరించడనికి, ఇసుక మేట తొలగించడానికి చర్యలు తీసుకుంటోంది.

కొండవీటి వాగు తలం ఎత్తు +13.5 మీటర్లు ఉంది. అది కృష్ణా నదిలో కలిసే చోట ఉన్న ఎత్తుతో సమానం. అందువల్ల కొండవీటి వాగు నుంచి కృష్ణా నదిలో కలవడానికి అవాంతరాలు ఏమీ లేవు. కాని ఎక్కువ ఎత్తు కట్టలతో ప్రకాశం బారేజీ నిర్మించినప్పుడు గేటు ఏర్పాటు చేశారు. దీనినే ఉండవల్లి రెగ్యులేటర్ అంటారు. దాని వల్ల కొండవీటి వాగులోని నీరు కృష్ణా నదిలో కలవడానికి అవకాశం వచ్చింది. అదే సమయంలో కృష్ణ నీరు వాగు కట్టల కన్నా ఎక్కువ ఎత్తుకు వాగులోకి ప్రవేశించకుండా నిరోధించవచ్చు.

నీటిపారుదల, ఇతర అవసారాల కోసం బారేజీ ఎత్తు పెంచే దాకా ఈ ఏర్పాటు బాగానే పని చేసింది. నార్ల తాతారావు థర్మల్ స్టేషన్ కోసం కొంత కనీస ఎత్తులో నీరు నిలవ ఉంచాల్సిన అవసరం వచ్చింది. దీని వల్ల కొండవీటి వాగులోని నీరు కృష్ణలో కలవడానికి అంతకు ముందున్న ఏర్పాటు పనికి రాకుండా పోయింది. ఇతర కారణాలతో పాటు ఈ కారణంవల్ల వర్షా కాలంలో కొద్ది రోజులపాటు తాత్కాలికంగా వరద వచ్చే ప్రమాదం ఏర్పడింది.

90. ప్రకాశం బారేజీ నుంచి కృష్ణా నది నుంచి గుంటూరు పట్టణానికి మంచి నీరు సరఫరా చేయడం కోసం 1970లో గుంటూరు కాలవ నిర్మించారు. ఈ కాలవకు కొండవీటి వాగు చివరి తూము నుంచి విలోమ పద్ధతిలో నీరు వాడుకుంటారు. గుంటూరు కాలవకు నీటి కోసం నీరు బయటకు వెళ్లే తూము దగ్గర వాగులో నీరు చేరడానికి ఎత్తిపోతలు చేపట్టారు. ఈ నీరు గుంటూరు చేరడానికి ఎఫ్.ఎస్.ఎ. దాకా వెళ్లనిస్తారు. అంటే +17.02 మీటర్ల ఎత్తుకు వెళ్తుంది. అక్కడి నుంచి గుంటూరు కాలవలోకి నీరు చేరుతుంది. గుంటూరు కాలవలోకి +17.02 మీటర్ల మేరకు నీరు రావడానికి 12 కి.మీ. మేర కొండవీటి వాగు నీరు వెనక్కు ప్రవహిస్తుంది. ఇప్పుడు కొండవీటి వాగును, గుంటూరు కాలవను వేరు చేయాలనుకుంటున్నారు.

91. కొండవీటి వాగు వల్ల వరద ముంచెత్తడం తాత్కాలిక వ్యవహారమే కనక నివారక చర్యలు చేపట్టాలని ప్రతివాదులు కోరారు. ఉదాహరణకు డిటెన్షన్ పాయింట్/రిజర్వాయర్ నిర్మించి ప్రతిపాదిత రాజధానికి నీరు అందించవచ్చునని సూచించారు. ఈ ప్రతిపాదన ప్రకటించిన మాస్టర్ ప్లాన్ లో, ఇ.ఐ.ఎ. నివేదికలోనూ చేశారు. దీనిని ఎస్.ఎ.ఎ.సి, ఎస్.ఇ.ఎ.ఎ.సి పరిశీలించాయి. రాజధాని నగరం ఆవల ఒక జలాశయం నిర్మించి కొండవీటి వాగు నుంచి వచ్చే నీటిని నిలవ చేయాలన్న ప్రతిపాదన ఉంది. అదనపు నీరు ఏమైనా ఉంటే అది రాజధాని నగరం ద్వారా వెళ్తుంది. ఆ నీటిని కుంటల్లో నిలవ చేస్తారు. ఈ కుంటల్లో ఉన్న నీరు కనక మిగిలిపోతే అది సముద్రంలో కలుస్తుంది. లేదా రాజధాని నగర అవసరాలకు వినియోగించుకుంటారు. అంతే కాక అదనపు నీటిని వినియోగించడానికి పంపింగ్ సదుపాయం కూడా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. ఈ పనులు ప్రారంభమైనాయి.

వాగు సహజ ప్రవాహానికి అడ్డంకులు తొలగించడానికి ఆక్రమణలన్నీ తొలగిస్తామని ప్రతివాది తరఫు న్యాయవాది తెలియజేశారు. ఇసక మేట తొలగించడం వల్ల వాగులో నీరు నిలబడకుండా ఉంటుంది. వాగు కరకట్టల పక్కన ఉన్న పోరంబోకు

భూములు చెల్లాచెదురైనాయి. వీటిని పునరుద్ధరిస్తారు. వాగు పక్కన చెట్లు పెంచుతారు.

92. పైన పేర్కొన్న వాస్తవాల వల్ల కొండవీటి వాగు వర్షాకాలంలో మాత్రమే ప్రవహిస్తుందని, ఏడాదిలో మిగతా రోజుల్లో ఎండిపోయి ఉంటుందని తెలియజేశారు. అందువల్ల సంవత్సరంలో కొద్ది రోజులు మునిగిపోయి ఉంటుంది. చివరి సారి 2014లో నీట మునిగిపోయింది. ఈ తాత్కాలిక ముంపు సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. అదనపు జలాలను నిలవ చేసి రాజధాని నగరానికి వినియోగించుకోవచ్చు. నీట మునిగి పోవడం అనేక రకాలుగా ఇక్కడ పేర్కొన్నట్టు మానవ నిర్మితమే. కాని కొండవీటి వాగు భూతలం వల్ల ఈ నీరు కృష్ణా నదిలో కలవడానికి ఆటంకం ఏదీ లేదు. వర్షాకాలంలోనే కొండవీటి వాగులో ఎక్కువ నీరు ప్రవహిస్తుంది. గుంటూరు కాలవను కొండవీటి వాగును వేరు చేసే ప్రతిపాదన ఉంది. ఎందుకంటే గుంటూరు కాలవలోకి నీరు వెళ్లే చోట వాగులో నీరు ఎక్కువగా ప్రవహిస్తుంది. వాగు నీటిని నిలవచేయడానికి ప్రతివాదులు డిటెషన్ పాండ్/రిజర్వాయర్ నిర్మించాలని అనుకుంటున్నారు. ఇది రాజధాని నగర అవసరాలకు పనికి వస్తుంది. ఎన్.ఐ.ఎ. నివేదిక మాస్టర్ ప్లాన్ లో ఈ విషయం పేర్కొన్నారు.

కొండవీటి వాగు సహజ ప్రవాహ్ గతిని పునరుద్ధరించడానికి ఆక్రమణలను తొలగిస్తున్నామని ప్రతివాదులు తెలియజేశారు. ఇసుక మేటను కూడా తొలగిస్తామని చెప్పారు. వాగు పక్కన చెట్లు పెంచుతారు. అవసరమైన ఈ చర్యలు తీసుకుంటున్నందువల్ల తాత్కాలికంగా ఎదురయ్యే ముంపు సమస్య ఏడాది పొడవునా ఉండదు కనక నీటిని నిలవ చేసి రాజధాని నగరానికి వినియోగించుకుంటారు. అందువల్ల నిర్మాణంలో ఉన్న రాజధాని నగరానికి ఇది ఆటంకం కాబోదు. అమరావతిని మరోచోటికి మార్చవలసిన అగత్యం లేదు.

**మాగాణి నేలలు, జలాశయాలు:**

93. దరఖాస్తుదారు లేవనెత్తిన మరో సమస్య మాగాణి భూములకు సంబంధించింది. ఈ ప్రాంతంలోని మాగాణి భూములను కాపాడాలని దరఖాస్తుదారు కోరారు. ఇస్రో లోని అంతరిక్ష అనువర్తనా కేంద్రం 2011లో 'జాతీయ మాగాణి భూముల అట్లాస్' సిద్ధం చేసింది. జాతీయ మాగాణి భూముల జాబితా పథకం కింద పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి మంత్రిత్వ శాఖ ఈ అట్లాస్ తయారు చేయించింది. ఈ నివేదికలో ఆంధ్రప్రదేశ్ లో జిల్లాల వారీగా మాగాణి భూములను గుర్తించారు. వీటిని లోతట్టు, తీరప్రాంత మాగాణి భూములు అని వర్గీకరించారు. రాజధాని నగరం గుంటూరు జిల్లాలో సముద్ర తీరానికి 60 నుంచి 78 కి.మీ. దూరంలో ఉంది. అందువల్ల కోస్తా తీర ప్రాంతంలోకి రాదు. గుంటూరుజిల్లా భౌగోళిక విస్తీర్ణం 11391 చదరపు కిలోమీటర్లు. దీనిలో మాగాణి 5.94 శాతం ఉంది. దీనిలో లోతట్టు మాగాణి, తీరప్రాంత మాగాణి భూములు, చెరువుల కింద ఉన్న మాగాణి భూములు కూడా ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 1408 మాగాణి భూములు ఉన్నాయి. దీనిలో 639 భూముల సర్వే జరిగింది. దీనికి తోడు 769 చిన్న మాగాణులు ఉన్నాయి.

నదులు, కాలవలను వదిలేస్తే సహజమైన మాగాణి భూమి ఒకటే ఉంది. అది రాజధాని నగర ప్రాంతంలో లేదు.

94. ఇతర చోట్లకు లాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా కాలవలు, వాగులు, నదులవంటి జలరాశులు అపారంగా ఉన్నాయి. రాజధాని నగరంలో ఇలాంటి ప్రకృతి వనరులు తప్పని సరిగా ఉంటాయి. మునుపటి ఆంధ్రపదేశ్ లో 81 హరివాణాలు, ఉప హరివాణాలు ఉన్నట్టు పటాన్ని చూస్తే తెలుస్తుంది. ఈ పటాన్నిబట్టి చూస్తే రాజధాని నగరంలో ఇవి తక్కువ కనిపిస్తాయి. అలాంటి పరిస్థితిలో సహజవనరులను కాపాడవలసిన అవసరం ఉంటుంది. వీటిని పరిగణనలోకి తీసుకుని బృహద్ ప్రణాళికలో భాగం చేయాలి. ఇది సమగ్ర అభివృద్ధి సూత్రాన్ని పాటించినట్టు అవుతుంది.

95. నది, కాలవలను వదిలేస్తే రాజధాని నగరంలో ఉన్న ఈ వాగు 616 ఎకరాల మేర ఉంది. కొత్త జలవనరులను పెంపొందింప చేసి జలవనరులను 1215 ఎకరాలకు పెంచనున్నట్లు ప్రతివాదులు తెలియాజెశారు. అప్పుడు రాజధాని నగరంలో మొత్తం జలాశయాలు 1813 ఎకరాలకు చేరతాయి. అంటే 50.70 శాతం పెరుగుతాయి. వాగులను, కాలవలను కూడా పరిగణనలోకి తీసుకుంటే 197.24 శాతం పెరుగుతాయి. కొండవీటి వాగు సహజ ప్రవాహ గతిని పునరుద్ధరిస్తామని, ఇప్పుడున్న దాని వెడల్పును 6 నుంచి 30 మీటర్ల నుంచి 30 మీటర్ల నుంచి 90 మీటర్లకు పెంచుతామని కూడా చెప్పరు. అలాగే వాగుకు రెండు వేపులా 30 మీటర్ల మేర చెట్లు పెంచుతారు. ఆ రకంగా మొత్తం ప్రాంతం 336 ఎకరాలు, చెట్లు పెంచే ప్రాంతాన్ని కూడా కలిపితే 627 ఎకరాలు అవుతుంది. ప్రస్తుతం 2 నుంచి 6 మీటర్ల వెడల్పు ఉన్న పాలవాగు వెడల్పును 45 మీటర్లకు పెంచుతారు. రెండు వేపులా కలిపి 30 మీటర్ల మేర చెట్లు పెంచుతారు. అప్పుడు ఈ ప్రాంతం 186 ఎకరాలు అవుతుంది. చెట్లు పెంచే ప్రాంతాన్ని కూడా కలిపితే 433 ఎకరాలు అవుతుంది. కొత్తగా అయిదు కాలవలను నిర్మించబోతున్నారు. వీటి పొడవునా చెట్లు పెంచే ప్రాంతంతో కలిపితే 1410 ఎకరాలు అవుతుంది. రాజధాని నగరంలో కొండవీటి వాగు, పాలవాగును ఎంత బాగా వినియోగించుకోగలమో నీటిపారుదల, ప్రణాళిక సి.ఆర్.డి.ఎ. విభాగాలు పరిశీలిస్తున్నాయి. ఈ పనులు చేపట్టే ముందు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటారు. వర్షపు నీరు మురికి నీటితో కలవకుండా ఉండడం కోసం వర్షపు నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ప్రతివాదులు తెలియజేశారు. ఈ వర్షపు నీటి కాలవలను స్థలాకృతి, నగరంలో ఉన్న జలాశయాల ఆధారంగా సమీకృతం చేస్తారు. దీని వల్ల భూగర్భ జలాలు మెరుగుపడతాయి. నగరంలోని అన్ని జలాశయాల చుట్టూ చెట్లు ఉంటాయి.

**కమిటీ:**

96. రాజధాని నగరం ఎక్కడ ఉండాలో నిర్ణయించడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక హక్కు అని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా తెలియాజేసింది. ఆ నివేదికలో ఇలా తెలియజేశారు:

"రాజధాని నగరానికి, అది ఎక్కడ ఉండాలి అన్న విషయం కేంద్రప్ర భుత్వంతో సంప్రదించి నిర్ణయించాల్సిన ప్రత్యేక హక్కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదేనని ఈ కమిటీ గుర్తిస్తోంది."

(నిపుణుల కమిటీ నివేదికలోని పేజీ 5)

ఈ కమిటీ రాజధాని ఎక్కడ ఉండాలో నిర్దిష్టమైన సిఫార్సు ఏమీ చేయలేదు. నివేదికలోని ఆరవభాగంలో "సారాంశం, ముగింపు" చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. జిల్లా, రాజధాని మండలానికి తగిన సూచీని అనుసరించి "రాజధాని కావడానికి అనువుగా ఉన్న ప్రాంతాలను" మాత్రమే సూచించింది. అందులో విజయవాడ-గుంటూరు ప్రాంతం అత్యంత అనువైందిగా అవతరించింది.

ఈ నివేదికలోని అంశాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే నివేదికను పూర్తిగా పరిశీలించాలి. నివేదికలోని ఒక భాగాన్ని మాత్రమే ప్రస్తావిస్తే సరిపోదు. ప్రతివాదులు దాఖలు చేసిన ప్రతి ప్రమాణపత్రంలోని 32వ పేరాలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. పైగా ఈ నివేదికను దానితో పాటు అందజేసిన పటాలతో సహా చూడాలి. ఈ రెండింటినీ పరిశీలిస్తే స్పష్టమైన అవగాహన కలుగుతుంది (ప్రతివాదులు 10-08-2015న దాఖలు చేసిన ప్రతి ప్రమాణ పత్రంలోని పేజీ 116-121 లోని పేరాలు 12-18, పేజీలు 128-129 లోని పేరాలు 32).

భూ సమీకరణ:

97: రాజధాని నగరం కోసం భూసేకరణ అంశంలో భూ సమీకరణ విషయం ప్రస్తావిద్దాం. ఈ అంశంపై రెండు పక్షాల వాదనలను సవివరంగా విన్నాం. అమరావతి రాజధాని నగరం 217.23 చదరపు కి.మీ. ఉంది. ఇది దాదాపుగా 57350 ఎకరాలు. ఇంతవరకు రైతులు రాజధాని నగరం ఏర్పాటుకు దాదాపు 34,000 ఎకరాలు ఇవ్వడానికి అంగీకరించారు. ఈ భూములను భూసమీకరణలో

భాగంగా ప్రకటించారు. దీనిలో భాగంగా భూమి ఇచ్చిన యజమానులకు అభివృద్ధి చేసిన వాణిజ్య విలువ ఉన్న నివాస స్థలాలను కేటాయిస్తారు. దీనికి తోడు ఇతర ప్రయోజనాలూ ఉంటాయి. అభివృద్ధి చేయని భూములు ఇచ్చిన వారికి ఈ వాణిజ్య నివేశన స్థలాలు కేటాయిస్తారు. ప్రభుత్వానికి స్వాధీనం చేసిన ప్రతి ఎకరం భూమికి బదులుగా 1000 గజాల నివేశన స్థలం, 250-450 గజాల వాణిజ్య స్థలం కేటాయిస్తారు. పంట నష్టానికి గాను ఏడాదికి ప్రతి ఎకరానికి రూ. 30, 000 నుంచి రూ. 50, 000 దాక పరిహారం చెల్లిస్తారు. ఇలా ఏడాదికి 10 శాతం చొప్పున పెంచి పదేళ్ల పాటు చెల్లిస్తారు. మొదటి సంవత్సరానికి (2015-16) రూ. 128. 92 కోట్లు చెల్లించారు. రెండవ సంవత్సరానికి రూ. 141 కోట్లు విడుదల చేశారు. దీనికి తోడు నిమ్మ/సపోటా/జామ/ఉసిరి/మల్లె తోటలు ఉన్న రైతులకు ఒకే విడత కింద ఎకరానికి రూ. 1, 00,000 చెల్లించారు.

98. భూసమీకరణ కింద భూములు స్వాధీనం చేసిన వారికి ఇతర సదుపాయాలు కూడా అందజేశారు. అవి:

1. ఈ పథకం కింద భూములు స్వాధీనం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్ లో ఆస్తుల మీద పన్ను రాయితీ ఇచ్చింది.

2. రిజిస్ట్రేషన్ పన్ను నుంచి మినహాయింపు ఇస్తూ భూసమీకరణ సర్టిఫికేట్లు జారీ.

3. ఈ పథకం కింద భూమి స్వాధీన చేసిన వారికి రూ. 1, 50, 000 మేర వ్యవసాయ రుణాల మాఫీ. ఈ సదుపాయం 8135 మంది రైతులకు అందజేశారు. ఇంతవరకు రూ. 80. 96 కోట్లు పంపిణీ చేశారు.

4. 2013 నాటి భూసేకరణ, పునరావాస, సహాయ చట్టం కిందకన్నా భూసమీకరణ వల్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నందువల్ల భూమి యజమానులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా భూములు స్వాధీనం చేశారు.

99. అంతేగాక రాజధాని 08-12-2014 వరకు నగరంలోని వారందరికీ ఈ కింది ప్రయోజనాలు దక్కుతాయి:

1. భూమి లేని కుటుంబాల వారందరికీ నెలకు రూ. 2,500 చొప్పున పదేళ్ల పాటు చెల్లిస్తారు. ఈ పద్దు కింద ఇప్పటి వరకు రూ. 104 కోట్లు విడుదల చేశారు.

2. ప్రతి కుటుంబానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్.ఆర్.ఇ.జి.ఎ.) కింద 365 రోజులు పని కల్పిస్తారు.

3. రాజధాని నగర నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయేవారికి, ఇళ్లు లేని వారికి గృహవసతి కల్పిస్తారు.

4. కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, అవసరమైన ఇతరులకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇస్తారు. ఇది ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇంతవరకు 5135 మందికి శిక్షణ ఇచ్చారు. 1,009 మందికి ఉపాధి కల్పించారు.

5. స్వయం ఉపాధి కోసం పేద కుటుంబాలన్నింటికీ వడ్డీ లేకుండా రూ. 25 లక్షల వరకు రుణ సదుపాయం.

6. సంబంధిత శాఖ 16-05-2016న ఉచిత విద్యా విధానాన్ని ప్రకటించింది.

7. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 12-05-2016న ఉచిత వైద్య విధానాన్ని ప్రకటించింది.

(భూ సమీకరణ పథకం ఉత్తర్వు-అనుబంధం ఆర్-10)

100. రాజధాని నగర నిర్మాణం కోసం రైతుల భూ సమీకరణ పథకం పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత అమరావతి నిర్మాణానికి ఈ పథకంలో ఏకపక్ష నిర్ణయం గాని, రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే అంశాలు కాని లేవని నిర్ధారణకు వచ్చాం. ప్రతివాదులు చెప్పిన దాని ప్రకారం రైతులు స్వచ్ఛందంగా భూములు అప్పగించడానికి ముందుకొచ్చారు. ఈ భూములకు సంబంధించి ఉత్తర్వు జారీ చేసిన తర్వాత రైతులకు అభివృద్ధి చేసిన నివేశన స్థలాలు, వాణిజ్య ప్లాట్లు ఇస్తారు. దానికి తోడు పంటలు నష్టపోయినందుకు పదేళ్లపాటు పరిహారం చెల్లిస్తారు. ఈ పరిహారం ఏటా 10 శాతం పెరుగుతుంది. దీని

కింద ఇప్పటికే రూ. 128. 92 కోట్లు చెల్లించారు. రెండవ సంవత్సరానికి రూ. 141 కోట్లు విడుదల చేశారు.

నిమ్మ, ఉసిరి మొదలైన తోటలు వేసిన వారికి ఏక మొత్తంలో చెల్లింపు కింద రూ. 1, 00,000 చెల్లించారు. అంతే కాకుండా రైతులకు ఆస్తి పన్నులో మినహాయింపు, రుణ మాఫీ, భూమి లేని వారికి పదేళ్ల పాటు నెల నెలా రూ. 2,500, ఉచిత విద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇంతవరకు రైతులు స్వచ్ఛందంగా భూములు స్వాధీనం చేయడం, దీవులలోనూ, లంకల్లోనూ ఉన్న భూములను కూడా రైతులు స్వాధీనం చేయడాన్ని బట్టి చూస్తే ప్రభుత్వం బలవంత పెట్టలేదని, భూసమీకరణ పథకం రైతులకు మేలే చేస్తుందని రుజువు అవుతోంది. అందువల్ల భూసేకరణ విధానం ఏకపక్షమైందని, బలవంతాన అమలు చేస్తున్నారని దరఖాస్తుదారు చేస్తున్న వాదన నిలబడదు.

సుసంపన్నమైన సేద్య భూమి:

101. రాజధాని నగర ప్రాంతంలో సుసంపన్నమైన వ్యవసాయ భూములు ఉన్నాయని, అందువల్ల వి.జి.టి.ఎం. ప్రాతంలో రాజధాని నిర్మాణాన్ని పునఃపరిశీలించాలన్న ప్రశ్న దరఖాస్తుదార్లు లేవనెత్తారు. రాజధాని నగర ప్రాంతంలో ఉన్న భూములు చాలావరకు నల్ల రేగడి నేలలు. అక్కడ పత్తి, తోటల పెంపకం, మొక్క జొన్న ఎక్కువగా పండుతాయి. వరి పండించే ప్రాంతం పెద్దగా లేదు.

102. ఇ.ఐ.ఎ. అధ్యయనం కింద రాజధాని నగర ప్రాంతంలో వ్యవసాయ కార్యకలాపాల గురించి విస్తృతమైన అధ్యయనం చేశారు. ఈ అధ్యయన నివేదికను ఎస్.ఇ.ఎ.సి.కి ఆ తర్వాత ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.కు అందజేశారు. ఇ.ఐ.ఎ. నివేదికలో భాగంగా పర్యావరణ అనుమతుల కోసం ఈ నివేదిక అందజేశారు. ఇ.ఐ.ఎ. నివేదికలోని "పర్యావరణ వివరణ" అన్న 5వ అధ్యాయంలోని భాగం రాజధాని నగరంలోని పర్యావరణంలోని వివిధ అంశాలను వివరించింది. ఈ పథకం అమలయ్యే ప్రాంతంలోని వ్యవసాయోత్పత్తి గురించి సవివరమైన

అధ్యయనాల/సర్వేల నివేదిక కూడా అందజేశారు. (ఇ.ఐ.ఎ. నివేదికలోని పేజీలు 175-179)

ఇ.ఐ.ఎ. నివేదిక ప్రకారం ఖరీఫ్, రబీ సీజన్ లో (2014-15) మొత్తం పంటలు వేసిన ప్రాంతం 17394 హెక్టార్లు. ఇందులో 30.04 శాతం లో పత్తి వేశారు. 22.54 శాతంలో తోటలు ఉన్నాయి. 22.21 శాతంలో మొక్క జొన్న పండిస్తున్నారు. అందువల్ల ఇక్కడ రాజధాని నగరం నిర్మిస్తే ఆహార భద్రతకు భంగం వాటిల్లుతుందని దరఖాస్తుదారు చేసిన వాదన సరైంది కాదు.

103. 2014 ఖరీఫ్ సీజన్ లో రాజధాని నగర ప్రాంతంలో మొత్తం పంటలు వేసిన విస్తీర్ణం 11, 242 హెక్టార్లు. ఇందులో 1,266 హెక్టార్లలో వరి వేశారు. ఇదే మొత్తం ఆంధ్రప్రదేశ్ తో పోలిస్తే మొత్తం పంటలు వేసిన ప్రాంతం 41,01,00 హెక్టార్లు అయితే వరి పండించే ప్రాంతం 16, 35,00 హెక్టార్లు. అంటే రాజధాని నగర ప్రాంతంలో వరి పండించే ప్రాంతం మొత్తం రాష్ట్రంలోని పంట పండించే ప్రాంతంలో కేవలం 0.027 శాతం. వరి పండించే ప్రాంతంలో కేవలం 0.0077 శాతం (10-08-2015న దాఖలు చేసిన ప్రతి ప్రమాణ పత్రంలోని పేజీలు 125-126లోని 26వ పేరా).

104. గోదావరి నది మీద పోలవరం పథకం పూర్తి అయితే ఆయకట్టు సుస్థిరమై 7 లక్షల 27 వేల కన్నా ఎక్కువ ఎకరాలకు సాగునీరు అందుతుంది. దానికి తోడు పట్టి సీమ పథకం వల్ల కృష్ణా డెల్టా ప్రాంతంలో ఆదా అయ్యే నీటిని రాష్ట్రంలోని అనావృష్టి ప్రాంతాలకు సాగు నీరు, సేద్యపు నీరు అందించడానికి వినియోగించుకోవచ్చు. అంతేగాక 2014 నుంచి అనేక పథకాలు పూర్తి అయ్యాయి. వెలిగొండ, హంద్రీ నీవా సుజల స్రవంతి, గాలేరి నగరి సుజల స్రవంతి పథకాలను పూర్తి చేసి మరిన్ని ప్రాంతాలకు సేద్యపు నీరు అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సకల చర్యలు తీసుకుంటోంది.

ఇప్పటికి పూర్తి అయిన పథకాలు, చివరి దశలో ఉన్న పథకాల వల్ల ఆయకట్టు సుస్థిరమై నికరంగా నీరు అందుతుంది కనక రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుంది. రాష్ట్రంలోని రైతులపై సానుకూల ప్రభావం ఉంటుంది. ఈ

ప్రయత్నాలకు తోడుగా రాష్ట్రం మరింత భూమిని సేద్యయోగ్యం చేయడానికి చర్యలు తీసుకుంటుంది. ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ.

లంకలు:

105. దరఖాస్తు దారు 2016 ఆగస్టు ఆరున దాఖలు చేసిన ప్రత్యుత్తరంలో లంకల్లో నివసిస్తున్న ప్రజల, వారి భూముల సమస్యను కూడా లేవనెత్తారు. కృష్ణా నది ప్రవాహ గతి మారడం వల్ల కొన్ని ప్రాంతాలు దీవులుగా మారాయి. ఈ భూములను ఆయా గ్రామాల రెవెన్యూ ఆవాస ప్రాంతాలుగా పరిగణిస్తున్నారు. అవి అంతకు ముందు ఆ గ్రామాలలో అంతర్భాగాలుగా ఉండేవి. కొన్ని లంకలు భూభాగాంతో కలిసి, సంబంధం కలిగి ఉన్నాయి. ఇవి నదికి ఇరువైపులా ఉన్నాయి.

మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లంక భూములను ఎ తరగతి (శాశ్వత), బి తరగతి (పాక్షికంగా శాశ్వత), సి తరగతి (తాత్కాలిక) లంకలుగా వర్గీకరించారు. ప్రభుత్వ విధానం ప్రకారం ఎ, బి తరగతి లంకలను వ్యవసాయం కోసం పేద ప్రజలకు ఇచ్చి డి పట్టాలు మంజూరు చేయాలి. డి ఫార్మ్ పట్టాలకు అనుగుణంగా కొంత మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారు. అందులో పట్టా భూములు, భూపరిమితి ప్రకారం మిగులు భూములు, డి ఫార్మ్ పట్టా భూములు ఉన్నాయి. మిగతావి ప్రభుత్వం భూములు. రాజధాని నగర రెవెన్యూ ప్రాంత పరిధిలో 13 లంకలు ఉన్నాయి. వీటిలో రాయపూడిలోని పెదలంక, ఉద్దండరాయని పాలెం లంకలో మాత్రమే జనావాసాలు ఉన్నాయి. పెదలంకలో 118 కుటుంబాలు, 456 మంది ఉన్నారు. ఉద్దండరాయని పాలెం లంకలో 68 కుటంబాలు, 259 మంది ప్రజలు ఉన్నారు. ఈ దీవుల్లో విద్యుత్ సరఫరా, ప్రాథమిక పాఠశాలలు, దేవాలయాల వంటివి కూడా ఉన్నాయి. ఈ పదమూడు లంకల్లో ఒకటైన భవానీ ద్వీపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశారు. ఆ ప్రాంతంలో అది ప్రసిద్ధమైన పర్యాటక కేంద్రం. ఆ దీవిలో రిసార్టులు, ఇతర వినోద సదుపాయాలు ఉన్నాయి. ఈ మూడు లంకలు మినహా మిగతావన్నీ జనావాసం

లేనివే. కొన్నింటిలో వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వీటిలో కొన్నింటికి ప్రజలు వాహనాల ద్వారా వెళ్తుంటారు. ఇది ఏడాదిలో చాలా రోజులు జరుగుతుంది.

లంకల్లో ఉన్న చాలా మంది లబ్ధిదార్లు/పట్టాదార్లు/నివాసితులు తమ భూములను కూడా భూసమీకరణలో భాగంగా స్వాధీనం చేయడానికి అంగీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనికి అనుగుణంగా 2015 నాటి ఎ.పి.సి.ఆర్.డి.ఎ. చట్టం కింద ప్రతివాదులు ఎల్.పి.ఎస్. నిబంధనలు రూపొందించి 05-12-2015న లంక భూములను స్వచ్ఛంద ప్రాతిపదికన సమీకరించడానికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూముల పరిశీలన, భాగనిర్ణయం కొనసాగుతోంది. ఈ పథకం కింద లంకల్లో ఉంటున్న వారికి ప్రధాన భూభాగంలో భూములు కేటాయించి పునరావాసం కల్పిస్తారు. అవసరాన్ని బట్టి లంక భూములను పటిష్ఠం చేస్తారు. క్రమబద్ధీకరిస్తారు. అవసరమైన అనుమతులు తీసుకున్న తర్వాత నదీ పరిరక్షకుల ఆదేశాల ప్రకారం ఈ పని చేస్తారు. ఈ భూములను అనుమతించిన పనులకు మాత్రమే వినియోగిస్తారు.

106. దీవుల్లో లంక భూములకు సంబంధించి దరఖాస్తుదారు లేవనెత్తిన అంశాలు రెండు రకాలుగా ఉన్నాయి. మొదటిది - అక్కడ నివసిస్తున్న ప్రజలకు సంబంధించింది. రెండవది - వారి సేద్యపు భూములకు సంబంధించింది. ఇంతకు ముందు ప్రస్తావించినట్టుగా రాజధాని నగర రెవెన్యూ పరిధిలోని మొత్తం 13 లంకల్లో కేవలం పెదలంక, ఉద్దండరాయనిపాలెంలో మాత్రమే జనావాసాలు ఉన్నాయి. అక్కడ మొదటి దానిలో 118 కుటుంబాలు, రెండవ దానిలో 68 కుటుంబాలు ఉన్నాయి. ఈ లంకల్లో విద్యుత్తు, ప్రాథమిక పాఠశాల వంటి సదుపాయాలు ఉన్నాయి. మరో లంక అయిన భవానీ ద్వీపంలో రిసార్టులు, వినోద సదుపాయాలు ఉన్నాయి. మిగతా పది లంకల్లో జనావాసాలు లేవు. అక్కడ కొన్ని వ్యవసాయ కార్యకలాపాలు మాత్రం సాగుతున్నాయి.

లంకల్లో నివాసం ఉండే వారిలో ఎక్కువ మంది తమ భూములను కూడా భూసమీకరణలో భాగం చేయాలని అభ్యర్థించారు. దీని కోసం 05-12-2015న ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం వీరికి రాజధాని నగర ప్రాతంలో పునరావాసం కల్పించి భూములు కేటాయిస్తారు. నదీ పరిరక్షకుడి ఆదేశాల మేరకు లంక భూములను ప్రభుత్వం క్రమబద్ధం చేస్తుంది. ఈ భూములను పరిమిత ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించుకుంటారు. మరో రకంగా చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వం లంకల్లో నివాసం ఉండే వారికి, వారి భూములకు సంబంధించి సముచిత చర్యలు తీసుకుంటోంది. వారికి భూములు కేటాయిస్తోంది. పునరావాసం కల్పిస్తోంది. ఈ విషయంలో దరఖాస్తుదారు లేవనెత్తిన అభ్యంతరాలలో పస లేదు.

ఇ.ఐ.ఎ. ఉత్తర్వు:

107. 14-09-2006 నాటి పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వుకు అనుబంధంగా ఉన్న షెడ్యూలు (ఇక మీదట ఇ.ఐ.ఎ. ఉత్తర్వు అని ప్రస్తావిస్తాం) ప్రకారం పథకాలను, కార్యకలాపాలను 'ఎ ' కాటగరీ, 'బి ' కాటగరీగా వర్గీకరించారు. వాటి ప్రభావాన్ని బట్టి ఈ వర్గీకరణ చేశారు. 'ఎ ' కాటగరీ కిందకు వచ్చే పథకాలకు ప్రభుత్వం నుంచి ముందుగా పర్యావరణ అనుమతి తీసుకోవాలి. 'బి ' కాటగరీ కిందకు వచ్చే పథకాలకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా వ్యవస్థ (ఇక మీదట ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) నుంచి అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర నిపుణుల అంచనా కమిటీ (ఇక మీదట "ఎస్.ఇ.ఎ.సి.") సిఫార్సుల మేరకు ఈ అనుమతి వస్తుంది.

108. ఇ.ఐ.ఎ. 14-09-2006 న జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం పథకాలను, కార్యకలాపాలను పైన పేర్కొన్న షెడ్యూలులో వివిధ అంశాలుగా ఉపాంశాలుగా విభజించారు. అమరావతి రాజధాని నగరం పథకం "టౌన్షిప్ అండ్ ఏరియా డెవలప్మెంట్ ప్రాజెక్ట్స్" శీర్షిక కింద ఉపాంశం (బి) కిందకు వస్తుంది. ఈ షెడ్యూలులోని 8(బి) కిందకు వచ్చే పథకాలన్నీ 'బి' పథకాలు అన్న వర్గంలోకి వస్తాయి.

109. అమరావతి నగరం 217.23 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇది 8 (బి) అంటే "టౌన్షిప్ అండ్ ఏరియా డెవలప్మెంట్ ప్రాజెక్ట్స్" కిందకు వస్తుంది. అంటే 50 హెక్టార్లకన్నా తక్కువ, నిర్మిత ప్రాంతం 1,50,000 చదరపు మీటర్లకన్నా తక్కువ అన్న పరిధిలోకి వస్తుంది. ఆ రకంగా ఈ పథకం ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం కాటగరీ 'బి ' కిందకు వస్తుంది. అంటే ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. నుంచి అనుమతి తీసుకోవాలి.

110. 14-09-2006 నాటి ఇ.ఐ.ఎ. ఉత్తర్వును ను ఎస్.ఒ. ఉత్తర్వు సంఖ్య 3252 (ఇ)ద్వారా 22-12.2014లో సవరించారు. ఈ సవరణ ప్రకారం 14.09-2006 నాటి ఉత్తర్వులో ఉన్న సాధారణ షరతులు షెడ్యూలులోని 8వ అంశానికి చెందిన 8(ఎ), 8(బి) కి వర్తించవు. 22-12-2014 నాటి సవరణ ఉత్తర్వులో ఇలా ఉంది: "టౌన్షిప్ అండ్ ఏరియా డెవెలప్మెంట్ ప్రాజెక్టులు ఈ అంశానికి సంబంధించి పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక అవసరం. ఇది కాటగరీ 'బి1' ప్రాజెక్టు కిందకు వస్తుంది.

గమనిక - "సాధారణ షరతులు" వర్తించవు.

111. ఇ.ఐ.ఎ. ఉత్తర్వు లో పేర్కొన్న షరతులను ఉత్తర్వు సంఖ్య ఎస్.ఒ. 3252 (ఇ) ప్రకారం సవరించారు గనక 8(బి) కిందకు వచ్చే పథకాలన్నింటికీ పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక అవసరం. దీనిని కాటగరీ 'బి1 ప్రాజెక్టుగా పరిగణించాలి. రాజధాని నగర పథకానికి పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక కావాలి (ఇక మీదట "ఇ.ఐ.ఎ. నివేదిక). దీనిని 'బి1' పథకం కింద పరిగణించాలి.

112. ఇ.ఐ.ఎ. అధ్యయనం చేసి ప్రామాణిక అంశాల ప్రకారం ఇ.ఐ.ఎ. నివేదిక తయారు చేసి పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి మంత్రిత్వ శాఖ (ఇక మీదట "ఎం.ఒ.ఇ.ఎఫ్") 2015 ఏప్రిల్ లో 10-04-2015 ఉత్తర్వు సంఖ్య ఎస్.ఒ. 996 (ఇ) ప్రకారం ప్రచురించింది.

113. ఇ.ఐ.ఎ. ఉత్తర్వు లోని పేరా 7(ఇ) లోని ఉప పేరా ఈఈఈ ప్రకారం కొన్ని రకాల పథకాలకు ప్రజలను సంప్రదించాలి. దీనికి కొన్ని మినహాయింపులు కూడా

వర్తిస్తాయి. నిబంధన (ఇ) లోని ఉప నిబంధన (డి) ని ఉప పేరా ఈఈఈ లో ఇ.ఐ.ఎ. సవరణను 01-11-2009న ఉత్తర్వు సంఖ్య ఎస్.ఒ. 3067 (ఇ) ద్వారా చేర్చారు.

114. ప్రతివాది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి దశలోనూ ఇందులో ప్రజలకు పాత్ర కల్పించింది. నివేదిక రూపిందించే క్రమంలో శివరామ కృష్ణన్ కమిటీ ప్రజలను సంప్రదించింది. ఇతర అంశాలతో పాటు రాజధాని నగరం ఎక్కడ ఉండాలో నిర్ణయించేటప్పుడు, భావన ప్రణాళికను రూపొందించేటప్పుడు, భూ సమీకరణ సమయంలో అన్ని దశల్లో ప్రజలను సంప్రదించారు. ప్రతివాది బృహద్ ప్రణాళికను ప్రజలకు అందుబాటులో ఉంచారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని కోరారు. అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత బృహద్ ప్రణాళికను రూపొందించి వెల్లడించారు. భూముల స్వాధీనం చేసిన యజమానులను సంప్రదించి భూసమీకరణ లే ఔట్లు సిద్ధం చేశారు. ఇ.ఐ.ఎ. అధ్యయనం సమయంలోనూ పథకం అమలయ్యే ప్రాంతంలోనూ, అధ్యయనం చేసిన ప్రాంతంలోనూ ప్రజలను సంప్రదించారు.

115. ఇ.ఐ.ఎ. ఉత్తర్వుకు అనుగుణంగా ఫార్మ్ 1, ఫార్మ్ 1ఎ. భావన ప్రణాలిక కు కట్టుబడి పథకాన్ని మదింపు వేశారు. ఎ.ఐ.ఎ. ఉత్తర్వు లోని అయిదవ అనుబంధంలోని మూడవ పేరా ప్రకారం షెడ్యూలు లోని 8(బి) కిందకు వచ్చే పథకాన్ని ఎస్.ఎ.ఎ.సి. ఫార్మ్ 1, ఫార్మ్ 1ఎ, భావన ప్రణాళిక, ఇ.ఐ.ఎ. నివేదికను దృష్టిలో ఉంచుకుని "విశిష్టమైన పథకం"గా మదింపు వేసింది.

116. ఇ.ఐ.ఎ. ఉత్తర్వుకు అనుబంధంగా ఉన్న షెడ్యూలు 8(బి) కింద ఉన్న ఛత్తీస్ గఢ్ లోని నయా రాయపూర్ నగరం, గుజరాత్ లోని గిఫ్ట్ సిటీని దృష్టిలో ఉంచుకుని అమరావతి రాజధాని నగర ఇ.ఐ.ఎ. నివేదిక తయారు చేశారు. ప్రస్తుత పథకాన్ని మదింపు వేసేటప్పుడు ఎస్.ఇ.ఎ.సి, ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. ఈ రెండు పథకాలకు అనుమతి మంజూరు చేసిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుంది.

117. అమరావతి రాజధాని నగర అభివృద్ధి పథకంలో అభివృద్ధి ప్రణాళికలలో మూడు దశలు ఉన్నాయి. మొదటి దశ (2015 నుంచి 2025), రెండవ దశ (2026 నుంచి 2035), మూడవ దశ (2036 నుంచి 2050) గా ఉంటాయి. ఇది 2050 దాకా విస్తరిస్తుంది. వచ్చే 35 ఏళ్లల్లో రాజధాని నగర అభివృద్ధిలోని మూడు దశలు ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం "విశిష్ట పథక ఆవర్తనం" కలిగి ఉంటుంది.

118. ఈ పథకం సుధీర్ఘ కాలానికి వర్తించేది కనక ప్రాంత అభివృద్ధి పథకాలను భావన ప్రణాళికకు అనుగుణంగా మదింపు వేయడానికి అవకాశం కల్పించారు. ఈ నగరాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తారు కనక అభివృద్ధికి సంబంధించిన అన్ని వివరాలను నిర్ణయించడం సాధ్యం కాదు. ఏ సమయానికి ఏది అవసరం వస్తుంది అన్న దాన్ని బట్టి నిర్ణయిస్తారు. అదీ గాక ఈ ప్రణాళిక 35 ఏళ్ల కాలంలో అప్పటి పరిస్థితులను బట్టి, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాలు, జాతీయ, అంతర్జాతీయ విధానాలు, ప్రజల కోరికలు, అంటే నగర ప్రజల అవసరాలు, రాష్ట్ర అవసరాలు, దేశ అవసరాలనుబట్టి మారొచ్చు.

119. పై అంశాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ అనుమతులకోసం నిర్దిష్ట షరతులు విధించారు. అవి ఇలా ఉన్నాయి:

"ఈ పథకం పరిధిలో వచ్చే మార్పులను బట్టి ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. తాజాగా మదింపు వేయాలి. ప్రభుత్వ భవన సదుపాయాలు, గృహ సముదాయాలు, సాంస్కృతిక కేంద్రాలు, పరిశ్రమలు-ఐ.టి. పార్కులు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు మొదలైన వాటితో సంబంధం ఉంటుంది గనక నిర్మించే విస్తీర్ణం, తవ్వకాలు, నీటి వినియోగం, పారిశుద్ధ్యం, ఘన రూప వ్యర్థాలు, విద్యుత్ అవసరాలు, కాలుష్య నియంత్రణ ఏర్పాట్లు, పర్యావరణ రక్షణ అంశాలు, నిర్మాణ సామాగ్రి మొదలైన వాటిని ఇందులో చేర్చలేదు. వివిధ పథకాలు చేపట్టే వారు ప్రత్యేకంగా పర్యావరణ అనుమతులు అన్ని పథకాలకు తీసుకోవాల్సి వస్తుంది. అంటే 2006 నాటి పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వు ప్రకారం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ

అంచనా వ్యవస్థ నుంచి. 2006 నాటి పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వు ప్రకారం అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

120. ఈ పిటిషన్ కు సమాధానం చెప్పిన ప్రతివాది అంటే పథకాన్ని ప్రతిపాదించే వారు రాజధాని నగరా పథకంలో భాగంగా 35 ఏళ్ల కాలంలో ప్రాథమిక సదుపాయాలు కల్పిస్తారు. అంటే ఈ గడువు 2050 దాకా ఉంటుంది. పథకం లక్ష్యాలు సాధించడానికి పథకాన్ని ప్రతిపాదించిన వారు ఎ.పి.సి.ఆర్.డి.ఎ. చట్టానికి అనుగుణంగా పర్యావరణ అనుమతులను దృష్టిలో ఉంచుకుని బృహద్ ప్రణాళిక సిద్ధం చేశారు.

121. రాజధాని నగరాన్ని తొమ్మిది ఇతివృత్త నగరాలుగా విభజించారు. అవి: ప్రభుత్వ నగరం, న్యాయ నగరం, ఆర్థిక నగరం, విజ్ఞాన నగరం, ఆరోగ్య నగరం, క్రీడా నగరం, పర్యాటక నగరం, మీడియా నగరం, ఎలక్ట్రానిక్ నగరం. ఈ మండలాల ఆధారంగా రాజధాని నగరాన్ని బృహద్ ప్రణాళికలో మళ్లీ నివాస ప్రాంతం, వాణిజ్య ప్రాంతం, హరిత ప్రాంతం, రక్షిత ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం మొదలైన ప్రాంతాలుగా విభజించారు. వీటికి తగిన మౌలిక సదుపాయాల కోసం ఏర్పాట్లు చేశారు. ఈ పథకం ప్రతిపాదకులు, రోడ్లు, రవాణా, సత్వర ప్రయాణ వ్యవస్థలు, విద్యుత్ లైన్లు, మురికి నీటి కాలవలు, గ్యాస్ పైప్ లైన్లు, పార్కులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. వీటిని అభివృద్ధి చేసే వారు ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, పరిశోధనా కేంద్రాలు, సాంస్కృతిక కేంద్రాలు, ఆసుపత్రులు, హోటళ్లు, మాల్ లు మొదలైనవి వచ్చే 35 ఏళ్ల కాలంలో అవసరాలు, ఉన్న పరిస్థితులనుబట్టి నిర్మించాలి.

122. ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం ఒక పథకం, లేదా కార్యకలాపం చేపట్టాలంటే, వాటికి ముందు పర్యావరణ అనుమతి అవసరమైతే ఆ పథకాలు ప్రతిపాదించే వారు ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం అనుమతులు తీసుకోవాలి.

123. అందువల్ల ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, పరిశోధనా కేంద్రాలు, సాంస్కృతిక కేంద్రాలు, ఆసుపత్రులు, హోటళ్లు, మాల్ లు వచ్చే 35 ఏళ్ల కాలంలో నిర్మించే వారు పథకం ప్రతిపాదకులు అవుతారు. ఈ పథకాలకు వారు పర్యావరణ అనుమతితో సహా సకల అనుమతులు అమలులో ఉన్న చట్టం ప్రకారం తీసుకోవాలి.

124. దరఖాస్తుదారు/ ఫిర్యాదుదారు ప్రకారం ప్రతివాది అయిన రాజ్యవ్యవస్థ భారీ స్థాయిలో పట్టణీకరణ కోసం ప్రయత్నిస్తూ విస్తారమైన భూభాగాన్ని ఎలాంటి పర్యావరణ ప్రభావ అంచనా లేకుండానే వినియోగిస్తోంది కనక దీని వల్ల ఆ ప్రాంతంలో పర్యావరణంపై ప్రభావం ఉంటుంది. ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవడానికి ముందు 1986 నాటి పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం సవివరంగా పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయాలని ఫిర్యాదుదార్లు కోరారు. అదీగాక రాజధాని నగరం ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ విభాగాల కోసం మౌలిక సదుపాయాలు కల్పించవలసి ఉంటుందని కూడా తెలియజేశారు. విస్తృతమైన పట్టణీకరణ చేపడుతున్నప్పుడు పర్యావరణంపై పడే ప్రభావాన్ని అంచనా వేసే లక్ష్యంతో 1986 నాటి పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం అంచనా వేసి కలగనున్న ముప్పు నివారించాలని కూడా కోరారు. అమలులో ఉన్న చట్టాలకు అనుగుణంగా సకల అనుమతులు తీసుకునే నిర్మాణ కార్యక్రమాలు చేపడతామని ప్రతివాదులు తెలియజేశారు.

కొత్త రాజధాని నగరం దాదాపు 217 చదరపు కి.మీ. పరిధిలో ఉంటుంది. ఉపాంశం 8(బి) ప్రకారం అంటే టౌన్షిప్ అండ్ ఏరియా డెవలప్ మెంట్ ప్రాజెక్టు ప్రకారం 50 హెక్టార్ల లేదా 150000 చదరపు మీటర్ల నిర్మిత ప్రాంత పరిధి ఉంటుంది. అందువల్ల ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం ఈ పథకం కాటగరీ బి పథకం కిందకు వస్తుంది. అదీగాక 22-12-2014న జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 14-09-2006 నాటి ఉత్తర్వులోని 8వ అంశంలోని సాధారణ షరతులు 8(ఎ), 8(బి) వర్తించవు. మరో రకంగా చెప్పాలంటే రాజధాని నగర పథకానికి బి1 పథకం కింద ప్రభావ

అంచనా అవసరం. అందువల్ల ప్రస్తుత కేసులో ఈ పథకం 2006నాటి ఇ.ఐ.ఎ. ఉత్తర్వు లోని కాటగరీ ఎ కిందకు రాదు.

ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. కు అధికారపరిధి లేదు:

125. ఈ పథకంలో విమానాశ్రయం, జాతీయ రహదారులు, పారిశ్రామిక మండలి, ఉమ్మడి జీవ వైద్య వ్యర్థపదార్థాల శుద్ధి, విసర్జన వ్యవస్థ, ఉమ్మడి ప్రమాదకర వ్యర్థ పదార్థాల శుద్ధి, విసర్జన సదుపాయం లాంటివి ఎ కాటగరీ కిందకు వచ్చేవి గనక ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.కు పర్యావరణ అనుమతులు ఇచ్చే అధికారపరిధి లేదని ఫిర్యాదుదార్లు వాదించారు.

126. ఈ వాదనతో ప్రతివాదులు తీవ్రంగా విభేదించారు. ఈ కింది కారణాలవల్ల ఆ వాదన తప్పని అన్నారు:

i. పథకం అమలయ్యే 217.23 చ.కి.మీ. పరిధిలో విమానాశ్రయ ప్రతిపాదన ఏదీ లేదు. దీనిని బృహద్ ప్రణాళికలో కూడా చేర్చలేదు. విజయవాడలో ప్రస్తుతం ఉన్న విమానాశ్రయం ప్రస్తుత, సమీప భవిష్యత్తు అవసరాలు తీరుస్తుంది.

ii. పథకం ప్రతిపాదించిన వారికి జాతీయ రహదార్ల అభివృద్ధి చేయదగిన అవకాశం లేదు. బృహద్ ప్రణాళికలో జాతీయ రహదారి ప్రతిపాదన ఏదీ లేదు.

iii. వెల్లడించిన బృహద్ ప్రణాళిక ప్రకారం నగరంలో మూడు పారిశ్రామిక మండలాల ప్రతిపాదన ఉంది. ఈ మూడూ వేర్వేరు చోట్ల ఉంటాయి. ఒక్కొక్కటి 500 హెక్టార్లకు లోపే ఉంటాయి. పారిశ్రామిక మండలంలో ప్రతిపాదనలో ఉన్న పరిశ్రమలు ఏవీ ఇ.ఐ.ఎ. ఉత్తర్వులోని షెడ్యూలులో 'ఎ ' లేదా 'బి ' కాటగరీ కిందకు రావు. ఇ.ఐ.ఎ. ఉత్తర్వులో ఉన్న షరతుల మేరకు 500 హెక్టార్ల లోపు, 'ఎ ' లేదా 'బి ' కాటగరీ కిందకు రాని పారిశ్రామిక వాడలకు అనుమతి అక్కర లేదు.

iv. మూడు పారిశ్రామిక మండలాలు నగరంలోని భిన్నమైన ప్రాంతాలలో ఉన్నందువల్ల దాన్ని పారిశ్రామిక మండలం కింద పరిగణించే వీలు లేదు. వాటిని ఒకే పారిశ్రామిక మండలి కింద పరిగణించే అవకాశం కూడా లేదు. v. ఉత్తర్వు

లోని షరతుల ప్రకారం ఇది కాటగరీ 'బి ' కిందకు వస్తుంది కనక ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. కు అనుమతి మంజూరు చేసే అధికారం ఉంది.

vi. ఎ.ఐ.ఎ. ఉత్తర్వులోని షెడ్యూలు ప్రకారం "జీవ, వైద్య వ్యర్థ పదార్థాల శుద్ధి కేంద్రం" వంటివి 'బి ' కాటగరీ పథకాల కిందకే వస్తాయి.

vii. ఉమ్మడి ప్రమాదకర శుద్ధి, విసర్జన సదుపాయాన్ని పర్యావరణ అనుమతి షరతుల ప్రకారం పథకం ప్రాంతానికి వెలుపల నిర్మిస్తారు కనక జారీ చేసిన బృహద్ ప్రణాళికలో దీన్ని చేర్చలేదు. దీని కోసం ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం విడిగా అనుమతి తీసుకోవడం జరుగుతుంది.

127. విమానాశ్రయం, జాతీయ రహదారి, పారిశ్రామిక మండలి మొదలైనవి కాటగరీ ఎ పథకాల కిందికి వస్తాయి గనక ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.కు అనుమతి మంజూరు చేసే అధికారం లేదు అన్న అంశం మీదే దరఖాస్తుదారు వాదన అంతా ఆధారపడి ఉంది. ఈ ఆలోచనతోనే ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. కు ఎ కాటగరీ పథకాలను అనుమతి మంజూరు చేసే అధికారం లేదన్నది దరఖాస్తుదారు వాదన. దరఖాస్తుదారు పేర్కొన్నట్టుగా ఇందులో ఎ కాటగరీ పథకాలు ఏమీ లేవు. ఉదాహరణకు రాజధాని నగర పరిధిలో విమానాశ్రయ ప్రతిపాదన ఏదీ లేదు. లేదా జాతీయ రహదారిని అభివృద్ధి చేసే ప్రతిపాదన కూడా లేదు. బృహద్ ప్రణాళిక ఈ విషయాన్నే స్పష్టం చేస్తోంది. ఇక పారిశ్రామిక మండలికి సంబంధించినంతవరకు ప్రతిపాదనలో ఉన్న మూడు పారిశ్రామిక ప్రాంతాలు 500 హెక్టార్ల లోపే ఉన్నాయి. 500 హెక్టార్ల లోపు ఉన్న పారిశ్రామిక ప్రాంతాలకు పర్యావరణ అనుమతి అవసరం లేదు. ఇందులో కాటగరీ ఎ లేదా బి పథకాలు ఏవీ లేవు. అదేవిధంగా జీవ, వైద్య వ్యర్థ పదార్థాల సదుపాయం బి కాటగరీ పథకం కిందకు వస్తుంది. ఉమ్మడి ప్రమాదకర వ్యర్థ పదార్థాల శుద్ధి, విసర్జన సదుపాయం ప్రస్తుతానికి పథకం అమలయ్యే ప్రాంతానికి వెలుపల ఉంది. అందువల్ల ఫిర్యాదుదారు వాదిస్తున్నట్టుగా ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. కు అనుమతి మంజూరు చేసే అధికారం లేదన్న వాదనను తిరస్కరిస్తున్నాం.

పర్యావరణ అనుమతి:

128. పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి మంత్రిత్వ శాఖ (ఇక మీదట ఎం.ఒ.ఇ.ఎఫ్.)నిర్దేశించిన నిబంధనల ప్రకారం పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనం చేసే బాధ్యతను బహిరంగ వేలం పద్ధతిలో 30-04-2015న మెసర్స్ టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ (ఇక మీదట "సలహాదారు") కు, నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ కు అప్పగించారు.

129. ఈ సలహాదార్లు ప్రతిపాదిత రాజధాని నగర ప్రాంతంలో 01-05-2015 నుంచి 30-08-2015 వరకు ఇ.ఐ.ఎ. నివేదిక తయారు చేయక ముందు అధ్యయనం నిర్వహించారు. పథకం ప్రాంతంలో ఆధార రేఖ ప్రకారం, 10 కి.మీ. పరిధిలో మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా అధ్యయనం జరిగింది. ఇంతకు ముందే చెప్పినట్టు టి.ఒ.ఆర్. ప్రమాణాల ప్రకారం ఇ.ఐ.ఎ. నివేదిక రూపొందించారు.

130. వాయు నాణ్యత, నీటి నాణ్యత మొదలైన విషయాలపై ఆధార రేఖ ప్రకారం 2015 మే-జూన్ లో అధ్యయనం చేపట్టారు. అది ఆ ప్రాంతంలో మంచి వేసవి కాలం. ఆ సమయంలో దాదాపు వర్షాలు ఉండవు.

131. ఇ.ఐ.ఎ. నివేదికతో పాటు 05-09-2015న అవసరమైన పత్రాలు స్టేట్ ఎక్స్ పర్ట్ అప్రైజల్ కమిటీ (ఇక మీదట "ఎస్.ఇ.ఎ.సి.") కి సమర్పించారు. ఎస్.ఇ.ఎస్.సి. తన 80వ సమావేశంలో ఈ నివేదికను పరిశీలించింది. ఈ సమావేశాలు రెండు రోజుల పాటు అంటే 10-09-2015, 11-09-2015న జరిగాయి. 11-09-2015న జరిగిన సమావేశంలో ఈ పథకాన్ని మదింపు వేశారు. ఈ సమావేశానికి ప్రతివాదికి సంబంధించిన అధికారులు, సలహాదార్లు హాజరయ్యారు. పథకంపై ఎస్.ఇ.ఎ.సి. సమీక్ష మధ్యాహ్నం దాదాపు 2.00 గంటలకు ప్రారంభమై 8 గంటలపాటు కొనసాగింది. 10.00 గంటల దాకా ఈ సమీక్ష జరిగింది. ఎస్.ఇ.ఎ.సి. సభ్యులు ఇదివరకే ఇ.ఐ.ఎ. నివేదికలు, ఇతర పత్రాలను బేరీజు వేసి, ప్రశ్నలతో సిద్ధంగా ఉన్నారు. ప్రతివాదుల ప్రతినిధులను ఈ

ప్రశ్నలు అడిగారు. ప్రతివాదులు తమ వాదన వినిపించిన తర్వాత ఈ ప్రశ్నలు అడిగారు. పథకానికి సంబంధించిన వివిధ అంశాలపై సవివరమైన చర్చలు జరిగిన తర్వాత ఎస్.ఇ.ఎ.సి. కొన్ని వివరణలు అడిగింది. సవరించిన ఇ.ఐ.ఎ. నివేదికను, ఇతర పత్రాలను సమర్పించాలని ప్రతివాదులను కోరారు.

132. ఎస్.ఇ.ఎ.సి. అడిగిన ప్రశ్నల ఆధారంగా ప్రతివాదులు సవరించిన పత్రాలను సిద్ధం చేశారు. దాదాపు రెండు వారాల ఈ సమయంలో ప్రతివాదులు, సలహాదార్లు ఎస్.ఇ.ఎ.సి.ని సంప్రదిస్తూనే ఉన్నారు. ఎస్.ఇ.ఎ.సి. నియమాలకు పూర్తిగా కట్టుబడి ఉండడానికి, ఎస్.ఇ.ఎ.సి.కి సంతృప్తి కలిగే రీతిలో పత్రాలు తయారు చేయడానికి ఈ సంప్రదింపులు జరిపారు.

133. ఆ తర్వాత 25-09-2015న ఎస్.ఇ.ఎ.సి.కి సవరించిన నివేదిక సమర్పించారు. దీనిని 81వ సమావేశంలో 26-09-2015న మందింపు వేశారు. ఎస్.ఇ.ఎ.సి. మదింపు మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభమై 7 గంటలపాటు రాత్రి 9.00 దాకా జరిగింది. వివరంగా చర్చించిన తర్వాత సంతృప్తి చెంది ఎ.ఐ.ఎ. నివేదికను, సమర్పించిన ఇతర పత్రాలను పరిశీలించి ఎస్.ఇ.ఎ.సి. ప్రతిపాదిత అమరావతి రాజధాని నగర పథకానికి అనుమతి మంజూరు చేయవచ్చునని రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా వ్యవస్థ (ఇక మీదట "ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.") కు సిఫార్సు చేసింది. అయితే పర్యావరణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని, ప్రతిపాదిత అభివృద్ధిని సమగ్రంగా, సవివరంగా పరిశీలించిన తర్వాత అనుమతి మంజూరు చేయాలని సిఫార్సు చేసింది.

134. ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. 09-10-2015న జరిపిన సమావేశంలో ఎస్.ఇ.ఎ.సి. సిఫార్సులను ఆమోదించి పర్యావరణ అనుమతి మంజూరు చేసింది. నిలకడగా ఉండే అభివృద్ధికి కట్టుబడిన నియమాలపై ఆధారపడి అంతర్జాతీయ స్థాయి నగరాన్ని అభివృద్ధి చేయడానికి నిబద్ధులమై ఉన్నామని పథకాన్ని ప్రతిపాదించిన వారు/ప్రతివాదులు హామీ ఇచ్చిన తర్వాత పర్యావరణ అనుమతి మంజూరు

చేసిన ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. 90 కన్నా ఎక్కువ షరతులు విధించింది. ఈ షరతుల్లో కొన్ని ఇలా ఉన్నాయి:

1. ఈ పథకాన్ని ప్రతిపాదించిన వారు ఉన్న జలాశయాలను పరిరక్షించాలి. కాలవలకు, ఏర్లకు, వాగులకు రెండు వైపులా 30 మీటర్ల మేర చెట్లు పెంచాలి. కృష్ణా నది సరసన 100 మీటర్లు, ఇతర జలాశయాల సరసన 50 మీటర్ల మేర చెట్లు పెంచాలి.

2. అన్ని రోడ్ల పక్కన వర్షపు నీరు పోవడానికి మురికి నీటి కాలవలకు అదనంగా నీటి శుద్ధికి ఏర్పాట్లు చేయాలి.

3. వర్షపు నీటిని నిలవ చేయడానికి నిర్మాణాలు చేపట్టి, వర్షపు నీటిని నిలవ చేయడాన్ని ప్రోత్సహించాలి.

4. అన్ని జలాశయాలను అనుసంధానం చేసి ఆకుపచ్చ, నీలం నెట్వర్క్ ఏర్పాటు చేసి, చెట్లు పెంచాలి.

5. నడకదార్లు, వీధుల పక్కన ప్రతి కి.మీ.కు కనీసం 125 చెట్లు ఉండేట్టు చూడాలి.

6. రోడ్ల పక్కన గుబురుగా ఉండే మొక్కలు నాటాలి. వాయు కాలుష్యాన్ని తొలగించే ఏర్పాట్లను రోడ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో చేయాలి.

7. ఆవాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు, వ్యాపార ప్రాంతాల పక్కన చుట్టూ వ్యాపించి ఉన్న వాయు నాణ్యత కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వీటి ఫలితాలను సి.పి.సి.బి/ఎస్.పి.సి.బి. తో మొదటి దశలో అనుసంధానించాలి.

8. వాయు నాణ్యతను కాపాడడానికి ప్రతి 25 కి.మీ. మేర శాశ్వత వాయు పరిశీలక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

9. తాత్కాలిక కేంద్రాల దగ్గర సైకిళ్లు వెళ్లడానికి దారి, సైకిళ్ల ద్వారా రోడ్లు దాటడానికి అన్ని బహిరంగ ప్రాంతాలలో, వాణిజ్య, సంస్థల భవనాలలో ఏర్పాటు చేయాలి.

10. ఉన్నత నాణ్యత కలిగిన సత్వర ప్రయాణ సదుపాయాలను, బస్సులకు, సత్వర రవాణా సదుపాయాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

11. బ్యాటరీతో పని చేసే వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. దారి పక్కన బ్యాటరీ చార్జి చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలి.

12. కావాల్సిన ఇంధన వనరుల్లో కనీసం 10 శాతం తరగని ఇంధన వనరులై ఉండాలి.

13. సోలార్  హీటర్లు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని భవనాల పై కప్పుల మీద కనీసం మూడింట ఒక వంతు చోట సోలార్ పానెల్స్ ఏర్పాటు చేయలి.

14. హరిత భవనాలకు ఇంధన సామర్థ్య మార్గదర్శకాలు (ఇంధన పొదుపు చేసే భవనాల నియమావళి), హరిత భవనాల భావనలు (జి.ఆర్.ఐ.హెచ్.ఎ./జి.బిసి/ఎల్.ఇ.ఇ.డి నిబంధనలు రూపొందించాలి.

15. ఈ పథకాలు అమలు చేస్తున్న వారు నగరంలో కార్బన్ ఫుట్ ప్రింట్లు సిద్ధం చేసి కార్బన్ తాటస్థ్యాన్ని నెలకొల్పాలి.

16. ఈ పథకాలు అమలు చేస్తున్న వారు మురికి నీటిని ఒడిసిపట్టి శుద్ధి చేసే ఏర్పాటు చేయాలి. ఇలా శుద్ధి చేసిన నీటిని తాగు నీటి కోసం కాకుండా మొక్కలకు, మరుగుదొడ్లకు, వాహనాలు శుభ్రపరచడానికి, హెచ్.వి.ఎ.సి., అగ్నిప్రమాదాల నుంచి కాపాడడానికి, భవన నిర్మాణ పనులకు, పరిశ్రమల అవసరాలకు వినియోగించుకోవడానికి ప్రత్యేక పైప్ లైన్లు ఏర్పాటు చేయాలి.

17. అన్ని ఆవరణలను వినియోగించుకునే వారు జీవ విచ్ఛిన్న వ్యర్థాలు, జీవ విచ్ఛిన్నానికి అవకాశం లేని వ్యర్థాలు, ప్రమాదకరమైన వ్యర్థాల కోసం మూడు ప్రత్యేక కోశాలు ఏర్పాటు చేయాలి.

18. నగర నిర్మాణ మొదటి దశలోనే ఈ పథకాలు అమలు చేస్తున్న వారు సమీకృత ఘన రూప వ్యర్థాల నిర్వహణ సదుపాయాలను ఏర్పాటు చేయాలి. వీటిలో ఈ వ్యర్థాలను వేరు చేయడానికి/పదార్థాల సేకరణ, పచ్చి ఎరువు తయారీ, నిర్వాత డైజెస్టర్లు, వ్యర్థాల నుంచి ఇంధనం తయారు చేసే కర్మాగారం,

వ్యర్థాలను నాశనం చేసి, శుద్ధి చేసే కేంద్రాలు, జీవ వైద్య సదుపాయాలు, ప్లాస్టిక్ వ్యర్థాల శుద్ధి సదుపాయం, పనిగట్టుకుని భూపూరణ, ప్రభుత్వ భవన సముదాయాలకు తాత్కాలిక ఇ.సి. ఏర్పాటు చేయాలి.

135. అమరావతి రాజధాని నగరానికి 09-10-2015న ఇచ్చిన పర్యావరణ అనుమతిలో విధించిన షరతుకు అనుగుణంగా దీనితో సంబంధం ఉన్న తాత్కాలిక ప్రభుత్వ భవన సముదాయానికి విడిగా పర్యావరణ అనుమతి తీసుకున్నారు. తాత్కాలిక ప్రభుత్వ భవన సముదాయానికి 09-02-2016లో అనుమతి మంజూరు చేశారు. అదేవిధంగా పరస్పర సంబంధం ఉన్న పథకాలకు పథకాలను ప్రతిపాదించిన వారు వచ్చే 35 ఏళ్ల కాలంలో వీటిని చేపట్టినప్పుడు విడిగా ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమతులు తీసుకుంటారు.

పథకం అత్యంత కలుషిత ప్రాంతంలో ఉంది:

136. కేంద్ర పర్యావరణ నియంత్రణా మండలి 2012లో "పరిసరాల్లో ఉన్న వాయు కాలుష్య స్థితి-ధోరణులు" అన్న జాతీయ నివేదిక మీద ఆధారపడి ఈ పథకం "అత్యంత కలుషిత ప్రాంతంలో" ఉంది అని దరఖాస్తుదార్లు వాదించారు. మొట్ట మొదటిది ఈ నివేదిక "పథకం ఉన్న ప్రాంతానికి" సంబంధించింది కాదు. ఈ నివేదిక ఇతర అంశాలతో పాటు విజయవాడ నగరానికి సంబంధించింది. ఈ నివేదికలోని 5.2ఎ పట్టిక ఎన్.ఎ.ఎ.క్యు. ప్రమాణాల ప్రకారం 2012లో కణ రూప ద్రవ్యం (పి.ఎం.) 10 కన్నా ఎక్కువ ఉన్న నగరాలను, పట్టణాలను అవరోహణా క్రమంలో పేర్కొంది. వార్షిక సగటు ఆధారంగా ఈ అంశాన్ని తెలియజేశారు. ఈ నివేదికలో పేర్కొన్న 223 నగరాల్లో అలహాబాద్ పట్టణంలో అత్యధిక కాలుష్యం ఉంది. అది సగటున ఏడాదికి 347 (పి.జి/ఎం3) ఉంది. ఆ తర్వాతి స్థానంలో 317(పి.జి/ఎం3) రాయపూర్, దిల్లీ 291 ((పి.జి/ఎం3) ఉన్నాయి. దరఖాస్తుదారు అభ్యంతరం లేవ దీసిన పరిశీలనా కేంద్రం విజయవాడ నగరంలోని బెంజ్ సర్కిల్ లో ఉంది. బెంజ్ సర్కిల్ జాతీయ రహదారి (ఎన్.హెచ్.16) లో

ఉంది. అది బందర్ రోడ్డు మీద ఉంది. అది స్వర్ణ చతుర్భుజిలో భాగం. అది విజయవాడలోకెల్లా అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం. అదీ గాక ఎన్.హెచ్. 65 కూడా బెంజ్ సర్కిల్ కు సమీపంలోనే ఉంటుంది. ఆ ప్రాంతంలో సేకరించిన సమాచారం ఆధారంగా బెంజ్ సర్కిల్ మొత్తం 223 నగరాలు/పట్టణాల జాబితాలో 212వ స్థానంలో ఉంది. అక్కడ కాలుష్యం 95 (పి.జి/ఎం3) ఉంది. దీన్ని బట్టి కృష్ణా నది ఎడమ గట్టు మీద ఉన్న విజయవాడ నగరంలో కాలుష్యం అతి తక్కువగా ఉన్నట్టు లెక్క. ఏమైనప్పటికీ ప్రతిపాదిత రాజధాని నగరం కృష్ణా నది కుడి గట్టున ఉంది. ఇది విజయవాడకు చాలా దూరం.

137. విజయవాడ నుంచి రెండు రహదార్లు వెళ్లడమే అక్కడ కాలుష్యానికి ప్రధాన కారణం. అయినప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న అంతర్గత వలయ మార్గం నిర్మాణంలోనూ, ఇక ముందు చేపట్టబోయే బాహ్య వలయ రహదారి నిర్మాణంలోనూ ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. నగరంలో ప్రజా రవాణా సదుపాయాన్ని పెంపొందించడానికి మెట్రో రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదన కూడా ఉంది. దీని వల్ల వాయు కాలుష్యం తగ్గుతుంది.

138. అమరావతి నగరానికి సంబంధించినంత వరకు ఎ.ఐ.ఎ. నివేదిక తయారు చేయడానికి 2015 వేసవిలో మౌలిక సమాచారం సేకరించారు. అది వేసవి కాలం అయినందువల్ల పథకం చేపట్టే ప్రాంతంలో గాలిలో, పరిసర ప్రాంతాలలో ధూళి రేణువులు ఎక్కువ ఉంటాయి. ఆ పరిసర ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలు ఎక్కువ. ప్రకృతి సంబంధమైన ఈ కారణం వల్ల కణ రూప ద్రవ్యం ఎక్కువగా నమోదు అయింది. అయినా అది అనుమతించిన పరిమితికి లోబడే ఉంది.

139. రాజధాని నగరాన్ని ఇరుగుపొరుగు ప్రాంతం అన్న భావన ప్రకారం నిర్మిస్తున్నారు. అత్యవసరమైన వ్యవస్థలు 400 మీటర్ల పరిధి లోపల ఉంటాయి. నడిచి పనికి వెళ్లడం అన్న భావన ప్రకారం ఈ నగరం నిర్మిస్తున్నారు. ఈ నగరానికి సమీకృత ప్రజా రవాణా సదుపాయం ఉంటుంది. నడక దారులు, సైకిళ్లు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలు అన్ని రోడ్ల సరసన ఉంటాయి. నగరంలో కేవలం

పరిశుభ్రమైన, కాలుష్య రహితమైన పరిశ్రమలను మాత్రమే అనుమతించాలని ఈ పథకం చేపడ్తున్న వారు ఆలోచిస్తున్నారు. అందువల్ల వాయు నాణ్యతపై ప్రతికూల ప్రభావం ఉండదు.

టి.ఒ.ఆర్. కు కట్టిబడకపోవడం:

140. బృహద్ ప్రణాళిక, 10 కి.మీ. పరిధిలో భూ వినియోగం ఆధారంగా భూ వినియోగంపై అధ్యయనం చేసి ఆ వివరాలను ఎ.ఐ.ఎ. నివేదికలో జత చేశారు. పథకం అమలయ్యే ప్రాంతంలో భూ వినియోగం అంశాన్ని "పథకం అమలయ్యే ప్రాంతం" నివేదికలోనూ, పరిసరాల్లో 10 కి.మీ. పరిధిలో భూవినియోగాన్ని "అధ్యయన ప్రాంతం" నివేదికలో చేర్చారు. ఎ.ఐ.ఎ. నివేదికలో కృష్ణా నది వరద ప్రాంత వివరాలు చేర్చారు. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు 2015 నాటి ఒ.ఎ. 171 ప్రకారం ఈ ప్రాంతాలను పునర్నిర్దేశించారు.

141. పథకం అమలయ్యే ప్రాంతంలో భూ వినియోగం గురించి ఎ.ఐ.ఎ. నివేదికలోని 5.12 విభాగంలో సవివరంగా చేర్చారు. అలాగే అధ్యయన ప్రాంతానికి సంబంధించిన భూ వినియోగ వివరాలను కూడా చేర్చారు. 5.12 విభాగం లోని అంశాలను దిగువన పేర్కొంటున్నాం:

"5.12 సుదూర గ్రహణ సాంకేతికత వివిధ సహజ వనరులను, భూవినియోగ అంశాన్ని అంచనా వేయడానికి శక్తిమంతమైన ఉపకరణంగా ఉంది. ఈ విభాగంలో ప్రస్తావించిన భూవినియోగం అన్న మాట భూవినియగాన్ని, భూ భాగాన్ని కూడా వివరిస్తుంది. మూడు ప్రధానమైన వనరుల ఆధారంగా భూవినియోగ అధ్యయనం జరిగింది. అవి:

* సర్వే ఆఫ్ ఇండియా (ఎస్.ఒ.ఐ.) టోపో-షీట్ల సంఖ్య ఇ 44-యు6, యు7, యు11, 1:50,000 స్కేలు మీద:

* డిజిటల్ గ్లోబ్స్ వరల్డ్ వ్యూ-2 ఉపగ్రహ చిత్రం (జియో కోడెడ్ ఫాల్స్ కలర్ కాంపోసిట్ (ఎఫ్.సి.సి.) వరల్డ్ వ్యూ -2 చిత్రం:

* ఎఫ్.సి.సి. చిత్రాలకు నేల మీద వాస్తవ క్రమబద్ధీకరణ".

అంతే గాక పైన పేర్కొన్న అధ్యయన ఫలితాలను నివేదికలోని 5.2 పేరాలో చేర్చారు. అంటే ప్రతివాది టి.ఒ.ఆర్. కు అవసరమైన అంశాలకు, టి.ఒ.ఆర్. ప్రమాణాలకు కట్టుబడి ఉన్నారు.

142. 2006 నాటి ఎ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం భావన ప్రణాళిక ఒక ప్రాంత అభివృద్ధి ప్రణాళిక (8 బి పథకాలు) చేపట్టడానికి సరిపోతుంది. 2015 జులైలో వెలువరించిన ఇ.ఐ.ఎ. నివేదికలోని ఉల్లేఖనలు అన్న అధ్యాయంలోని ఒకటవ అంశంలో రాజధాని నగర బృహద్ ప్రణాళిక (భావన ప్రణాళిక)ను ఎ.ఐ.ఎ. అధ్యయనంలో వినియోగించారు.

143. మూడవ షరతు: 2006నాటి ఇ.ఐ.ఎ. ఉత్తర్వు, భవనాల కోసం, ప్రాంత అభివృద్ధి పథకాల కోసం జారీ చేసిన మార్గదర్శక పత్రాల ఆధారంగా ఆధారభూత పర్యావరణ నాణ్యత అధ్యయనాలు చేపట్టారు. ఈ పథకం చేపట్టడంవల్ల పెరిగే కాలుష్యాన్ని కూడా తగు రీతిలో అంచనా వేశారు. పర్యావరణ ప్రభావం ఎలా ఉంటుందో కూడా అంచనా వేశారు. ఇ.ఐ.ఎ. నివేదికలో చేర్చిన అంశాలను, బృహద్ ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని ఈ పని చేశారు. ఈ అధ్యయనాలు టి.ఒ.ఆర్. ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి.

144. అయిదవ షరతు: వాలు, మురికి నీటి పారుదల ధోరణికి సంబంధించిన అధ్యయనాలు నిర్వహించి నిమ్నోన్నతల రేఖ ఆధారంగా రూపొందించిన డిజిటల్ ఔన్నత్య నమూనాకు సంబంధించిన చిత్రం 4.9 ని ఇ.ఐ.ఎ. నివేదికలో చేర్చారు. ఈ అధ్యయనాల ఆధారంగా నీరు నిలవ ఉంచే కుంటలు, జలాశయాలను చూపడమే కాక అవి ఎక్కడ ఉన్నాయో ఇ.ఐ.ఎ. నివేదికలో చేర్చారు.

145. ఆరవ షరతు: పథకం చేపట్టబోయే ప్రాంతంలో చెట్లు అంతగా లేవని, ఆ మాటకొస్తే లేనట్టేనని ఇ.ఐ.ఎ. నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదికలో ఎక్కడన్నా చెట్లు నరికితే మొక్కలు నాటడమో లేదా పెకలించిన చెట్లను మరో చోట నాటడమో (ఫార్మ్ 1ఎ లోని 3.2 విభాగం) జరగాలని ఇ.ఐ.ఎ. నివేదికలో తెలియజేశారు. అటవీ ప్రాంతాలు ఉన్న చోట్ల అనుమతులు తీసుకోవాలని పర్యావరణ

అనుమతులు మంజూరు చేసినప్పుడు కూడా స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన ఎం.ఓ.ఇ.ఎఫ్. పరిశీలనలో ఉంది.

146. 22వ షరతు: రాజధాని నగరంలో నిర్దిష్టమైన పథకాలను అమలు చేసినప్పుడే వాటికి ఎంత ఖర్చు అవుతుంది, పర్యావరణ ప్రభావం ఎంత ఉంటుందో తెలుస్తుంది. అవసరమైన వాటికి 2006 ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం అనుమతులు తీసుకోవాలి. పరస్పర సంబంధం ఉన్న పథకాలకు అనుమతులు తీసుకోవాలని పర్యావరణ అనుమతిలో నిర్దిష్టమైన షరతు ఉంది. 2006 నాటి ఇ.ఐ.ఎ. ఉత్తర్వు ప్రకారం ఈ అనుమతులు తప్పనిసరి. ఇ.ఐ.ఎ. నివేదికలో ఇ.ఎం.పి. ని అమలు చేయడానికి ఎంత ఖర్చు అవుతుందో పర్యావరణ విభాగం ఖర్చు, పర్యావరణ నిర్వహణ నిబద్ధతలు లోని 8-9 విభాగాలలో పేర్కొన్నారు. ఇందులో మూలధన పెట్టుబడి, పునరావృతం అయ్యే ఖర్చులు కూడా రాజధాని నగర పర్యావరణ కార్యక్రమంలో ఉంటాయి.

147. ఎస్.ఇ.ఎ.సి.కి 26-09-2015న సమర్పించిన ఇ.ఐ.ఎ. లో నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రతి ఏటా రూ. 29.35 లక్షలు ఖర్చు అవుతుందని, నిర్వహిస్తున్న సమయంలో ఏడాదికి రూ. 52.15 లక్షలు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఇది ఒక్కో పథకానికి ఇ.ఎం.పి. ఖర్చులకు అదనం.

148. 2014 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ వల్ల రాజధాని నగర నిర్మాణం అవసరమైంది. పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 94 (3) ప్రకారం కేంద్ర ప్రభుత్వం అత్యవసరమైన సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయవలసి ఉంది. సెక్షన్ 94 (3)లో ఇలా ఉంది: 94 (3) - కొత్త రాజధానిలో అత్యవసర సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. రాజ్ భవన్, హైకోర్టు, ప్రభుత్వ సచివాలయం, శాసనసభ, శాసన మండలి లాంటి మౌలిక సదుపాయాలకోసం ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

149. అమరావతి రాజధాని నగర పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది. ఈ పథకం కోసం ఆ ప్రభుత్వం కావాల్సిన నిధులను బడ్జెట్ లో కేటాయిస్తుంది. కేంద్ర,

రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో దీని కోసం ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తుంది.

150. ఈ పథకం చేపడుతున్న ప్రాంతంలో ఏ ప్రాంతాన్నీ జీవావరణానికి నష్టం కలిగించే ప్రాంతంగా ప్రకటించలేదు. అందువల్ల దరఖాస్తుదారు లేవనెత్తిన అభ్యంతరాలు వాస్తవాల దృష్ట్యా అస్పష్టమైనవి, నిరాధారమైనవి. స్థలాకృతి, పర్యావరణం, జీవావరణం మొదలైనవాటిని దృష్టిలో ఉంచుకుని ఇ.ఐ.ఎ. అధ్యయనాలు చేపట్టారు. ఈ విషయాన్ని ఇ.ఐ.ఎ. నివేదికలో కూడా పేర్కొన్నారు. బృహద్ ప్రణాళికను రూపొందించే సమయంలో కూడా ఈ అంశాలను దృష్టిలో ఉంచుకున్నారు.

151. ఈ పథకం వల్ల వ్యవసాయం, సామాజిక-ఆర్థిక అంశాల మీద ప్రభావం ఎలా ఉంటుందో అధ్యయనం చేయలేదు. ఈ అధ్యయనం చేసి ఫలితాలను ఇ.ఐ.ఎ. నివేదికలోని 5.12.4, 5.13 అధ్యాయాల్లో చేర్చారు.

152. ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. ఏర్పాటు - ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. ను ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారు. అంతేగాక ఎస్.ఇ.ఐ.ఎ.ఎ. సభ్యుల నియామకాన్ని, అర్హతలను ఇంతవరకు ఎవరూ సవాలు చేయలేదు. ఇప్పుడు ట్రిబ్యునల్ మనసులో దురుద్దేశం కలగజేయడానికి ఈ అంశాన్ని లేవనెత్తుతున్నారు.

153. ఈ పిటిషన్ పై విచారణ జరుగుతున్న క్రమంలో ఇతర అంశాలను ప్రతివాదులు నోట్ 1, నోట్ 2 లో ప్రస్తావించి ట్రిబ్యునల్ కు అందజేశారు. దరఖాస్తుదార్లు 2015 నాటి ఒ.ఎ. నెం. 171లో, 2015 నాటి అప్పీలు నెం. 148 లో లేవనెత్తిన అంశానికి పేరాల వారీగా ప్రతివాదులు సమాధానాలు చెప్పారు. ఈ మేరకు ప్రతి ప్రమాణపత్రం, సమాధానాలు, అదనపు ప్రమాణపత్రాలు సమర్పించారు.

154. పైన పేర్కొన్న వివరాలనుబట్టి చూస్తే ఇ.ఐ.ఎ. నివేదిక రూపిందించేటప్పుడు టి.ఒ.ఆర్. నేపథ్యంలో కూలంకషమైన అధ్యయనం చేశారు. బృహద్ ప్రణాళిక,

పథకం అమలయ్యే ప్రాంతానికి 10 కి.మీ. పరిధిలో భూ వినియోగానికి సంబంధించి అధ్యయనం జరిగింది. పథకం అమలయ్యే ప్రాతంలో భూ వినియోగాన్ని పథకం అమలయ్యే ప్రాంతంగా, 10 కి.మీ. పరిధిలోని భాగాన్ని అధ్యయన ప్రాంతంగా పేర్కొన్నారు. కృష్ణా నది వరద ప్రాంతాన్ని, పునర్నిర్దేశ అంశాన్ని కూడా ఇ.ఐ.ఎ. నివేదికలో చేర్చారు. అలాగే మూలాధార పర్యావరణ నాణ్యత అధ్యయనాలను 2006 నాటి ఇ.ఐ.ఎ. ఉత్తర్వుకు అనుగుణంగా నిర్వహించారు. ప్రతిపాదిత పథకం కారణంగా పెరగనున్న కాలుష్యాని కూడా అంచనా వేసి నివేదికలో చేర్చారు. వాలు, మురికి నీటి పారుదల, నీరు నిలవ చేసే కుంటలు, జలాశయాల మీద కూడా అధ్యయనం జరిపి ఇ.ఐ.ఎ. నివేదికలో చేర్చారు. ప్రస్తుతం చెట్లు ఏ మేర ఉన్నాయి, ఎక్కడెక్కడ చెట్లను తొలగించాలి, తొలగించిన వాటి స్థానంలో మొక్కలు నాటడం, లేదా తొలగించిన చెట్లను మరో చోట నాటడం వంటి వాటి విషయం లో ఇ.ఐ.ఎ. నివేదికలో పేర్కొన్నారు. అటవీ ప్రాంతాలు ఉంటే వాటి కోసం నిర్దేశించిన పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. 2014 చట్టం ప్రకారం నిర్మాణ దశలోనూ, నిర్వహణ దశలోనూ పర్యావరణ పరిశీలనకు ఎంత ఖర్చు అవుతుందో కూడా ఇ.ఐ.ఎ. నివేదికలో పేర్కొన్నారు. అత్యవసర సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలి. ఈ పథకాన్ని సత్వరం అమలు చేయాలి కనక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీని కోసం బడ్జెట్ లో నిధులు కేటాయిస్తుంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అదనంగా నిధులు సమీకరిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే టి.ఒ.ఆర్. నియమాలకు కట్టుబడినట్టు రుజువు అవుతోంది. అందువల్ల దీనికి కట్టుబడలేదని దరఖాస్తుదారు లేవనెత్తిన అంశాన్ని కారణం ఏదైనా అంగీకరించడానికి వీలు లేదు.

అడ్డు కట్ట మార్పు:

155. దరఖాస్తుదారు/ఫిర్యాదుదార్లు లేవనెత్తిన మరో అంశం ప్రతివాదులు కృష్ణా నది అడ్డుకట్టను మార్చాలని ఆలోచిస్తున్నారని, దీనివల్ల నది వరద

మైదానాన్ని/భూతలాన్ని ఆక్రమించినట్టు అవుతందని. ప్రతివాదులు ఈ వాదనను నిరాకరించారు. రాజధాని నగరంలో అడ్డుకట్టల సవివరమైన చరిత్రను, వాటి వెనక ఉన్న ప్రయోజనాన్ని కూడా ప్రతివాదులు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నీటిపారుదల, సి.ఎ.డి. విభాగంలోని కృష్ణ కేంద్ర డివిజన్ నదీ సం రక్షకుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు "2012-13 సంవత్సరానికి కృష్ణ, గుంటూరు జిల్లాల వరద ఆగంతుక ప్రణాళిక" విడుదల చేశారు. ఇందులో కృష్ణా నదికి అడ్డుకట్టలను 1853 కన్నా ముందు నిర్మించారని, ఆ తర్వాత అవసరాన్ని బట్టి విస్తరించి, మార్చి, బలోపేతం చేశారని తెలియజేశారు.

ఈ నివేదికలో కృష్ణా నదికి వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాల జాబితా కూడా ఇచ్చారు. ఈ గ్రామాలను ప్రకాశం బారేజీకి ప్రవాహానికి ఎదురుగా ఉన్న గ్రామాలు, ప్రవాహానికి దిగువన ఉన్న గ్రామాల పేర్లు కూడా ఇచ్చారు. అడ్డుకట్టకు లోపల, వెలుపల ఉన్న గ్రామాల జాబితా కూడా ఇచ్చారు. ప్రకాశం బారేజీ లో ఏ మట్టానికి నీరు చేరితే (ఎం.ఎఫ్.ఎల్.) ఏయే గ్రామాలు ముంపునకు గురవుతాయో కూడా తెలియజేశారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు అనుసరించవలసిన ప్రమాణాల ప్రకారం వరద హెచ్చరికలు చేయడానికి, ప్రజలను ఖాళీ చేయించడానికి తోడ్పడడానికి ఈ జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితాలో పేర్కొన్న ఒక్క గ్రామం కూడా రాజధాని నగర ప్రాంతంలో లేదు.

ప్రజా విశ్వాస సిద్ధాంతం:

156. దరఖాస్తుదారు న్యాయవాది లేవనెత్తిన మరో అంశం ప్రజా విశ్వాస సిద్ధాంతానికి సంబంధించింది. ప్రభుత్వం సహజ వనరులన్నింటినీ పరిరక్షించే ధర్మ కర్త లాంటిదని, ఈ వనరులను ప్రజలు వినియోగించడానికి, అనుభవించడానికి వినియోగించాలని దరఖాస్తుదారు పేర్కొన్నారు. ప్రవహించే నీరు, గాలి, అడవులు, జీవావరణాన్ని, సున్నితమైన నేలలను విస్తృత ప్రజానీకం వినియోగించుకుంటుంది. ప్రజలు వినియోగించుకునే సహజ వనరులను పరిరక్షించవలసిన బాధ్యత చట్ట ప్రకారం ప్రభుత్వానిది. ఈ వనరులను ప్రైవేటుపరం

చేయడానికి వీలు లేదు. ప్రస్తుత కేసుకు సంబంధించి వాస్తవాలను ప్రస్తావిస్తూ దరఖాస్తుదారు తరఫు విజ్ఞులైన న్యాయవాది కృష్ణా నది, పారే నీరు, దీవుల్లోని లంక భూములు మొదలైనవాటికి సంబంధించిన అంశాలను ట్రిబ్యునల్ దృష్టికి తీసుకొచ్చారు. రాజధాని నగర నిర్మాణంలో అభివృద్ధి కార్యక్రమాలను కూడా ట్రిబ్యునల్ దృష్టికి తీసుకొచ్చారు.

ఇంగ్లీషువారి చట్టం ప్రకారం ఉన్న ప్రజా విశ్వాస సిద్ధాంతం మన పర్యావరణ న్యాయ నిర్ణయంలో భాగమై పోయింది. సమానత్వం ఆధారంగా ఈ సిద్ధాంతం పరిణామం చెందింది. మరో రకంగా చెప్పాలంటే వనరుల పంపిణీ న్యాయంగా, ఏకపక్షం కాకుండా, రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సాగాలి. ఈ వనరుల పంపిణీ వివక్ష లేని పద్ధతిలో, వీటిని ఎవరికైనా బదలాయిస్తే అది రాజ్యం, ప్రజా ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉండేట్టు చూడవలసిన బాధ్యత రాజ్యవ్యవస్థదే. వీటిని వాణిజ్య ప్రయోజనాల కోసం ఇతరులకు అప్పగించడం, బదలాయింపు దాపరికం లేకుండా, కేవలం ప్రజా సంక్షేమం కోసమే అయి ఉండేట్టు చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇంగ్లీషు చట్టం ప్రకారం ప్రజా విశ్వాస సిద్ధాంతం నౌకాయాన, వాణిజ్యం, చేపలు పట్టడానికే పరిమితం అయింది అయినా అమెరికా న్యాయస్థానాలు దీనిని జీవావరణ దృష్టితో ముఖ్యమైన అన్ని భూములకు వర్తింప చేసింది. ఉదాహరణకు మంచి నీరు, మాగాణి భూములు, లేదా రెండు మూడు రాష్ట్రాల మధ్య ఉండే అడవులు ఈ పరిధిలోకి వస్తాయి. ఈ భావనలు ప్రస్తుతం భారత న్యాయ సంబంధ ఆలోచనల్లో భాగం అయినాయి. ఈ విషయంలో వెల్లూరు పౌరుల సంక్షేమ వేదికకు భారత యూనియన్ కు మధ్య (1996) 5 ఎస్.సి.సి. 647, పర్యావరణ-న్యాయ చర్య మండలికి భారత యూనియన్ కు మధ్య కేసు, ఎ.ఐ.ఆర్ 1998 ఎస్.సి.డబ్ల్యు 3861 సందర్భంగా న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను పేర్కొనవచ్చు. ఎం.సి. మెహతాకు కమల్ నాథ్ కు (1997) 1 ఎస్.సి.సి. 388, టి.ఎన్. గొడవర్మన్ తిరుముల్క్ పద్ కు భారత యూనియన్ కు, జె.టి 1997 (10) 697, ఎం.సి.

మెహతా (బద్కల్, సూరజ్కుండ్ ఉదంతం) కు భారత యూనియన్ కు (1997) 3 ఎస్.సి.సి. 715 వంటి ఉదాహరణలు కూడా ఉన్నాయి.

ప్రసుత కేసు విషయానికి వస్తే సహజవనరులను న్యాయమైన, ఏకపక్షం కాని రీతిలో విస్తృత ప్రజానీక సంక్షేమం కోసం పంపిణీ చేస్తున్నారు. భూముల పంపిణీ, లంక భూముల అభివృద్ధి, సహజవనరైన నీటి నియంత్రణ మొదలైనవి సదుద్దేశంతో ప్రజా సంక్షేమం కోసం, ప్రజల ప్రయోజనాలకోసం అమలు చేస్తున్నారు. కాని కొన్ని సందర్భాలలో సహజ వనరులను ఆక్రమిస్తున్నట్టు కనిపించవచ్చు. పైగా ప్రస్తుత సందర్భంలో ప్రభుత్వ వనరులను వాణిజ్య/ప్రైవేటు ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా రాజధాని నగర నిర్మాణ పథకం కోసం, విస్తృత ప్రజా ప్రయోజనాల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. అందువల్ల ప్రస్తుత సందర్భంలో ప్రజా ప్రయోజన సిద్ధాంతం వర్తించదని మా నిశ్చితాభిప్రాయం.

సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

157. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే డబ్ల్యు.పి.(సివిల్) 2016 నాటి నెం. 632 కింద పర్యావరణం, ఉపాధి అవకాశాలు పోతాయని వివిధ కారణాలు చూపుతూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంలో దరఖాస్తుదారు/ఫిర్యాదిదారు తరఫు న్యాయ వాది మూడవ పిటిషనర్ గా ఉన్నారు. గౌరవనీయ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లోని సారాంశం ఇలా ఉంది:

"పిటిషనర్లు దాఖలు చేసిన ఈ రిట్ లో గౌరవనీయమైన న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని, దీని కోసం రిట్ ఆఫ్ మాండమస్ కానీ లేదా మరో సముచితమైన రిట్ ను ఈ కింది అంశాలను కాపాడడానికి జారీ చేయాలని కోరారు:

* 15 లక్షల ఎకరాల సారవంతమైన భూములు
* శ్రామికుల జీవనోపాధి వ్యవసాయం మీద ఆధారపడి ఉంది
* ఆహార భద్రత

* వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం ఇమిడి ఉంది
* పర్యావరణం, జీవావరణం, వరద మైదానాలు
* న్యాయమార్గ పాలన, నల్ల ధనం చెలామణిలో ఉండడం
* కృష్ణా నది సంరక్షణ
* కృష్ణా హరివాణంలో వేలాది గ్రామాలను, పట్టణాలను సం రక్షించడం

2014 నాటి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం (సంక్షిప్తంగా పునర్వ్యవస్థీకరణ చట్టం) ప్రకారం పునర్విభజన జరిగిన తర్వాత మిగిలిన ఆంధ్రప్రదేశ్ కు రాజధాని కోసం హరిత నగరాన్ని నిర్మించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గొప్ప పథకం ప్రారంభించింది. కాని ప్రస్తుత ప్రతిపాదన పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలకు, కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులకు విరుద్ధమైంది. "పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94(3) ప్రకారం ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని కోసం, రాజ్ భవన్, హైకోర్టు, ప్రభుత్వ సచివాలయం, శాసనసభ, శాసన మండలి అలాంటి అత్యవసర మౌలిక సదుపాయాల కోసం కేంద్రం ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక ఆర్థిక సహాయం చేస్తుంది."

కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హరిత రాజధాని నగరాన్ని అంటే అమరావతి నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ అత్యాశతో కూడిన ప్రణాళిక ప్రకటించింది. దీని కోసం లక్షా 20 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. వచ్చే అయిదేళ్ల కాలంలో రాజధాని నగరం కోసం రూ. 42,935 కోట్లు ఖర్చు పెట్టాలని ప్రతిపాదించింది.

217 చ.కి.మీ. విస్తీర్ణంలో రాజధాని నగరాన్ని, 8420 చ.కి.మీ. పరిధిలో రాజధాని నగర ప్రాంతాన్ని నిర్మించాలని తలపెట్టింది. ఇది డిల్లీ కన్న పెద్ద ప్రాంతం. ప్రతిపాదిత రాజధాని ప్రాంతం సిక్కిం, గోవా రాష్ట్రాలకన్నా పెద్దది అవుతుంది. రాజధాని ప్రాంతంగా ప్రతిపాదించిన ప్రాంతం చాలా సారవంతమైంది. ఏడాదికి మూడు, నాలుగు పంటలు కూడా పండుతాయి. శాసనసభ, హైకోర్టు, రాజ్ భవన్, సచివాలయం వంటి వాటికి 900 ఎకరాలు కేటాయించారు. అక్కడ జోరుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 45 ఎకరాల స్థలంలో కాంట్రాక్టర్లకు ఎక్కువ

మొత్తంలో డబ్బు చెల్లించి తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారు. రెండు కాంట్రాక్టు సంస్థలకు చదరపు అడుగుకు నిర్మాణం కోసం రూ. 3350 చెల్లిస్తున్నారు. ఇది నిర్మాణ వ్యయానికి రెట్టింపుకన్నా ఎక్కువ. దీన్ని బట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని, హడావుడిగా నిర్ణయాలు తీసుకుంటోందని, ఇది అనుమానాలకు దారి తీస్తోందని, భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అనిపిస్తోంది."

158. ఈ పిటిషన్ లోని మొదటి పేరాలో ఇలా పేర్కొన్నారు:

"1. ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడానికి కారణాలు ఈ అంశాలను పరిరక్షించడానికి; i) 15 లక్షల ఎకరాల సారవంతమైన భూములు, ii) వ్యవసాయం మీద ఆధారపడ్డ శ్రామికుల జీవనోపాధి, iii) ఆహార భద్రత, వేలాది కోట్ల ప్రజా ధనం, iv) పర్యావరణం, జీవావరణం, మైదాన ప్రాంతాలు, v) న్యాయమార్గ పాలన, vi) కృష్ణా నది పరిరక్షణ, vii) కృష్ణా నది పరివాణంలో అనేక గ్రామాలను, పట్టణాలను ముంపు నుంచి కాపాడడం, viii) ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం ఖర్చు పెట్టే భారీ మొత్తాన్ని కాపాడడం, ix) రోజు కూలీల, కౌలు రైతుల, అసైండ్ భూములున్న వారి, సాంప్రదాయికంగా వ్యవసాయం చేస్తున్న రైతుల ప్రాథమిక హక్కులను పరిరక్షించడం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం  అనుసరిస్తున్న అశాస్త్రీయ విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతానికి 8240 చ.కి.మీ. కేటాయించారు. దీని వల్ల ఏడాదికి అనేక పంటలు పండే దాదాపు 20 లక్షల ఎకరాల సారవంతమైన సేద్య భూమికి, "దేశ అన్నపూర్ణ"కు నష్టం కలుగుతుంది, x) రెండవ నివేదికను, మూడవ నివేదికను మార్చినందువల్ల భారీ స్థాయిలో అవినీతి, బంధుప్రీతి, నల్ల ధన చెలామణికి, కృష్ణా నది ప్రాంతంలో జీవావరణ వ్యవస్థ వినాశనానికి దారి తీస్తుంది."

159. ఈ రిట్ పిటిషన్ లో ఈ కింది చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు:

సి. కీలకమైన జీవావరణ మండలానికి కలిగే నష్టం గురించి అంచనా వేసి సాధ్యమైతే ప్రత్యామ్నాయ మార్గం సూచించడానికి పదవీ విరమణ చేసిన

న్యాయమూర్తి అధ్యక్షతన పట్టణ ప్రణాళిక, పర్యావరణం, సామాజిక, వ్యవసాయ, ఆర్థిక రంగాలలో నిపుణులతో కూడిన నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ 1, 2, 5, 6 ప్రతివాదులకు రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయాలి. లేదా;

డి. గౌరవనీయమైన న్యాయస్థానం నియమించే కమిటీ అనుమతి లేకుండా సారవంతమైన వ్యవసాయ భూములలో కాంట్రాక్టులు ఇవ్వకుండా 2. 3 ప్రతివాదులను ఆదేశించాలి. లేదా;

ఇ. రాజధాని ప్రాంతంలో ఉపాధి కోల్పోయిన రైతులకు, వ్యవసాయ కార్మికులకు, చేతివృత్తుల వారికి పరిహారం చెల్లించాలని ప్రతివాదులు 2, 3 ను ఆదేశించాలి. లేదా"

160. మంచి చెడ్డలను వివేచించి గౌరవనీయమైన సుప్రీంకోర్టు 12-08-2016న ఈ పిటిషన్ ను తోసిపుచ్చింది. ఆ ఉత్తర్వు ఇలా ఉంది: "గౌరవనీయమైన సుప్రీం కోర్టు రిట్ పిటిషన్ (స్లు) (సివిల్) నెం. 632/2016 ఉత్తర్వు

తేదీ: 12/08/2016

దీనిని 12-09-2016 న విచారించి ఉటంకించడమైంది.

"విచారించడమైంది.

ఈ రిట్ పిటిషన్ లో ఎలాంటి యోగ్యత లేదు. అందువల్ల తోసిపుచ్చుతున్నాం. అందువల్ల దరఖాస్తులు ఏమైనా ఉంటే వాటినీ తోసిపుచ్చుతున్నాం."

పైన పేర్కొన్న అభ్యర్థనలనుబట్టి, కోరిన పరిష్కారాలనుబట్టి గౌరవనీయమైన సుప్రీంకోర్టు ఎదుట దాఖలు చేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాంలో ఉన్న సమాచారం కూడా ప్రస్తుత కేసులో ఉన్నలాంటిదే. ఈ రెండు కేసులు దాఖలు చేసింది ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన ఒకే పక్షానికి చెందిన వారే. ఈ దరఖాస్తుదారు న్యాయవాదే ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన వారిలో మూడవ వ్యక్తే. ఈ రిట్ పిటిషన్ మంచి చెడ్డలను ఆలోచించి గౌరవనీయమైన సుప్రీం కోర్టు తోసిపుచ్చుతోంది. అందువల్ల అప్రత్యక్ష ప్రతిబంధక న్యాయోత్తరం ఈ కేసులో వర్తిస్తుంది కనక ఆ కారణం చేత ఫిర్యాదుదారు/దరఖాస్తు దారు ట్రిబ్యునల్

నుంచి కోరిన పరిష్కారానికి అర్హులు కారు. అందువల్ల వారి ఫిర్యాదు/దరఖాస్తు తిరస్కరించదగిందే.

నిరూపిత సత్య సిద్ధాంతం:

161. ప్రస్తుత కేసులో 01-03-2014 న ప్రచురించిన 2014 చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విభజించారు. తెలంగాణ అనే కొత్త రాష్ట్రం 02-06-2014న అవతరించింది. దీనికి తోడు హైదరాబాద్ పరిమితకాలమైన పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ కు కొత్త రాజధాని ఏర్పాటు చేయడం కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని చట్టంలో పేర్కొన్నారు. ఆ కమిటీని 2014 మార్చిలో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రాజధానికి కొన్ని ప్రత్యామ్నాయాలు సూచిస్తూ 28-08-2014న నివేదిక సమర్పించింది. తత్ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 30-12-2014న ఆంధ్రప్రదేశ్ కు కొత్త రాజధానికి తగిన చోటు ఎంపిక చేయడానికి ఉత్తర్వు జారీ చేసింది.

కొత్త రాజధాని తక్షణావసరం కనక ఈ విషయంలో తదుపరి చర్యలు వెంటనే తీసుకున్నారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా పదేళ్లపాటే ఉంటుంది కనక ఆంధ్రప్రదేశ్ భూసమీకరణ నిబంధనలు, 2015 లాంటి అనేక ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్న తర్వాతే పిటిషనర్/దరఖాస్తుదారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పై చర్యలను సవాలు చేయాలని అనుకున్నారు. వీరు మొదట పొరపాటుగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు.

ఈ లోగా కొత్త రాజధాని నగర నిర్మాణం కోసం అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా చట్టంలో నిర్దేశించినట్టుగా అనేక సంస్థలను ఏర్పాటు చేశారు. 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 5వ సెక్షన్ ప్రకారం పదేళ్ల తర్వాత హైదరాబాద్ కేవలం తెలంగాణ రాష్ట్రానికే రాజధానిగా ఉంటుంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధాని ఏర్పాటు చేయాలి. ఈ

పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరితంగా రాజధాని నగరం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాల్సి వచ్చింది.

రాజధాని నగరాన్ని తొమ్మిది ఇతివృత్త నగరాలుగా విభజించారు. అవి: ప్రభుత్వ నగరం, న్యాయ నగరం, ఆర్థిక నగరం, విజ్ఞాన నగరం, ఆరోగ్య నగరం, క్రీడా నగరం, పర్యాటక నగరం, మీడియా నగరం, ఎలక్ట్రానిక్ నగరం. దీనికి తోడు రాజధాని నగరాన్ని నివాస, వాణిజ్య, హరిత, రక్షిత, పారిశ్రామిక నగరాలుగా కూడా విభజించారు. వీటికి తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అనుకున్నారు. రోడ్లు, రవాణా సదుపాయాలు, మీడియా వ్యవస్థ, విద్యుత్ సరఫరా, మురికినీటి మార్గాలు, గ్యాస్ పైప్ లైన్లు, పార్కులు, హరిత ప్రాంతాలు, వ్యర్థ పదార్థాలను నిర్వహించే సదుపాయాలు మొదలైన వాటిని ఏర్పాటు చేయవలసిన బాధ్యత ఈ పథకాన్ని ప్రతిపాదించిన వారిదే. అందువల్ల నగరం లోని ఆయా మండలాలు అభివృద్ధికి సిద్ధంగా ఉన్నాయి.

కొత్త రాజధాని అత్యవసరం అయినందువల్ల 09-10-2015 నాడు మంజూరు చేసిన పర్యావరణ అనుమతి ప్రకారం ప్రభుత్వ తాత్కాలిక భవన సముదాయాలు కూడా రాజధానితో సంబంధం ఉన్నవే కనక వాటికి 09-02-2016న అనుమతి మంజూరు చేశారు. అదే విధంగా ప్రాధాన్యాన్నిబట్టి ఇతర పథకాలను కూడా చేపట్టారు. ఉదాహరణకు ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక వ్యవస్థలు, ఆసుపత్రులు మొదలైనవి. ఈ పథకాన్ని ప్రతిపాదించిన వారు అంతస్సంబంధం ఉన్న పథకాలకు ఎప్పటికప్పుడు పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. దీని ఫలితంగా ఈ మధ్యకాలంలో అనేక భవనాల నిర్మాణం ప్రాధాన్యతలనుబట్టి చేపట్టడం జరిగింది. ఈ అన్ని పథకాలకోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించింది. అదీగాక  పంటలు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 128.92 కోట్లు ఖర్చు పెట్టింది. మరుసటి సంవత్సరంలో దీని కోసమే మరో రూ. 141 కోట్లు విడుదల చేశారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం లంక భూముల రైతుల కోసం భారీ మొత్తం ఖర్చు పెట్టాల్సి వచ్చింది. భూసమీకరణ

పథకం కింద స్వచ్ఛందంగా భూములు స్వాధీనం చేసిన వారికి పునరావాసం కల్పించవలసి వచ్చింది.

162. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధాని గడువు పూర్తయ్యే లోగా సత్వరం ఏర్పాటు చేయవలసి వచ్చినందువల్ల, చట్ట ప్రకారం కొత్త రాజధాని నిర్మించవలసి ఉన్నందువల్ల ఈ విషయంలో గణనీయమైన పురోగతి ఉంది. ఇలాంటి పరిస్థితిలో నిరూపిత సత్య సిద్ధాంతం వర్తిస్తుంది. ఈ దశలో ఇప్పటికే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినందువల్ల వాటిని నిర్మూలించాలని ఆదేశించాలంటే కేవలం ఆర్థిక దృష్టితోనే కాక, పర్యావరణ, మానవ మూల్యం కూడా భారీగా చెల్లించవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు న్యాయమైన, సమతుల్యమైన విధానాన్ని అనుసరిస్తూ ఆ పథకంలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి అనుమతిస్తున్నాయి. అయితే పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కఠినమైన రక్షణలు కూడా నిర్దేశిస్తున్నాయి.

స్టెర్లైట్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్ కు యూనియన్ ఆఫ్ ఇండియా (యు.ఒ.ఐ.) ఇంకా ఇతరులకు (2013) 4 ఎస్.సి.సి. 573 కేసులో గౌరవనీయమైన సుప్రీంకోర్టు ఇదే సూత్రాన్ని అవలంబించింది. సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించిన తర్వాత ట్రిబ్యునల్ ఆ పరిశ్రమను ముందు జాగ్రత్త చర్యలు తీసుకోమ్మని, ఈ పరిశ్రమ పని చేయడానికి కాలుష్య నియంత్రణా మండలి మరింత కఠినమైన షరతులు విధించాలని ఆదేశించింది. (మెసర్స్ స్టెరిలైట్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్ కు తమిళనాడు కాలుష్య నియంత్రణా మండలి, 2013 (ఎ.ఎల్.ఎల్ (1) ఎన్.జి.టి రిపోర్టరు (ఢిల్లీ) 368) కేసు.

పై అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త రాజధానికి ఈ దశలో ఆటంకం కలిగించకుండా ఉండడమే న్యాయం, సముచితమన్నది మా నిశ్చితాభిప్రాయం. పైగా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలులోకి వచ్చిన పదేళ్ల లోగా ఈ రాజధాని ఏర్పడవలసి ఉంది. అయితే ట్రిబ్యునల్ నిర్దేశించిన రక్షణలు, ఇ.సి.లో ఉన్న అంశాలను ఆరోగ్యకరమైన వాతావరణం,

విస్తృత ప్రజానీక సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అక్షరాలా అమలు చేస్తేనే న్యాయం లక్ష్యాలు నెరవేరుతాయి.

ముందుజాగ్రత్త సూత్రం:

163. ఈ పిటిషన్ ను తోసిపుచ్చే ముందు ముందుజాగ్రత్త సూత్రం ప్రకారం కొన్ని వ్యాఖ్యలు చేయడం సముచితం అనుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధాని కోసం ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ భవిష్యత్తులో చేయవలసింది ఇంకా చాలా ఉంది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త సూత్రానికి నిబద్ధమై ఉండాలి. రాజధాని నిర్మాణం సుధీర్ఘ కాలం పాటు అమలయ్యే పథకం కనక ప్రస్తుత పరిస్థితిలోనూ, భవిష్యత్తులోనూ ఇది అవసరం. ఈ దశలోనే ఆ చర్యలు తీసుకోవడం అవసరం. ఆ తర్వాత ఈ చర్యలు తీసుకోవడం ఆచరణ సాధ్యం కాక పోవచ్చు కనక చికిత్స కన్నా నివారణ ప్రధానం. ముందుజాగ్రత్త సూత్రం అంతర్జాతీయ స్థాయిలో రూపొందింది. కాని దీన్ని మన దేశంలో చట్ట రీత్యా గుర్తించారు. ఇది 2010 నాటి జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం లోని సెక్షన్ 20 లో భాగంగా ఉంది. ముందు జాగ్రత్త సూత్రం పర్యావరణానికి జరిగే నష్టాన్ని ఎదుర్కోవడానికి సానుకూల పద్ధతి.

తీవ్రమైన పరిణామాలు, దుష్ఫలితాలు వ్యక్తం కాక ముందే ప్రధానమైన పర్యావరణ సమస్యలు తలెత్తకుండా ప్రయత్నం చేయాలి. ప్రస్తుత పథకం పెద్దది, బహుముఖీయమైంది కనక ఈ సూత్రాన్ని మరింత కచ్చితంగా అమలు చేయాలి. ఎందుకంటే పొరపాట్లు, తీసుకునే చర్యలు, తీసుకోని చర్యలు కూడా పథకాన్ని ప్రతిపాదించిన వారికే ఆపాదిస్తారు.

ఈ ప్రయోజనం కోసమే పర్యావరణ అనుమతికి మేము న్యాయమైన, సముచితమైన అదనపు షరతులు విధిస్తున్నాం. వీటిని తర్వాత ప్రస్తావిస్తాం. ఈ కేసులో విశేష అంశాలు ఉన్నందువల్ల ఆ ప్రాంతంలో ఉన్న భూగర్భ జలాల విషయంలో సవివరమైన అధ్యయనం చేసి నీటిని సం రక్షించడానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా మైదాన ప్రాంతాన్ని మార్చే ముందు కూడా

అధ్యయనం చేపట్టాలి. అదే సమయంలో ఈ పథకాన్ని ప్రతిపాదించిన వారికి నది ప్రవాహ దిశనుగాని, సహజమైన వర్షపు నీటి ప్రవాహ దిశనుగాని మార్చే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే భూమి క్రమక్షయానికి గురై భూగర్భ జలం చేరడం మారిపోతుంది. ప్రస్తుతం ఉన్న గట్లను వరద నుంచి రక్షించడానికి తప్ప మార్చ కూడదు. ట్రిబ్యునల్ విధించే షరతులు సమర్ధంగా అమలయ్యేట్టు చూడడానికి సముచితమైన కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ కాలావధి ప్రకారం ఈ షరతులు అమలయ్యేట్టు చూడడమే కాక పర్యావరణ సంరక్షణ చర్యలు సవ్యంగా ఉండేలా చూడడానికి తనిఖీలు కూడా చెపట్టాలి. అన్నింటికీ మించి ఈ కమిటీ ఎప్పటికప్పుడు ట్రిబ్యునల్ కు నివేదికలు సమర్పించాలి.
నిలకడగా కొనసాగే అభివృద్ధి అంటేనే ముందుజాగ్రత్త సూత్రానికి, సమతూక సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి. ఈ విధానమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త రాజధాని నగర ప్రాంతంలో పర్యావరణాన్ని, జీవావరణాన్ని పరిరక్షించగలుగుతుంది. అందువల్ల రాజధాని పథకాన్ని ప్రతిపాదించిన వారు పైన పేర్కొన్న ఆదేశాలను, ఎ.సి. విధించే అదనపు షరతులను పాటించి, భవిష్యత్తులో చేపట్టబోయే పథకాలను నియంత్రించడానికి కమిటీని ఏర్పాటు చేస్తేనే బహుముఖీయమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని నిలకడగా ఉండే అభివృద్ధి సాధించగలుగుతుంది. భవిష్యత్తులో ఎదురయ్యే పర్యావరణ సమస్యలను నివారించడం తప్పని సరి.
జీవావరణ పునరుద్ధరణ:
164. ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర ప్రాంతాలలో జీవావరణను పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవడం కూడా తప్పని సరి. అందుబాటులో ఉన్న సమాచారం, ఇక్కడ పేర్కొన్న అంశాలనుబట్టి రాష్ట్ర ప్రభుత్వం జీవావరణ పునరుద్ధరణకు కావలసిన చర్యలు తీసుకుంటోంది. నష్టం కలిగించే జాతులను తొలగించడానికి, స్థానిక మొక్కలను మళ్లీ పెంచడానికి, కొండకనుమలను పరిరక్షించడానికి తగిన రీతిలో మొక్కలు పెంచడం, నేలను, నీటిని సం రక్షించడానికి తగిన చర్యలు

తీసుకుంటోంది. దీనికి కావలసిన సహాయం అందజేస్తోంది. సహజ వనరుల నిర్వహణకు జీవావరణ పరిరక్షణను పటిష్ఠ పరిచే చర్యలు తీసుకోవాలి.

165. నిలకడగా ఉండే అభివృద్ధికి అనుగుణంగా పథకంలో ఉన్న కారణాలు.

1. ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య సమతూకాన్ని పాటించవలసిన అగత్యం ఉందని ఇక్కడ ప్రస్తావించాలి. 2010 నాటి జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం ఒక ఉత్తర్వును లేదా నిర్ణయాన్ని ప్రకటించేటప్పుడు ట్రిబ్యునల్ నిలకడగా ఉండే అభివృద్ధి అన్న సూత్రానికి కట్టుబడి ఉండాలని నిర్దేశిస్తోంది. నిలకడగా ఉండే అభివృద్ధి అంటే పర్యావరణానికి నష్టం కలిగించని అభివృద్ధే. అంత మాత్రం చేత పర్యావరణంపై ప్రభావం ఉండదని కాదు. అయితే ఈ ప్రభావం భరించదగిందిగా/ సహించదగిందిగా ఉండాలి. భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం లేకుండా చేసే అభివృద్ధి కాకుండా హేతుబద్ధమైన అభివృద్ధి అయి ఉండాలి.

లఫ్రేజ్ ఉమియం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కు భారత్ యూనియన్ కు మధ్య (2017) 7 ఎస్.సి.సి. 338 కేసులో ఈ విధంగా వ్యాఖ్యానించింది:

"75. మానవ జాతి పర్యావరణంలో ఉండే సహజ వనరులపై ఆధారపడడం తప్పదు కనక అది పర్యావరణాన్ని సమూలంగా మార్చకుండా ఉండేది అయి ఉండాలి. దీని ఫలితంగా పర్యావరణానికి సంబంధించిన షరతులు అనివార్యం. పర్యావరణ పరిరక్షణ ఎప్పుడూ తరతమ భేదాలతో కూడి ఉంటుంది. అది తప్పించుకోవడానికి వీలు లేనిది. పర్యావరణ పరిరక్షణ, అందులో ఉండే ముప్పులను సముచిత స్థాయిలో ఉండేట్టు చూడడం తప్పని సరి. "నిలకడగా ఉండే అభివృద్ధి" అన్న భావన ఈ అంశాన్ని గుర్తిస్తుంది. పర్యావరణ అంశానికి అనేక కోణాలు ఉంటాయని, పర్యావరణ పరిరక్షణ నిరంతరం కొనసాగే ప్రక్రియ అని నర్మదా బచావో ఆందోళన్ కు భారత యూనియన్ కు మధ్య కేసులో ఈ కోర్టు ఇచ్చిన తీర్పు ఉంది కనక ఈ అంశంపై వివాదాలకు తావు లేదు. ఈ భావన ప్రకారం అన్ని సందర్భాలకు ఉపకరించే విధానం రూపొందించడం సాధ్యం కాదు.

ఒక్కొక్క సందర్భాన్ని బట్టి మినహాయింపులు ఇవ్వవచ్చునా లేదా, అసలు "చొరబడని అంశాలు" (వీటిని గుర్తించడం వివేకంతో తీసుకోవాల్సిన నిర్ణయమే) ఏమిటో సందర్భాన్ని బట్టి నిర్ణయించవలసిందే. ఇందులో గుణగ్రహణ సూత్రం వర్తిస్తుంది.

76. వీటిని ఎంపిక చేయడంలో నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంటుంది. ఎదురయ్యే ముప్పు ఏమిటి అని తెల్చుకోవడమే కాకుండా పరిరక్షణ ఏ మేరకు ఉండాలో కూడా నిర్ణయించాలి. వనరులను ఇతర ఉపయోగాలకు మళ్లించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలు నెరవేరుతాయో లేదో కూడా తెల్చుకోవాలి. చేపట్టే కార్యక్రమాలనుబట్టి పర్యావరణానికి ముప్పు ఆధారపడి ఉంటుంది. పర్యావరణ హక్కులు, విధులను నిర్ణయించడానికి లక్ష్య సాధనకు సహేతుక కారణాలు, అంతిమంగా ఏ మార్గం అనుసరించాలి, దానికి ఉన్న మార్గాలు ఏమిటి అనే విషయంలో సముచిత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలు నిర్దేశించడానికి విరుద్ధమైన వాదనలను మధ్యవర్తిత్వంతో, మానవ జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని పరిష్కరించవలసి ఉంటుంది."

2. పట్టణాభివృద్ధి, ప్రభుత్వ వ్యవస్థలు మొదలైన రంగాలలో నిపుణులను సంప్రదించి ప్రజా సంక్షేమం, ఆర్థికం, అందుబాటు, పర్యావరణం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుని అమరావతిలో రాజధాని నగరం నిర్మించాలని నిర్ణయించింది. రాజధాని నగరం గుంటూరు, కృష్ణా జిల్లాల సరిహద్దులో 217.23 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఈ పరిధిలో 24 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇది గుంటూరు జిల్లాలోని తాడేపల్లి మునిసిపాలిటీలో భాగం. తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాలు ఇందులో భాగం. ఈ మండలాల జనాభా లక్ష. 27, 000 ఇళ్లు, 84 ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అనేక వాణిజ్య సంస్థలు ఈ రాజధాని నగర ప్రాంతంలో ఉంటాయి. రాజధాని నగర ప్రాంతం రాష్ట్రానికి మధ్యలో ఆంధ్రప్రదేశ్ లోని ఇతర భాగాలకు రాకపోకల సౌకర్యంతో ఉంది. విజయవాడ, గుంటూరు పట్టణ ప్రాంతాలు సరసనే ఉన్నాయి. జలవనరులు,

రవాణా సదుపాయాలు, ప్రాంతీయ అభివృద్ధి మెరుగ్గా ఉన్నాయి. కమిటీ చేసిన సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతంలో రాజధాని నిర్మించకూడదనుకుంది. ఆ నగరాలలో ఉన్న లోపాలను నివారించాలని సంకల్పించింది. విజయవాడ-గుంటూరు, తెనాలి, మంగళగిరి లాంటివి ఇప్పటికే రద్దీగా ఉన్నందున అక్కడ రాజధాని నిర్మించకూడదనుకున్నారు. రాష్ట్ర రాజధాని పథకంలో అభివృద్ధి ప్రణాళికలో మూడు దశలు ఉన్నాయి. మొదటి దశ 2015-2025 మధ్య, రెండవ దశ 2026-35, మూడవ దశ 2036-50 వరకు ఉంటాయి. రాజధాని నగర అభివృద్ధి సహజంగా, క్రమంగా, నిలకడగా ఉండడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు.

3. రాజధాని నగరం నిర్మించాలనుకున్న ప్రాంతం కృష్ణా నది వరదకు గురయ్యే చోట ఉందని కొన్ని పత్రాల ఆధారంగా దరఖాస్తుదార్లు ఆరోపించారు. అయితే ఈ పత్రాలలో పేర్కొన్న ప్రాంతాలు రాజధాని నగర పరిధిలో లేవన్నది వాస్తవం. ఈ పత్రాలలో గుంటూరుకు సంబంధించిన ప్రస్తావన మొత్తం జిల్లాకు సంబంధించిందే తప్ప ప్రతిపాదిత రాజధాని నగరానికి సంబంధించింది కాదు. అంతే గాక రాజధాని నగర ప్రాంతంలో గట్లు ఉన్నందువల్ల కృష్ణా నది నుంచి వరద ముప్పు లేదు. అందువల్ల ఈ నగరం వరద మైదాన ప్రాంతంలో లేదు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ/జాతీయ దూరగ్రహణ కేంద్రం మాజీ డైరెక్టర్ డా. డి.డి. ప్రసాద రావు ఇ.ఐ.ఎ. నివేదికలో పొందుపరచిన పటం భూస్వరూప శాస్త్రం ప్రకారం మామూలుగా తెలియజేసేదే తప్ప ఇది తరచుగా వరదలొచ్చే ప్రాంతంలో లేదని చెప్పారు. నిపుణుల కమిటీ నివేదికలో కూడా ఇదే విషయం చెప్పారు. ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపడితే భూగర్భ జలాల స్వభావం ఏమీ మారిపోదు. ఈ ప్రాంతంలో చేపట్టే అన్ని నిర్మాణాలలో ప్రఖ్యాత ఇంజనీర్ల ప్రమేయం ఉండాలని, వర్షపు నీటిని నిలవ చేసే సదుపాయాలు ఉండాలని దాని వల్ల భూగర్భ జలాలు పెంపొందుతాయని రాజధాని నగరానికి జారీ చేసిన ఇ.సి.లో తెలియజేశారు. నీటిపారుదల శాఖ నీటి ప్రవాహాన్ని అంచనా వేయడంతో పాటు నదిలో నీటి

మట్టాన్ని నమోదు చేసి ఉంచుతుంది. దరఖాస్తుదార్లు వరద ప్రాంతం గురించి అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పుడు ట్రిబ్యునల్ సూచన మేరకు ప్రతివాదులు వరద ప్రాంతాన్ని గుర్తించడానికి కమిటీని నియమించారు. ఈ కమిటీలో డా. వి.వి. శ్రీనివాస్, కె. రవి, డి. కాశీ విశ్వేశ్వర రావు ఉన్నారు. 2009లో వరదలు వచ్చినప్పుడు గట్టు లోపలే వరదను నిరోధించగలిగారని కమిటీ తెలియజేసింది. ఈ వెసులుబాటు ప్రకాశం బారేజీకి ప్రవాహానికి ఎగువన, దిగువన కూడా ఉంది. కొన్ని చోట్ల ఇది 500 మీటర్లకన్నా ఎత్తున కూడా ఉంది. కమిటీ వరదలు ఎంత తరచుగా వస్తున్నాయన్న అంశాన్ని కూడా పరిశీలించింది. కృష్ణా నది వరదలు గట్లను మించవని ఈ పరిశీలనలో తేలింది. అందువల్ల గట్లకు అవతల ఉన్న ప్రాంతం వరద ముంపు ప్రాంతంలో లేదు.

4. ప్రతివాదులు రాజధాని నగరం లేదా చుట్టుపక్కల ఆనకట్టల విషయంలో కూడా జాగ్రత్త తీసుకున్నారు. అన్ని ఆనకట్టలను నిరంతరం తనిఖీ చేస్తారు. మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తారు, పర్యవేక్షిస్తారు. రాజధాని నగరం సురక్షిత ప్రాంతంలో ఉన్నప్పటికీ తీవ్రమైన పరిస్థితులను, ఊహించని సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా నదికి ఎగువన ఏ ఆనకట్ట అయినా తెగిపోయినా ఇబ్బంది లేని రీతిలో కీలక నిర్మాణాలన్నీ అదనంగా 25 అడుగుల ఎత్తున నిర్మిస్తారు. జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సురక్షితమైన శరణు కల్పించడం, నిత్యావసర సరుకులు నిరంతరం అందుబాటులో ఉండేట్టు చూడడం, భద్రత మొదలైన వాటికి దృష్టిలో ఉంచుకునే కీలక నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక వేళ ఈ ఎత్తుకన్నా తక్కువ ఉండే ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టవలసి వస్తే వాటిని ఎత్తయిన వేదికల మీద అంటే స్థంభాల మీద నిర్మిస్తారు. బృహద్ ప్రణాళికలో నిలకడగా ఉండే అభివృద్ధి అన్న అంశాన్ని చేర్చారు. వెయ్యేళ్ల కాలంలో వరదలను దృష్టిలో ఉంచుకుని కాలవల మురుగునీటి పారుదలకు అనువైన డిజైన్లు రూపొందించారు. నీటిని స్టేడియంలు, పార్కులు తీసుకెళ్లే

విధంగా డిజైన్లు సిద్ధం చేశారు. దీనివల్ల కీలక వ్యవస్థలు, నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు నీట మునిగిపోకుండా ఉంటాయి.

5. కొండవీటివాగుకి సంబంధించి... అది వర్షాధార వాగు కాబట్టి ఏడాదిలో చాలా రోజులు ఎండిపోయే ఉంటుందని చెప్పుకోవచ్చు. కేవలం కొద్ది రోజులు మాత్రమే ముంపుకి గురవుతుంది. ఆ కొద్దిరోజుల ముంపుని కూడా అదుపు చేసేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలను రూపొందించింది. అక్కడి భౌగోళిక, నీటి లభ్యతకి సంబంధించిన వివరాలన్నింటినీ సేకరించడమైనది. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వం నియమించిన నిపుణుల సంఘం, వాగుకి వచ్చే వరదని నివారించడమే కాకుండా, అదనపు నీటిని భద్రపరచి రాజధాని అవసరాలకు వినియోగించుకునే ప్రణాళికలను రూపొందించనుంది. ఈ సమస్యకు పరిష్కారంగా అనేక ఉపయుక్తమైన చర్యలను చేపట్టనున్నారు. నీటిని భద్రపరిచేందుకు కుంటలు, జలాశయాలను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇదంతా కూడా ఎస్.ఇ.ఎ.సి., ఎస్.ఇ.ఎ.ఎ.సిలు ఆమోదించిన ఇ.ఐ.ఎ. నివేదికలోని బృహత్ ప్రణాళికలో భాగమే! ఇలా నిర్మించ తలపెట్టిన కుంటలు, జలాశయాలు రాజధాని నగరానికి వెలుపలే ఉండేట్లుగానూ, కొండవీటివాగు ఆయకట్టు నుంచి నీటిని స్వీకరించేట్లుగానూ నమూనాను రూపొందించారు. ఇక అదనపు నీరు కూడా రాజధాని నగరం గుండా కుంటలలోకి చేరతాయి. ఈ జలాశయాలలో భద్రపరచిన నీటిని, రాజధాని అవసరాల కోసం పూర్తిగా వినియోగించిన తర్వాత, నిష్ఫలంగా ఉన్న నీరు సముద్రంలోకి వదులుతారు. అంతేకాకుండా నిష్ఫలంగా ఉన్న నీటిలో కొంత భాగాన్ని తోడి కృష్ణానదిలోకి వదిలేందుకు ఇప్పటికే ప్రాణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.

వాగు ప్రవాహాన్ని అడ్డుకునేలా ఉన్న అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించేలా చర్యలు తీసుకుంటామని ప్రతివాది తరఫు న్యాయవాది హామీ ఇస్తున్నారు. వాగు ప్రవాహాన్ని అడ్డుకునేందుకు పూడికతీతకు కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వాగు పక్కనే ఉన్న పోరంబోకు భూములని కూడా ఆక్రమణల

నుంచి విడిపించి, వాగుకి ఇరువైపులా పచ్చదనాన్ని పెంచేలా తగిన ఏర్పాట్లు తీసుకుంటారు.

6. ఈ ప్రదేశంలో మాగాణి నేలలని కూడా సంరక్షించాలని అభ్యర్థి కోరడమైనది. 2011 మార్చిలో అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో "నేషన్ వెట్ లాండ్స్ అటాస్: ఆంధ్రప్రదేశ్" అనే నివేదికను రూపొందించి ప్రచురించింది. ఆ నివేదికలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తడి నేలలన్నింటినీ గుర్తించడమే కాకుండా తీరప్రాంత తడినేలలుగానూ, సమతల ప్రదేశాలలో ఉన్న తడినేలలుగానూ విభజించారు. రాజధాని నగరం, తీరానికి 60 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది కాబట్టి, అది కోస్తా ప్రాంతం కిందకు రాదు. జిల్లా విస్తీర్ణం 11391 చ.కిలోమీటర్లలో మాగాణి నేలలు 5.94 శాతంగా ఉన్నాయి. వీటిలో తీరప్రాంత మాగాణి నేలలు, సమతల ప్రాంత మాగాణి నేలలు కలిసి ఉన్నాయి. వీటిలో అధికశాతం చెరువులే! జిల్లాలో 1408 మాగాణి నేలలకుగాను 639 మాగాణి నేలలకి సంబంధించిన రేఖాచిత్రాలు గీయడం పూర్తయ్యింది. ఇవే కాకుండా మరో 769 చిన్నపాటి మాగాణి నేలలను కూడా గుర్తించారు. నదులు, చెరువులు కాకుండా సహజసిద్ధమైన ఒకే ఒక్క మాగాణి నేలను కూడా గుర్తించారు. అయితే అది రాజధాని పరిధిలోకి రాదు. బృహత్ ప్రణాళికలో భాగంగా, ఇప్పటివరకూ ఉన్న జలాశయాల పరిధిని 1215 ఎకరాలకు పెంచాలని నిర్ణయించారు. దీంతో మొత్తం జలాశయాల విస్తీర్ణం 1813 ఎకరాలకు చేరుకుంటుంది. ఇది 50.70 శాతం పెరుగుదల. ఇక వాగులనీ, కాలువలనీ పరిగణనలోకి తీసుకుంటే ఈ పెరుగుదల శాతం 197.24 శాతంగా భావించవచ్చు. కొండవీటివాగు సహజమైన పారుదల పునరుద్ధరిస్తారు. దీంతో ఇప్పటివరకూ 6 నుంచి 30 మీటర్లుగా ఉన్న వెడల్పు 30 నుంచి 90 మీటర్ల వరకూ చేరుకుంటుంది. వాగుకి ఇరువైపులా 30 మీటర్ల చొప్పున పచ్చదనాన్ని కూడా పెంచుతారు. దీంతో మొత్తం వాగు ప్రాంతం తటస్థ ప్రాంతం (బఫర్ జోన్)తో కలుపుకొని 336 ఎకరాలు మరియు 627 ఎకరాలకు చేరుకుటుంది.

7. మరో అయిదు కాలువలని కూడా నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వీటి నిర్మాణానికి ఇరువైపులా ఉన్న పచ్చదనాన్ని కూడా కలుపుకొంటే, మరో 1410 ఎకరాలని జలాశయాలుగా మార్చినట్లవుతుంది. రాజధానిలో కొండవీటివాగు, పాలవాగుని పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు సంబంధిత శాఖలైన నీటిపారుదల శాఖ, ప్రణాళిక శాఖ, సి.ఆర్.డి.ఎ.లు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించాలో పరిశీలిస్తున్నాయి. వరదనీరు, వృధా నీరు రెండూ కలవకుండా ఉండేందుకు విడిగా ఓ ఏర్పాటు చేసే యోచన కూడా ఉంది. నగరంలో జలాశయాలలోకి చేరుకున్న వరదనీరంతా ఒకే చోటకి చేరేలా, భూగర్భ జలమట్టాన్ని పెంచేలా తగిన చర్యలు తీసుకుంటారు. అన్ని జలాశయాలకీ తటస్థ ప్రాంతాన్ని కూడా ఏర్పాటు చేస్తారు.

8. లంకదీవులలోనూ, ఇతర భూభాగంలో నివాసం ఉంటున్న ప్రజలకి సంబంధించి దరఖాస్తుదారు ప్రశ్న లేవదీశారు. కృష్ణానది ప్రవాహమార్గంలో కొంత భూమి ముఖ్యమైన భూభాగం నుంచి వేరుపడి దీవులుగా ఏర్పడ్డాయి. నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలతో చాలావరకు దీవులు సంబంధం కలిగిఉన్నాయి. ఈ లంకలలో నివసించే చాలామంది ప్రజలు తమ భూమిని 'భూ సమీకరణ (నోటిఫికేషన్ తేదీ 05.12.2015) కింద స్వాధీనం చేసేందుకు సిద్ధపడ్డారు. సదరు వ్యక్తులకు రాజధానిలోనే పునరావాసాన్నీ, భూమినీ అందించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములని క్రమబద్ధీకరించి, నదుల సంరక్షకుని సూచనల మేరకు, తగిన అనుమతులు పొందిన తర్వాత... ఈ లంక భూములను పరిమితమైన చర్యలకు వినియోగిస్తుంది. అందుచేత, ప్రభుత్వం లంకవాసులకు 'భూ సమీకరణ పథకం' కింద వారి నివాస భూమి, వ్యవసాయ భూములకు పరిహారంగా తగిన భూములను అందిస్తుందని తెలియచేయడమైంది. వారి పునరావాసానికి కూడా తగిన చర్యలు తీసుకుంటారు.

9. పైన పేర్కొన్న వివరాలు, పరిస్థితుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని నిర్మాణంతో పాటు సమగ్రాభివృద్ధికి దోహదపడేందుకు తగిన ముందస్తు

జాగ్రత్తలను, నివారణా చర్యలను చేపడుతోందని అర్థమవుతోంది. పర్యావరణం మీద అతి తక్కువ ప్రభావం పడేలా... రాజధాని అభివృద్ధితో పాటుగా పర్యావరణ రక్షణ కూడా సమతుల్యంగా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటున్నట్లు పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

166. ముంపుకి గురయ్యే ప్రాంతంలో అభివృద్ధి అంతా కేంద్రీకృతం అయిందనీ, అక్కడ చేపట్టే నిర్మాణాల వల్ల జీవావరణ, పర్యావరణాలకు తీవ్రమైన హాని జరుగుతుందనీ... అభ్యర్థి చేస్తున్న అభ్యంతరాన్ని ఈ సందర్భంగా గమనించాలి. మరోవైపు ముంపు ప్రాంతం అని పేర్కొంటున్న ప్రదేశం సామాన్య పరిభాషలో కానీ, న్యాయ పరిభాషలో కానీ అసలు ముంపు ప్రాంతమే కాదన్న విషయాన్ని ప్రతివాదులు గుర్తుచేస్తున్నారు. నదీప్రవాహం వల్ల వరద నీరు ముంచెత్తకుండా ఉండేందుకు కేవలం గట్లు మాత్రమే కడుతున్నట్లు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని కాస్త పరిశీలనగా గమనిస్తే... గట్లని నిర్మించడం, కొన్ని నిర్మాణాల ఎత్తు పెంచడం ద్వారా ప్రజలకు కానీ, ఆస్తులకి కానీ, రాజధాని మొత్తానికి కానీ వరదనీటి వల్ల ఎలాంటి నష్టమూ జరగకుండా మాత్రమే చర్యలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. నిర్ణీత గడువులోగా రాజధానిని నిర్మించేందుకు రాష్ట్రం మీద చట్టపరమైన బాధ్యత ఉంది. పైగా రాష్ట్రంలోని భూభాగంలో వేర్వేరు నదీ తీరాలు ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ ప్రదేశాలను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని తీసుకోవలసి ఉంటుంది. అలా ఎంపిక చేసిన ప్రదేశం సుప్రీం కోర్టు వారి దిల్లీ రాజధాని ప్రాంతాని, ఇంకా ఇతరులకు ఆనంద్ ఆర్య, ఇతరులకు మధ్య ఎ.ఐ.ఆర్. 2016 ఎస్.సి. 2999 కేసు ఆధారంగా అనర్హమైనది కాకుండా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. అదే సమయంలో పర్యావరణ సంబంధ అనుమతులను పొందేందుకు జీవావరణ, పర్యావరణాలను పరిరక్షించేలా నిబంధనలను విధించాల్సి ఉంటుంది. రాష్ట్రం తరఫునా, ప్రణాళికను ప్రతిపాదించేవారి తరఫునా సమగ్రాభివృద్ధికి అనే సూత్రాన్ని బలపరిచేలా మరో వాదన కూడా వినిపిస్తోంది. నూతనంగా నిర్మిస్తున్న

నగరంలో కాలుష్యానికి ఏమాత్రం అవకాశం లేదన్నదే ఆ వాదన. ఈ ప్రణాళికలో భాగంగా పరిశుభ్రమైన గాలికి విఘాతం కలగకుండా విద్యుత్ ఆధారిత బస్సులను ప్రవేశపెట్టనున్నారు, ప్రజారవాణాలో రద్దీని తగ్గించేందుకు జలరవాణాను కూడా ప్రోత్సహించనున్నారు, వస్తువులను పునరుపయోగించేలా (రీసైక్లింగ్, రీయూజ్) తగిన చర్యలు తీసుకుంటూ నగరంలో కర్బన్ శాతం అదుపులో ఉంచే ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు! చెత్తనంతా సేకరించడానికీ, చట్ట వ్యతిరేకంగా నిర్మించే కాలనీలను అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటారు. అలా సేకరించిన చెత్తను పునర్వినియోగించే ఏర్పాటు చేస్తారు.

విద్యుత్తు అవసరాల కోసం పూర్తి సురక్షితమైన మార్గాలను ఎంచుకోవడం జరుగుతుంది. ఇందుకోసం పైకప్పుల మీద సౌర ఫలకలను అమర్చడం ద్వారా సౌర శక్తిని ఉత్పత్తి చేసేలా (ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో) ప్రణాళికలు రూపొందుతున్నాయి. అభివృద్ధిలోని ప్రతి దశలోనూ రాష్ట్ర ప్రభుత్వమూ, ప్రాణాళిక భాగస్వామీ... మురుగునీటిని శుద్ధి చేసేందుకు, చెత్త వేసేందుకు, పొడిచెత్తను విసర్జించేందుకు... ఇతరత్రా ప్రజావసరాలకు కావల్సిన ఏర్పాట్లని ప్రణాళిక అమలుపరిచే ముందుగా కానీ, సమాంతరంగా కానీ చేపట్టాలి. అంతేకాదు! నగరంలో నివాసపరమైన, వ్యాపారపరమైన, ప్రజాపరమైన భారీ ప్రాజెక్టు ఏదన్నా చేపట్టినప్పుడు... వాటికి సొంతగా మురుగునీటి పారిశుధ్య వ్యవస్థా, పొడి చెత్తని విసర్జించే వినియోగించే వ్యవస్థా ఏర్పాటు చేసుకునేలా నిబంధనలు విధించాలి.

167. పైన పేర్కొన్న విషయాలన్నిటినీ కూలంకషంగా పరిశీలించిన మీదట, ప్రస్తుత వివాదంలో ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వాలనే విషయం మీద నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ఈ సందర్భంగా ధర్మశాస్త్రానికి సంబంధించిన మూడు ముఖ్య సూత్రాలను ఈ ట్రిబ్యునల్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. అవే – నిలకడగా ఉండే అభివృద్ధి సూత్రం, ముందుజాగ్రత్త సూత్రం, కాలుష్యకారకులే ఖర్చుని భరించాలనే సూత్రం. ఈ మూడు సూత్రాలకు అనుబంధంగానే కాకుండా నగరంలోని పర్యావరణ, జీవావరణ పరిరక్షణని కూడా దృష్టిలో ఉంచుకొని మేము

తుది ఉత్తర్వులను వెలువరించాల్సి ఉంటుంది. ఇప్పటి ప్రణాళికను జాగ్రత్తగా, యథాతథంగా, జీవావరణ పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా కనుక చేపడితే... అది జీవావరణ, పర్యావరణలకు విఘాతం కలిగించదని మేము ఈపాటికే తేల్చి చెప్పాం. నిలకడగా ఉండే అభివృద్ధికి దారి తీసే అనేక అంశాల విషయంలో కూడా ట్రిబ్యునల్ సమతుల్యతను పాటించాల్సి ఉంటుంది. నగరాన్ని నిర్మించే ప్రణాళికని సంబంధిత న్యాయ, పాలనా శాఖలు రూపొందించాయి. రాష్ట్రానికి ఒక రాజధాని తప్పకుండా ఉండాలి. ప్రస్తుతం ఉన్న ప్రాంతాన్ని మించి మరో మెరుగైన ప్రత్యామ్నాయం ఏదీ ట్రిబ్యునల్ దృష్టికి రాలేదు. ఈ ప్రణాళికను అమలుపరిచే దిశలో, ప్రజాధనంతో ఇప్పటికే భారీ నిర్మాణాలను చేపట్టారు. ఈ దశలో నిషేధిత ఉత్తర్వులను వెలువరించడం వల్ల రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయి. పైగా ఈ ప్రాంతంలో పర్యావరణ, జీవావరణ పరిస్థితులు కూడా క్షీణిస్తాయి. ఇలాంటి ఉత్తర్వులతో ప్రజోపయోగానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

168. పై కారణాలతో మేము ఈ ఉత్తర్వులను వెలువరిస్తున్నాము:

i. 9 అక్టోబరు 2015న మేము జారీచేసిన పర్యావరణ అనుమతిని వెనక్కి తీసుకునేందుకు నిరాకరిస్తున్నాం. అయితే ఈ ప్రాజెక్టు ఇ.ఐ.ఎ. ఉత్తర్వు 2006లో క్యాటగరీ బి కి చెందుతుందని నిర్ణయించి తదనుగుణంగా కొన్ని అదనపు నిబంధనలు విధించాల్సి ఉంటుందని భావిస్తున్నాము. అందువలన ఇప్పటికే జారీచేసిన పర్యావరణ అనుమతిని కొద్దిపాటి మార్పులతో అనుమతినివ్వడమైనది.

ii. ఇప్పటికే జారీ చేసిన పర్యావరణ అనుమతికి ఈ దిగువ షరతులను జోడించాల్సిందిగా ఆదేశిస్తున్నాము:

1) పథకాన్ని ప్రతిపాదిస్తున్నవారు, ఈ ప్రాంతంలోని భూస్వరూపం మీద నీటి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు కానీ, చేయించేందుకు కానీ చర్యలు

తీసుకోవాలి. సదరు అధ్యయనానికి అనుగుణంగా కుంటలు, జలాశయాలు, వరద నీటి కాలువలు.. వాటి మధ్య అనుసంధానాన్నీ నిర్మించాలి. భూ ఉపరితలంలోనూ, భూగర్భంలోనూ నీటి వనరులు మెరుగుపడేందుకు ఇలాంటి అధ్యయనం తోడ్పడుతుంది.

2) రాజధానిలో నిర్మించే వరద కాలువలు, జలాశయాలో మార్పులు చేయడం వల్ల ముంపు ప్రాంతాలు కూడా మారినట్లయితే... అధ్యయనం చేసిన తర్వాతే సదరు మార్పులను చేపట్టాలి.

3) నదీ ప్రవాహ దిశను కానీ, వరద నీటి ప్రవాహ దిశను కానీ నేరుగా మళ్లించేందుకు ఎలాంటి మార్పులూ అనుమతించరు. అలాంటి మార్పులు వల్ల నీటి వేగం పెరిగి నేల కోతకు గురికావడం, నీటి అడుగున మట్టి పేరుకోవడం జరుగుతుంది. ఈ కారణంగా భూగర్భజలాలు కూడా అడుగంటే ప్రమాదం ఉండటంతో వేసవిలో నీటి లభ్యత కష్టమవుతుంది.

4) రాజధాని నగరాన్ని వరద నుంచి సురక్షితంగా ఉంచేందుకు తప్ప, ముందుగా ఏర్పరుచుకున్న గట్లలో ఎలాంటి మార్పునీ చేపట్టకూడదు. అప్పుడు కూడా వరద నీటి ప్రవాహాలనీ, నది లేక వరద నీటి కాలువల తీరుని కూలంకషంగా అధ్యయనం చేసిన తర్వాతే సదరు మార్పుని చేపట్టాలి.

5) ఎక్కువ స్థాయిలో వ్యర్థాలను విడుదల చేసే నివాస, నివాసేతర నిర్మాణాలలో... వ్యర్థాలను వేరు చేసి, అందులో ఉపయుక్త వ్యర్థాలను కంపోస్టుగానో, బయోగ్యాస్ గానో ఆయా నిర్మాణ పరిసరాలలోనే మార్చగలగాలి.

6) వర్షపు నీటినీ, సౌర శక్తినీ వినియోగించుకునేందుకు; భవనాలలో నీటిని పొదుపు చేసే యంత్రాలు అమర్చేందుకు; మురికి నీటిని మరుగుదొడ్లకీ, తోటపనులకీ ఉపయోగించుకునేందుకు... ప్రభుత్వమూ, సంబంధిత శాఖలు తగిన నిబంధనలను రూపొందించాల్సి ఉంటుంది.

7) రాష్ట్ర ప్రభుత్వం, నగరంలో కర్బన వాయువులను నియంత్రించేందుకు, రాబోయే ఆరునెలలలో ఒక ప్రణాళికను రూపొందించాలి. ఆ ప్రణాళిక ఆధారంగా ఒక కార్యాచరణను రూపొందించాలి.

8) కొండవీటివాగు, దాని ఉపవాగులు, ఇతర జలాశయాలు, కాలువల ఆయకట్టు పరిధిలో ఉన్న కొండలు, గుట్టలలో... నీటి ప్రవాహాన్ని అదుపు చేసేందుకు, భూగర్భజలాలను పెంపొందించేందుకు అడవుల పెంపకం సహా నీటినీ, నేలనీ సంరక్షించే చర్యలన్నింటినీ తీసుకోవాలి.

9) రాజధాని నగరంలో ప్రస్తుతం 251 ఎకరాల అటవీ భూమి ఉంది. నగరానికి స్వచ్ఛమైన ఊపిరులందించేందుకు ఈ భూమిని కాపాడవలసి ఉంటుంది. ఈ భూమికి ఉండే సహజమైన లక్షణాలను దూరం చేసేలా, వినోదానికి కానీ ఉద్యానవనాలకు కానీ సదరు భూమిని వినియోగించరాదు. అలా చేయడం వల్ల అటవీభూమి మాత్రమే అందించగల సహజసిద్ధమైన ప్రయోజనాలు రాజధానికి అందకుండా పోతాయి.

III. పైన పేర్కొన్న తీర్పు అమలయ్యేలా,అందులోని సూచనలు పాటించేలా చూసేందుకు; పర్యావరణ, జీవావరణ దృష్ట్యా... ప్రణాళికను అమలుపరుస్తున్న సంస్థల మీద తగిన చట్టపరమైన నియంత్రణ సాగించేందుకు... మేము ఈ దిగువ సంఘాలను నియమిస్తున్నాం. అవి నిర్వర్తించాల్సిన విధులను కూడా ఇక్కడ పొందుపరుస్తున్నాము.

i. పర్యవేక్షక సంఘం: ఈ సంఘంలో ఉండే సభ్యుల వివరాలు:

ii. పర్యావరణం, అడవులు శీతోష్ణ స్థితి మార్పు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి-– సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.

iii. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యావరణశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి– ఈ సంఘంలో సభ్యునిగాను, నోడల్ అధికారిగానూ వ్యవహరిస్తారు

iv. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ (ఉత్తరాఖండ్, రూర్కీ) సంచాలకుడు ఎంపిక చేసిన ఓ అనుభవజ్ఞుడైన శాస్త్రవేత్త.

v. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు) సంచాలకుడు ఎంపిక చేసిన ఓ అనుభవజ్ఞుడైన శాస్త్రవేత్త.

vi. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ మండలికి చెందిన సభ్యకార్యదర్శి.

vii. సావిత్రీబాయి పూలే పూణె విశ్వవిద్యాలయం భూగర్భశాఖకు చెందిన ప్రొఫెసర్ ఎన్.జే. పవార్.

II. అమలు సంఘం: ఈ సంఘంలో దిగువ పేర్కొన్నవారు సభ్యులుగా ఉంటారు.

i. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యావరణశాఖ  అదనపు ముఖ్య కార్యదర్శి – ఈ సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తారు

ii. పర్యావరణం, అడవులు శీతోష్ణ స్థితి మార్పు మంత్రిత్వ శాఖ నామినేట్ చేసే సభ్యుడు.

iii. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ మండలికి చెందిన సభ్యకార్యదర్శి.

iv. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు) సంచాలకుడు ఎంపిక చేసిన ఓ అనుభవజ్ఞుడైన శాస్త్రవేత్త.

v. డా. కడియాల వెంకటేశ్వర్లు – శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో (అనంతపూర్) సూక్ష్మజీవశాస్త్రంలో పూర్వ ప్రొఫెసర్.

పర్యవేక్షక సంఘం కనీసం మూడు నెలలకి ఓసారి సమావేశం కావాలి. ఇందులో విధానపరమైన నిర్ణయాలనే కాకుండా... పర్యావరణ అనుమతులను సాధించేందుకు, పై తీర్పులో పేర్కొన్న సూచనలను అమలుపరిచేందుకు అవసరమైన నిర్ణయాలను తీసుకోవలసి ఉంటుంది.

అమలు సంఘం నెలకి ఓసారైనా కలుసుకుని ఈ తీర్పులో పేర్కొన్న సూచనలకి అనుగుణంగా పర్యవేక్షణ సంఘం తీసుకున్న నిర్ణయాలు అమలుజరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రణాళికను అమలు చేసే సంస్థ భవిష్యత్తులో కూడా నిబంధనలను

పాటించేలా జాగ్రత్త వహించాలి. నిబంధనల అమలుకి సంబంధించి ఎప్పటికప్పుడు ఈ సంఘం నివేదికలను రూపొందించాలి.

కమిటీ ఉన్న సభ్యులెవ్వరూ కూడా పర్యావరణ అనుమతులని ఇచ్చే సంఘంలో కానీ డి.పి.ఆర్ లేదా ఇ.ఐ.ఎ. ప్రక్రియలో కానీ పాలుపంచుకునే సభ్యులు కారాదు.

IV. 09.05.2015న ఇ.సి అనుమతిని ఇచ్చే సమయంలో సూచించిన నిబంధనలూ, ఈ తీర్పులో పేర్కొన్న సూచనలూ ఎలాంటి ఆలస్యమూ, అలక్ష్యమూ లేకుండా అమలు జరిగేలా సదరు కమిటీ చర్యలు తీసుకోవాలి.

V. పైన పేర్కొన్న నిబంధనలన్నీ ఎప్పటికప్పుడు అమలయ్యేలాగా గమనిస్తూ, ప్రణాళిక అమలవుతున్న తీరుని పరిశీలిస్తూ ఉండాలి.

VI. అమరావతిలో రాజధాని నగరాన్ని నిర్మించ తలపెట్టిన ప్రణాళికను కమిటీ ఆమూలాగ్రం తనిఖీ చేయాలి. పర్యావరణానికి సంబంధించి నీరు, అడవులు, కాలువలు, తడిభూములు, జీవావరణ పర్యావరణాల మీద ప్రణాళిక ప్రభావం, కాలుష్య నివారణా నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలు... అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రణాళికా బాధ్యులకి కాలపరిమితితో కూడిన అదనపు సూచనలు, నిబంధనలు విధించవచ్చు. ప్రణాళికా బాధ్యులు సకాలంలో ఆ సూచనలు, నిబంధనలను పాటించి తీరవలసి ఉంటుంది.

VI. కమిటీ ప్రతి ఆరునెలలకు ఓసారి తన నివేదికని సమర్పించవలసి ఉంటుంది. అయితే మొదటి నివేదిక మాత్రం ఈ తీర్పు వెలువడిన మూడు నెలల తర్వాత సమర్పించాలి. నివేదికను అందుకున్న వెంటనే, అందులోని సూచనలను అమలుపరచడం కోసం, దానిని అధికారికంగా నమోదు చేయడం జరుగుతుంది.

VIII. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తరుణోపాయాలని కానీ, నివారణని కానీ సూచిస్తూ ప్రణాళికా బాధ్యులకు మరిన్ని సూచనలు చేసే స్వతంత్రత కమిటీకి ఉన్నది.

IX. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు, మురుగు నీటిని వినియోగించేందుకు, నీటిని పొదుపు చేసే పరికరాల ఏర్పాటుకీ, నిర్మాణాలలో ఫ్లై యాష్ ఇటుకల

వాడకానికీ... ఇ.సి కొన్ని నిబంధనలను రూపొందించింది. మిగతా నిబంధనలతో పాటుగా సదరు నిబంధనలు కూడా అమలయ్యేలా చూడవలసిన బాధ్యత కూడా కమిటీకి ఉన్నది.

169. ప్రణాళికా బాధ్యతల కమిటీకి అయిదు కోట్ల రూపాయలు బ్యాంకు అవృత (రివోల్వింగ్) హామీని అందించాల్సి ఉంటుంది. ఇ.సి. లో పేర్కొన్న నిబంధనలను కానీ, తీర్పులో పేర్కొన్న నిబంధనలను కానీ, కమిటీ ఆదేశించిన సూచనలు/నిబంధనలను కానీ అతిక్రమించినా, అలక్ష్యం చేసినా సదరు నగదు తిరిగి ఇవ్వరు. అయితే ట్రిబ్యునల్ ఆదేశాలు, చట్టాల మేరకు ప్రణాళికా బాధ్యునికి ఒక షోకాజ్ నోటిసు జారి చేసిన తర్వాతే బ్యాంకు హామీని జప్తు చేసుకోవడం జరుగుతుంది.

170. తదనుగుణంగా, పైన పేర్కొన్న నిబంధనలతో మేము మూల అభ్యర్థన సంఖ్య. 171, 2015; అపీలు సంఖ్య. 148/2015. అపీలు సంఖ్య. 05/2016, అపీలు సంఖ్య. 24/2016 లను కొట్టివేయడమైంది. వాటికి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులూ జారీచేయడం లేదు.

171. మూల అభ్యర్థనతో పాటుగా ఎం.ఎ. సంఖ్యలు 510/2015, 1148/2015, 1108/2016, 1325/2015, 1326/2015, 56/2016, 64/2016, 399/2016లను కూడా పరిగణనలోకి తీసుకోకుండా కొట్టివేస్తున్నాం.

జస్టిస్ స్వతంతే ర్ కుమార్
(అధ్యక్షుడు)
జస్టిస్ రాఘువేంద్ర ఎస్. రాథోడ్
(న్యాయ సభ్యుడు)
బిక్రం సింగ్ సజ్వాన్ (నిపుణ సభ్యుడు)
న్యూ దిల్లీ.
తేదీ: 17 నవంబరు, 2017

HYDERABAD TRANSLATION BUREAU
Siri Sai Orchids, Flat: 401, (Upper Floor),
Image Hospital Lane,
Beside Venkateshwara College,
Madhapur, Hyderabad- 500 081.
Tel: 23112244, 23114654, Mob: 9912345151/9949344849
8/12/17



The above matter is translated from English to Telugu language, and the translation is true & correct as per our knowledge. In case of any dispute the original document is considered as final & Decisive
Translated by: Mr. T. Raghuram & Mr. R.V. Ramarao Senior Language Translators.